SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 07
December - 2024, Price Rs.20/-.

తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

డిసెంబరు 2024
వెల రూ. 20/-
పుటలు - 56



కొలిచితే రక్షించే గోవిందుడితడు
యిలకు లక్ష్మికి మగడీ గోవిందుడితడు
- అన్నమయ్య




# శ్రీవేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టు

## (ఒక్కరోజు విరాళపథకం)

అన్నం పరబ్రహ్మస్వరూపం. ఆకలిగా ఉన్నవాడికి అన్నం పెట్టడంకంటే పుణ్యం మరొకటి లేదు. ఈ సదాశయంతోనే తిరుమల తిరుపతి దేవస్థానం తిరుమల, తిరుపతి, తిరుచానూరులలో నిత్యం అన్నప్రసాదవితరణ చేస్తోంది. దీనికి ఎంతోమంది దాతలు విరివిగా విరాళాలు ఇవ్వడమూ తెలిసిన విషయమే! అయితే, భూరివిరాళాలు ఇచ్చే సౌకర్యం అందరికీ ఉండకపోవచ్చు. దీన్ని గమనించి తి.తి.దే. ఒక్కరోజు అన్నప్రసాదానికి అయ్యే ఖర్చునుకూడా భక్తులనుండి విరాళంగా స్వీకరించేందుకు సంసిద్ధమైంది. భక్తులూ స్పందించండి! తోటివారి ఆకలి తీర్చండి!! మాధవుని అనుగ్రహాన్ని పొందండి!!!

### ఒకరోజు ఖర్చు..

| | |
|---|---|
| 1) అల్పాహారం(టిఫిన్) | - రూ.10 లక్షలు |
| 2) మధ్యాహ్నభోజనం | - రూ.17 లక్షలు |
| 3) రాత్రిభోజనం | - రూ.17 లక్షలు |
| మొత్తం | - రూ.44 లక్షలు |

ఈ మొత్తాన్ని దాతలు తి.తి.దే. అన్నప్రసాదం ట్రస్టుకు అందజేయవచ్చు

ఈ విరాళాలను కేవలం వ్యక్తిగతంగానేకాక, కంపెనీలు, సంస్థలు, ట్రస్టులు సంయుక్తంగా కూడా విరాళాలు అందజేయవచ్చు.


దాతలు రోజువారి మొత్తం (రూ.44 లక్షలు) గానీ, అల్పాహారం (రూ.10 లక్షలు) గానీ, మధ్యాహ్నభోజనం (రూ.17 లక్షలు) గానీ, రాత్రిభోజనం - (రూ.17 లక్షలు) గానీ ఎంపిక చేసుకుని వితరణ చేయవచ్చు. రోజువారి మొత్తం రూ.44 లక్షలు విరాళమిచ్చే దాతలకు రూ.25 లక్షలు ఇచ్చే దాతలకు కల్పించే సదుపాయాలు; అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం విరాళాలిచ్చే దాతలకు రూ.10 లక్షలు ఇచ్చే దాతలకు కల్పించే సదుపాయములను దాతలకు తి.తి.దేవస్థానములు కల్పించే సౌకర్యాలు ఒకే విధంగానే ఉంటాయి.

ఇందులో పాల్గొన్న భక్తదాతలకు వారు కోరినరోజున మాత్రమే భక్తులకు స్వయంగా వడ్డించే అవకాశం మరియు వారిపేరును మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదవితరణకేంద్రంలో ప్రదర్శించబడుతుంది.

మరిన్ని వివరాలకు - ఉపకార్యనిర్వహణాధికారి (డోనార్‌సెల్), ఆదిశేష గెస్ట్‌హౌస్, తి.తి.దే., తిరుమల.
ఫోన్ - 0877-2263001, 2263472. మెయిల్ ఐడి- cdmc.ttd@tirumala.org







# గీతాశ్లోకార్థసారం

**శ్లో :** నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః ।
న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః ॥

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-23వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** ఏనమ్= దీనిని (ఈ ఆత్మను); శస్త్రాణి= శస్త్రములు; న, ఛిందంతి= ఛేదింపజాలవు; ఏనమ్= దీనిని; పావకః= అగ్ని; న, దహతి= దహింపజాలదు; ఏనమ్= దీనిని; ఆపః= నీరు, న, క్లేదయంతి= తడుపజాలదు; చ= మఱియు; మారుతః= గాలి; న, శోషయతి= ఆరిపోవునట్లు చేయజాలదు.

**భావం:** ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఆరిపోవునట్లు చేయజాలదు.

## పరమాత్ముఁడితడే బాలుడై వున్నాఁడు...

అనుచు మునులు ఋషు లంతనింత నాడఁగాను
వినియు విననియట్టె వీడె యాడీఁగాని

ముకుందుఁ డితఁడు మురహరుఁ డితఁడు
అకటా నందునికొడుకాయఁగాని
శకుంతగమనుఁ డితఁడు సర్వేశుఁ డితఁడు
వెకలి రేపల్లెవీథి విహరించీఁగాని

వేదమూరితి ఇతఁడు విష్ణుదేవుఁ డితఁడు
కాదనలేక పసులఁ గాచీఁగాని
ఆదిమూల మితఁడు యమరవంద్యుఁ డితఁడు
గాదిలిచేఁతల రోలఁ గట్టువడెఁగాని

పరమాత్ముఁ డితఁడే బాలుఁడై వున్నాఁడుగాని
హరి యీతఁడే వెన్నముచ్చాయఁగాని
పరగ శ్రీవేంకటాద్రిపతియును నీతఁడె
తిరమై గొల్లెతలచేఁ దిట్టువడీఁగాని

(అధ్యాత్మ సంకీర్తన; సంపుటం-04; సంకీర్తన-249)





*"ఆశ్చర్యము! నందునిపుత్రుడుగా అవతరించిన ఈతడే మురుడనే రక్కసుని సంహరించినాడు. గోవర్ధనగిరిని ధరించినాడు. వ్రేపల్లెలో తిరిగిన వాడుగదాయని సామాన్యమానవునిగా లెక్కింపరాదు. ఇతడు సకలమునకు ప్రభువు. యజ్ఞసంరక్షకుడు. అడవిలో పశువులు మేపినవాడని తక్కువగా దలపరాదు. ఇతడు వేదస్వరూపుడు. సకలవ్యాపకుడు. వెన్నదొంగయై రోట కట్టువడెనని చులకనగ చూడరాదు. ఇతడు ఆదిమూలమా యని తన్ను వేడిన గజేంద్రుని రక్షించినవాడు. దేవతలకుగూడ నమస్కరింపదగినవాడు. ఇతడు బాలుడని భావింపరాదు. శ్రీదేవియందు ఆసక్తి గలవాడు. వెన్నదొంగయైనను సాధురక్షణార్థమై అవనిలో నవతరించినవాడు. గొల్లెతల ప్రణయపూర్వకమైన దూరునకు పాత్రమైనను ఇతడు వేంకటాచలపతిగా వెలసియున్నాడు"* అని అన్నమయ్య శ్రీవేంకటాద్రిపతి శ్రీకృష్ణుడుగా అవతరించినప్పటి చర్యలు, మహిమలు వర్ణించిన రీతి అమోఘం.

*వ్యాఖ్యానం:* కీ॥శే॥ విద్వాన్ ముదివర్తి కొండమాచార్యులు

# మానసిక ప్రశాంతతకు 'యోగసాధన'

– డా॥ కప్పగంతు రామకృష్ణ

'యోగా'...కేవలం రెండక్షరాల పదం. ఆధునిక మానవజీవితానికి పరమౌషధం. వైద్యశాస్త్రం మొదలు విజ్ఞాన శాస్త్రం దాకా శాస్త్రాలన్నీ ముక్తకంఠంతో 'యోగా'కు యోగ్యతా పత్రం ఇచ్చాయి. యోగ ఒక సమగ్ర జీవనవిధానం. ఇందులో అనేక ప్రక్రియలుంటాయి. ప్రాణాయామంతో పాటుగా అనేక భౌతికపద్ధతుల ద్వారా శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచటానికి ఇవి దోహదం చేస్తాయి. 'యోగ' అంటే ఇంద్రియాలని వశం చేసుకొని, మనస్సుని భగవంతుని మీద కేంద్రీకరించటం అనే అర్థం చెప్పుకోవచ్చు. మరొక అర్థంలో సాధన, అదృష్టం అని కూడా చెప్పుకోవచ్చు.



భారతీయ తత్త్వశాస్త్రంలో అంతర్భాగమైన ఆరు దర్శనాలలో 'యోగ' లేదా 'యోగదర్శనం' ఒకటి. ఈ యోగ దర్శనానికి ప్రామాణికతను ప్రసిద్ధిపొందిన పతంజలి యోగ సూత్రాల ప్రకారం 'యోగ'మంటే 'చిత్తవృత్తి నిరోధం' అని అర్థం. యోగా అంటే వ్యాయామ సాధనాల సమాహారాల 'ఆధ్యాత్మిక రూపం'. యోగసాధన చేసేవాళ్ళను 'యోగులు' అంటారు. వీరు సాధారణ సమాజ జీవితానికి దూరంగా ఆశ్రమజీవితం గడుపుతూ సాధన, శిక్షణ లాంటివి నిర్వహిస్తూ ఉంటారు.

## 'యోగ' ఎందుకు?

యోగ అంటే కఠినమైన వ్యాయామం చెయ్యటం కాదు. యోగ అనేది ఒక విధానం. మనిషి తన జీవితంలో చేరుకోగలిగిన అత్యున్నతస్థితికి అతడిని చేర్చే 'ఆధ్యాత్మిక సాధనా మార్గం'. యోగ– మనిషిని అతడి గమ్యం చేరుకునే దిశగా ప్రోత్సహిస్తుంది. మనస్సుకు స్థిరత్వాన్ని కలిగిస్తుంది. జీవితంలోని ప్రతి అడుగులో అతడి నడవడికను తీర్చిదిద్దుతుంది. అంతిమంగా కచ్చితమైన మార్గంలో జీవన లక్ష్యాన్ని చేరుకునేలా మార్గదర్శనం చేస్తుంది.

యోగసాధన వల్ల వ్యక్తిలోని ఆధ్యాత్మికశక్తి పునరుత్తేజం పొందుతుంది. మనసు ఆధీనంలోకి వస్తుంది. ఒక్కసారి మెదడు సామరస్యంతో స్ఫూర్తిని కలిగి ఉంటే ఆలోచనలు కూడా హద్దుల లోనే ఉంటాయి. కాలం గడుస్తున్నకొద్దీ యోగ సాధకుడు తన బుద్ధి తాలూకు కార్యకలాపాల్లో చురుకైన, ఆశావహదృక్పథమైన రూపాంతరాన్ని అనుభవిస్తాడు. ఈ మార్పు కచ్చితంగా జీవన విధానంపై ప్రతిబింబిస్తుంది.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 డిసెంబరు, 2024 సంచిక : 07




వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥

## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| మానసిక ప్రశాంతతకు 'యోగసాధన' | డా॥ కప్పగంతు రామకృష్ణ | 04 |
| ఆనందనిలయుని తపఃఫలం! శ్రీఅలమేలుమంగ!! | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 07 |
| శ్రీవేంకటాచల మాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| గోదాదేవి - శ్రీరామాయణ పురుషులు | శ్రీమతి ఈ.విజయలక్ష్మి | 13 |
| మారుతీ! నీకిదే ప్రస్తుతి!! | శ్రీ జంధ్యాల శరత్‌బాబు | 16 |
| తన్నో షణ్ముఖః ప్రచోదయాత్ | డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు | 18 |
| ఆళ్వారులు కొలిచిన 108 దివ్యదేశాలు | శ్రీ కె.సి.నాయుడు | 21 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 22 |
| యువశక్తి... నవ్యభక్తి | శ్రీ జె.దీపక్ | 23 |
| తిరుత్తేవనార్‌తొగై (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 25 |
| ఉపదేశ సందేశం | శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ | 31 |
| సందేహాలు-సమాధానాలు | డా॥ రేవూరు అనంతపద్మనాభరావు | 34 |
| శ్రీ జాబాలి ఆంజనేయస్వామి, తిరుమల | శ్రీమతి కె. విజయలక్ష్మి | 35 |
| 'ఆళ్వార్ల' వైభవం | శ్రీ ఆర్.సుధన్వన్ | 37 |
| 'భగవంతుని అర్చించండి' | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ | 38 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 39 |
| ఋష్యశృంగమహర్షి | శ్రీమతి భమిడిపాటి వి.బాలత్రిపురసుందరి | 40 |
| అనుకుంది జరిగింది! | శ్రీమతి భాస్కరభారతీదేవి | 43 |
| గురు-శిష్యులు (బాలనీతి) | శ్రీమతి బి.వి.టి.సుందరి | 44 |
| జామలో ఔషధ గుణాలు పుష్కలం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 46 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 47 |
| మహాదాత (చిత్రకథ) | కథ : శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు<br>చిత్రాలు : శ్రీ కె.ద్వారకనాథ్ | 48 |
| బాలవినోదం | | 50 |
| ఏదీ శాశ్వతంగా సొంతం కావు (వేమనశతకం) | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| శౌరికి కలిగె లక్ష్మియు, కౌస్తుభరత్నాలు (భాస్కరశతకం) | డా॥ పల్లేరు వీరాస్వామి | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీవేంకటాద్రి గోవిందుడు
వెనుకచిత్రం : గోదాదేవి


గౌరవ సంపాదకులు
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

సంపాదకులు
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

ఉపసంపాదకురాలు
డా॥ అల్లాడి సంధ్య, ఎం.ఏ. (తెలుగు & సంస్కృతం), ఎం.ఫిల్., పిహెచ్.డి., పి.జి.డిప్లొమా ఇన్ జర్నలిజం

ముద్రాపకులు
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం), తి.తి.దే., తిరుపతి.

ఫోటోలు
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.,

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు- sapthagiri.helpdesk@tirumala.org; ద్వారా తెలియజేయవచ్చు.


24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.

0877 2277777 / 2233333




ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

సంపాదకీయం

# తిరుమలలో తిరుప్పావై

ఆర్తత్రాణపరాయణుడైన ఘనవేంకటగిరినాథునికి ప్రతిరోజూ ఉదయం **'సుప్రభాతం'** మొదలుకొని రాత్రి **'ఏకాంతసేవ'** వరకూ ఎన్నో ఉత్సవాలు జరుగుతాయి. ఇంత మాత్రమేగాక తిరుమలస్వామికి **నిత్యోత్సవాలు, వారోత్సవాలు, పక్షోత్సవాలు, మాసోత్సవాలు, వార్షికోత్సవాలు** అత్యంత వైభవంగా జరుపబడుతున్నాయి.

ఇలా ఎన్నోసేవలు జరుగుతున్నప్పటికీ ప్రతిదినం శ్రీవేంకటేశ్వరస్వామివారికి దినచర్య **"కౌసల్యా సుప్రజా రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే"** అను సుప్రభాతస్తవంతోనే ప్రారంభమవుతుంది. ఈ సుప్రభాతసేవ **ధనుర్మాసంలో** ఒక్క నెలరోజులపాటు తప్ప మిగిలిన సంవత్సరమంతా సాగుతున్నది. ధనుర్మాసంలో ఒక నెలరోజులపాటు **గోదాదేవి(ఆండాళ్)** స్వామిని కీర్తించిన **"తిరుప్పావై"** పాశురాల గానం జరుగుతుంది. ఈ ధనుర్మాసం ప్రతి సంవత్సరం సాధారణంగా **మార్గశిర-పుష్యమాసాల్లో** వస్తుంది. అంటే సౌరమానం ప్రకారం **డిసెంబర్ 15 లేదా 16వ** తేదీల్లో ప్రారంభమై **జనవరి 14** తో ముగుస్తుంది.

తమిళసాహిత్యంలో నాలుగువేల పాశురాలు (పాటలు)గల **"నాలాయిరదివ్యప్రబంధం"** చాలా ప్రసిద్ధమైనది. దీనిని వైష్ణవ భక్తాగ్రేసరులైన పంద్రెండుగురు **"ఆళ్వార్లు"** భగవంతుణ్ణి కీర్తిస్తూ గానం చేశారు. వీరినే **దివ్యసూరులని, పరమయోగులనీ** కూడా అంటారు.

పరమయోగులైన ఈ ఆళ్వార్లు శ్రీమహావిష్ణువుగూర్చి పరవశించి పాడిన పాశురప్రబంధాలు వేదాలవలె సంభావింపబడుతున్నాయి. అందులో **"తిరుప్పావై"** అనే ముప్పది పాశురాల కర్త **గోదాదేవి.** ఈమె **'పెరియాళ్వారు'** అని ప్రసిద్ధి పొందిన **విష్ణుచిత్తుని** పెంపుడుబిడ్డ. శ్రీవిల్లిపుత్తూరులోని వటపత్రశాయియైన శ్రీమహావిష్ణువుకు, విష్ణుచిత్తుడు కైంకర్యం చేస్తున్న పూలమాలల్ని ముందుగా తాను ధరించి, మళ్ళీ వాటిని స్వామివారి కైంకర్యానికి పంపినందువల్ల ఈమెకు **"ఆముక్తమాల్యద"** అనీ, **"చూడికొడుత్త నాచ్చియార్"** అని పేర్లు ఏర్పడ్డాయి.

వైష్ణవభక్తాగ్రేసరులు అనేకమంది దర్శించి కీర్తించిన వైష్ణవ ప్రధానక్షేత్రం **"తిరుమల"**. **పొయిగై ఆళ్వార్, తిరుమళిశై ఆళ్వార్, నమ్మాళ్వార్....** మున్నగువారు శ్రీవేంకటాచలపతిని దర్శించి అనేక రీతుల కీర్తించి గానం చేశారు. ఏకైక స్త్రీ ఆళ్వారుగా ప్రసిద్ధి పొందిన **'ఆండాళ్'** కూడా తిరుమల సందర్శించి కీర్తించింది.

***"వెయ్యదోర్ తళలుమిళ్ శక్కరక్కై, వేంగడవర్కెన్నై విదికిత్తియే"-*** గోదాదేవి చెప్పిన ఈ అంకిత భావాన్ని దృష్టిలో ఉంచుకొని **భగవద్రామానుజులవారు** తిరుమల తిరుపతి ఆలయాల్లో **"తిరుప్పావై"** పఠనను ప్రతి ధనుర్మాసంలో అనుష్ఠింపజేశారు. రామానుజాచార్యులవారికి గోదాదేవి మీదా, ఆమె చెప్పిన **"తిరుప్పావై"** మీదా అత్యంత భక్తీ, ప్రపత్తి కూడా. ఈ తిరుప్పావై సర్వవేదసారమని వ్యాఖ్యానించి, ప్రచారం చేసిన శ్రీరామానుజులు **"తిరుప్పావై జీయర్"**గా ప్రసిద్ధి పొందారు.

ఈ నెల అంతా తిరుమలలో శ్రీనివాసునికి సుప్రభాతానికి బదులుగా జియ్యంగార్లు, ఏకాంగి, వైష్ణవాచార్యులు మున్నగువారు **ఆండాళ్ తిరుప్పావై** పఠనాన్ని ఏకాంతంగా నిర్వహిస్తారు. ధనుర్మాసం ముప్పైరోజులూ శ్రీవేంకటేశ్వరుని శ్రీకృష్ణునిగా భావించి పూజలు జరుపుతారు అర్చకులు.

అందుకే ఏడేడు లోకాల్లో ఈడేలేని, సరిజోడే లేని ఏడుకొండలక్షేత్రంలో ప్రత్యేకంగా **"ధనుర్మాసపు"** నెలరోజుల్లో ఆనందనిలయుని సన్నిధిలో జరిగే ఉత్సవ విశేషాల్లో పాలుపంచుకొని తరిద్దాం రండి ...

*॥ ఓం నమో వేంకటేశాయ ॥*

# ఆనందనిలయుని తపఃఫలం!
# శ్రీఅలమేలుమంగ

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152



ఏమిటీ! సాక్షాత్తు **ఆనందనిలయుడే** తపస్సు చేశాడా! ఏడుకొండలపైన బంగారుమేడ ఆనందనిలయంలో కొలువై ఉండే స్వామి నిజంగానే తపస్సు చేశాడా! ఆ దేవాదిదేవుడు తపస్సు చేస్తే, ఫలితంగా **అలమేలుమంగమ్మ** అవతరించిందా!

బలే విచిత్రంగా ఉందే! విడ్డూరంగానూ ఉంది. ఇది ఎక్కడ జరిగిన కథో? ఏనాడు జరిగిన గాథో? నిజంగా నమ్మ దగిన కథేనా!

ఇది విచిత్రం కానే కాదు. విడ్డూరం అసలే కాదు. ఇప్పటికి సుమారు ఐదువేల ఏండ్ల కిందట జరిగిన సత్యమైన గాథ!

## రెండుచోట్ల తపస్సు

ఆనందనిలయుడు ఒక్కసారి కాదు. ఒక్కచోట కాదు. రెండు మార్లు, రెండు దివ్యస్థలాల్లో తపస్సు చేశాడు. అది కూడ ఒక క్షేత్రంలో పదేండ్లపాటు, మరో క్షేత్రంలో పన్నెండేండ్ల పాటు మొత్తం ఇరవై రెండేండ్ల పాటు నిద్రాహారాలు మాని తపస్సు చేశాడు. ఎవరికోసం? ఎందుకోసం? అంటే భక్తులందరి కోసం జగత్కల్యాణంకోసం తపస్సు చేశాడు. ఆనందనిలయుని తపస్సుకు ఆనందించిన **శ్రీఅలమేలుమంగమ్మ** సమస్త జగత్కల్యాణ సంధాత్రిగా అవతరించింది.

ఆ అలమేలుమంగ కటాక్షమే భక్తులపాలిటి **కామధేనువు!** ఆ జగన్మాత నిండు మనస్సే **చింతామణి!** ఆ యమ్మ చేతులే కోరికలను తీర్చే **కల్పవక్షాలు!** ఇక నిలువెత్తుగా ఉన్న ఆతల్లి దివ్యమంగళ స్వరూపదర్శనమే **నవనిధులరాశి!** ఆమె కురిపించే దయారసమే **ఆనందామృతం!** పున్నమి చందమామ లాంటి అమ్మ ముఖారవిందం సమస్త కళలకు **కాణాచి!**

ఇలా ఎన్నో ఎన్నెన్నో విశిష్టగుణాలతో ప్రకాశిస్తూ సమస్త వాంఛితార్థాలను అనుగ్రహించే అమ్మ అలమేలుమంగమ్మ దివ్యగాథను ఆనందంగా ఆస్వాదించుదాం.

## అలమేలుమంగపట్నం-తిరుచానూరు

అలమేలుమంగమ్మ ఆనందనిలయుని పట్టపుదేవేరిగా, ఆ సిరులతల్లి కొలువై ఉన్న పుణ్యస్థలం **తిరుచానూరు.** ఈ క్షేత్రాన్ని **'అలమేలుమంగపట్నం'** అని కూడా అంటారు. పూర్వం ఈ ప్రాంతంలో శ్రీశుకమహర్షి ఆశ్రమం ఉండేదట! అందువల్ల **'శ్రీశుకుని ఊరు'**గా పిలువబడింది. అదే 'తిరుశుకనూరు' అనీ 'తిరుచ్చుకనూరు' అనీ పిలువబడుతూ చివరకు **'తిరుచానూరు'**గా మారిందని పెద్దల కథనం! ఈ ఊరు నడిబొడ్డున **పద్మసరోవరం**



అనే కోనేరు ఉంది. పూర్వం ఈ కోనేట్లో సాక్షాత్తు శ్రీమహాలక్ష్మి బంగారుపద్మంలో అవతరించినందువల్ల ఆమె **పద్మావతి** అనీ, **అలమేలుమంగ** అని పిలువబడింది. అలమేలుమంగ అనగా **అలర్‌మేల్ మంగ.** 'పద్మంపైన ప్రకాశించే దివ్యవనిత' అని అర్థం.

ఆనందనిలయుడు వెలసిన తిరుమలక్షేత్రం ఎంత ప్రాచీనమో, తిరుచానూరు కూడా అంత ప్రాచీనమైందే.. వేంకటాచలం ఎంత అద్భుతమైన క్షేత్రమో, అందున్న ఆనందనిలయుడు ఎంత మహిమగలవాడో, అలమేలుమంగపట్నమూ అంతటిదే, అందున్న అలమేలుమంగమ్మ కూడా అంతటివారే!!

శ్రీ వైకుంఠం నుంచి కేవలం కలియుగంలోని భక్తుల కోసమే భువికి దిగివచ్చిన స్వామి ఏడుకొండలవాడు. భృగుమహర్షి చేసిన నిర్వాకం వల్ల లక్ష్మీవిరహుడైన వేంకటేశ్వరుడు భక్తుల కోరికలను తీర్చలేక సతమతమయ్యాడు. తానూ అనేక బాధలకు లోనయ్యాడు.

## తిరుమలేశుని తపస్సు

అందువల్లే వైకుంఠం నుంచి అలిగి వెళ్ళిన శ్రీమహాలక్ష్మి కోసం కొల్హాపురక్షేత్రానికి వెళ్ళి ఆమె అనుగ్రహం కోసం పదేండ్లపాటు తపస్సు చేశాడు. ఇక్కడ నీకు దర్శనం ఇవ్వనుగాక ఇవ్వను అని ఖండితంగా ఆకాశవాణి ద్వారా చెప్తూ పద్మసరోవరతీరాన నీ కోరిక నెరవేరుతుందని లక్ష్మీదేవి ఆదేశించింది. ఆ తల్లి ఆదేశానుసారం వేంకటేశ్వరుడు లక్ష్మీదేవి అనుగ్రహం కోసం సువర్ణముఖినదీతీరాన పద్మసరోవరాన్ని ఏర్పరచి, పన్నెండేండ్లపాటు తీవ్రంగా తపస్సు చేశాడు.

## అలమేలుమంగమ్మ అవతరణ

ఒకానొక కార్తికమాసం శుద్ధపంచమీ శుక్రవారం అభిజిత్‌లగ్నాన ఉత్తరాషాఢానక్షత్రంలో, షోడశకళలతో శ్రీమహాలక్ష్మి పద్మసరోవరంలో సహస్రదళపద్మంలో ఆవిర్భవించింది. ఇలా పద్మావతిగా, అలమేలుమంగగా అవతరించిన ఆ తల్లిని వక్షఃస్థలంలో వేంచేపు చేసుకొన్న ఏడుకొండలవాడు **"శ్రీనివాసుడి"**గా సంపూర్ణమైన లక్ష్మీకళలతో ప్రకాశిస్తూ తిరుమల కొండకు పయనమయ్యాడు. ఈ తల్లి అవతరించిన ఇచ్చోట కూడ అర్చామూర్తిగా పూజలందుకొనవలసిందని దేవతలు అందరూ ప్రార్థించారు. 'సరే' నంటూ శ్రీమహాలక్ష్మి 'తాను ఇచ్చట స్వతంత్రంగా వీరలక్ష్మినై వెలసి ఉంటానని, తిరుమల కొండపై స్వామివారికి జరుగుతున్నట్లుగానే తనకు స్వతంత్రంగా అన్ని సేవలు, ఉత్సవాలు జరుప'వలెనని ఆదేశించింది. 'శ్రీస్వామివారు తన ప్రక్కన లేనందువల్ల **'విరహలక్ష్మి'**గా, **'వీరలక్ష్మి'**గా ప్రసిద్ధిని పొందుతూ స్వతంత్రంగా భక్తులకు ఇక్కడ కోరికలను నెరవేరుస్తానని, ఇక్కడ భక్తులు ఎవరైతే తమ తమ కోరికలను విన్నవించుకొన్నట్లయితే ముందుగా తాను వింటాననీ, తదుపరి తిరుమల క్షేత్రంలో శ్రీవారి వక్షఃస్థలంలో **"వ్యూహ లక్ష్మి"**గా ఉన్న తాను స్వామివారికి వినిపించి, వారివారి కోరికలను నెరవేరుస్తానని' వరమిచ్చింది.




ఆనాటి నుంచి తిరుచానూరులోని అర్చామూర్తి అయిన శ్రీమహాలక్ష్మి- **పద్మావతి** అనీ, **అలమేలుమంగమ్మ** అనే పేర్లతో స్వతంత్ర వీరలక్ష్మియై పాంచరాత్రాగమ శాస్త్రోక్తంగా పూజలందుకొంటున్నది. అందువల్ల యాత్రికులు భక్తులు ముందుగా సాక్షాత్తు శ్రీస్వామివారి చేతనే ప్రార్థింపబడి తిరుచానూరులో **'స్వతంత్ర వీరలక్ష్మి'**గా పూజలందుకొంటున్న పద్మావతీఅమ్మవారిని దర్శించి పూజించడం, ఆమెకు తమ కోరికలను విన్నవించుకోవడం ఎంతైనా శ్రేయోదాయకం. తమ యాత్ర పూర్తిగా ఫలవంతం అవుతుంది కూడ.

## గంభీరమైన శ్రీస్వామిమూర్తి

అలాకాకుండా ఎంతో వ్యయప్రయాసలతో ప్రయాణం చేసి, ఏడుకొండలను ఎక్కి, నేరుగా తిరుమల చేరుకొన్న భక్తులకు కేవలం క్షణమాత్రమే స్వామిదర్శనం వీలవుతున్న తరుణం ఇది! అందులోను ఎక్కడికో ఆగమేఘాల మీద పరిగెత్తుతున్నట్లుగా శంఖుచక్రాలతో గంభీరంగా నిలబడివున్న స్వామి, పైగా మనం ఒక్కరమే గాక, వేలాదిమంది భక్తులు. దీనికి తోడు ఎప్పుడూ ఉత్సవాలతో ఉరుకులు పరుగులతో ఉన్న స్వామి, అలాంటి

తిరుమలస్వామి కనపడక కనపడక కేవలం ఒక్కక్షణం మాత్రమే దర్శనమిస్తే, ఆ స్వామివారి నిలువెత్తు విగ్రహ గాంభీర్యానికి, దర్పానికీ ఉబ్బితబ్బిబై తడబాటును పొందుతూ తమ తమ కోరికలను చెప్పుకోలేక, లేదా విన్నవించుకోవాలన్న కోరికలను ఆ క్షణంలో విచిత్రంగా మరచిపోవడమే గాక, తోటి భక్తజన సమ్మర్థం తోపులాట వల్ల కనీసం ఆ స్వామివారి దివ్యమంగళ విగ్రహాన్ని కూడా సరిగ్గా తేరిపార చూడనైనా చూడలేక, చూడడానికి వీలుపడక, అరకొర మనస్సులతో బయటికి వస్తారు.

ఇంకేముంది! భక్తులందరికి ఏదో తెలియని వెలితి! ఏదో చెప్పలేని అసంతృప్తి! ఇది తీరేదెట్లా? దీనికి పరిష్కారం ఒక్కటే! తిరుమలేశుడికంటె ముందుగా పద్మావతి అమ్మవారిని దర్శించడం, ఆ అమ్మకు మన ప్రార్థనల్ని విన్నవించడం, మన కోరికలను మన సమస్యలను స్వామివారికి విన్నవించవలసిందని కోరడం. ఇది సత్యమైన మాట! చక్కని మార్గం కూడా. ఎందుచేతంటే...

## అమ్మకు ఓపికా ఎక్కువే! ఓర్పూ ఎక్కువే!!

తిరుచానూరులో అలమేలుమంగమ్మ చతుర్భుజాలతో నెమ్మదిగా కూర్చుని పద్మాసనియై అభయవరదహస్తాలతో దర్శనమిస్తున్నది. స్వామివారివలెకాక నింపాదిగా కూర్చున్న ఈ తల్లి భక్తుల ప్రార్థనలను కోరికలను నిదానంగా, ఓపికగా వింటుంది. తదుపరి తాను విన్నవాటి నన్నింటిని, తిరుమలలో శ్రీవారి వక్షఃస్థలంలో 'వ్యూహలక్ష్మి'గా ఉన్న ఆ జగన్మాత మరింత ఓపికగా, ఓర్పుగా, ప్రేమగా తన స్వామికి భక్తుల ప్రార్థనల్ని వినిపిస్తుంది. అంతటితో సరిపెట్టుకోక ఆ భక్తుల కోరికలను తప్పక తీర్చే టట్లుగా స్వామివారిని ఒత్తిడి చేస్తుంది. ఒప్పిస్తుంది. పిల్లలకోసం అమ్మమాట వినని తండ్రి ఉంటాడా ఎక్కడైనా! అందువల్ల ఆమె సిఫారసునకు తలవొగ్గుతూ శ్రీనివాసుడు, మళ్ళీ ప్రత్యేకంగా భక్తులు కోరకుండానే, కేవలం దర్శనమాత్రం చేతనే కోరికలను విధిగా, తప్పనిసరిగా నెరవేరుస్తూ **"కలౌ వేంకటనాయకః"** అన్న బిరుదును సార్థకం చేసికొంటున్నాడు.

## "దయ" అనే బరువు

ఇంకొక్క మాట! పూర్వం ఎప్పుడో ఏనాడో అటు ఆనందనిలయుడు, ఇటు అలమేలుమంగమ్మ ఒకే ఎత్తులో ఉండే వారట! కాని స్వామివారికంటె కొంచెం ఎక్కువగా అమ్మవారికి ఉన్న **'దయ'** అనే బరువైన గుణం వల్ల భూమి కిందికి కుంగిందట! అందువల్లే స్వామివారు అంతే ఎత్తులోను, అమ్మవారు ఇంత తగ్గులోను ఉన్నారని పెద్దలమాట! నిజంగా ఎంతటి దయగల తల్లో గదా! అలమేలుమంగమ్మ!!

## ఎన్నో సేవలు-ఉత్సవాలు

ఇంతటి కరుణామయి, ప్రేమమూర్తి అయిన శ్రీమహాలక్ష్మి, అలమేలుమంగ లేదా పద్మావతి పేర్లతో పూజలందు కొంటూ తిరుచానూరులో కొలువై ఉన్న నాటినుండి పాంచ రాత్రాగమ శాస్త్రప్రకారంగా సుప్రభాతం, సహస్రనామార్చన పద్మావతిపరిణయం, డోలోత్సవం, ఏకాంతసేవవంటి నిత్యోత్స వాలు, సోమవారం అష్టదళపాదపద్మారాధన, గురువారం తిరుప్పావడసేవ, శుక్రవారాభిషేకం, శుక్రవారపుతోట ఉత్సవం, సహస్రదీపాలంకరణసేవ, శనివారం పుష్పాంజలిసేవ వంటి వారోత్సవాలు, వైశాఖమాస పున్నమికి వసంతోత్సవాలు, జ్యేష్ఠ మాసంలో తెప్పోత్సవాలు, భాద్రపదమాసంలో పవిత్రోత్సవాలు, కార్తికమాసంలో లక్షకుంకుమార్చన, బ్రహ్మోత్సవాలు, పుష్ప యాగంవంటి వార్షికోత్సవాలు శ్రీపద్మావతిఅమ్మవారికి ఘనంగా అంగరంగవైభవంగా నిర్వహింపబడుతున్నాయి.

## బ్రహ్మోత్సవంలో వాహనవైభవం

అయితే ప్రతి ఏడాది కార్తికమాసంలో, అంటే సౌర మానం ప్రకారం వృశ్చికమాసంలో శుద్ధపంచమినాడు శ్రీ పద్మావతి అమ్మవారి అవతారదినోత్సవం సందర్భంగా, పది రోజుల పాటు అమ్మవారి బ్రహ్మోత్సవాలు అంకురార్పణతో ప్రారంభమై **'పంచమితీర్థం'** అనబడే చక్రస్నానంతో పరిసమాప్త మవుతాయి. ఈ ఉత్సవాలు ప్రారంభమైన నాటినుండి ప్రతి రోజూ, రెండుపూటలా వివిధవాహనాల్లో శ్రీఅలమేలుమంగమ్మకు ఊరేగింపులు జరుగుతాయి. **నాగదోషనివారిణిగా, సంతాన ప్రదాత్రిగా 'పెదశేష, చినశేషవాహనా'ల్లోను, విద్యాలక్ష్మి రూపంలో 'హంసవాహనం'పైన, సంపదలను కురిపించే సంపత్ లక్ష్మిగా 'కల్పవృక్షం'లోను, త్రేతాయుగంనాటి వేదవతినే ఇప్పటి పద్మావతినని 'హనుమద్వాహనం'లోను, ధనలక్ష్మిగా 'పల్లకి' లోను, గజలక్ష్మిగా 'గజవాహనం'పైనా, అఖిలాండకోటి బ్రహ్మాండనాయకిగా సర్వభూపాలవాహనంపైన, విజయలక్ష్మిగా 'గరుడవాహనం'పైన, ఆదిలక్ష్మిగా 'సూర్యప్రభ'లో, సామ్రాజ్య లక్ష్మిగా 'చంద్రప్రభ'లోను, రథోత్సవాల్లో సర్వలోకాలకు మహా రాజ్ఞిగా,** అలమేలుమంగమ్మ భక్తులకు దర్శనమిస్తారు. చివరగా అశ్వవాహనంపై **భవభయహారిణి**గా దర్శనమిస్తుంది అలమేలు మంగ!!

## పంచమితీర్థఉత్సవం

చివరిరోజు అయిన తిరుచానూరు పంచమిరోజు అమ్మవారు అవతరించిన రోజు. ఆ రోజు తిరుమల శ్రీవారి నుండి పద్మావతి అమ్మవారికి పసుపు-కుంకుమలు, చందనం, చీరసారె, ప్రసాదాలు, కాలినడకన ఏనుగులపై సంప్రదాయ బద్ధంగా తిరుచానూరుకు మంగళవాయిద్యాలతో సారెగా తీసుకొని వస్తారు.

## పంచమితీర్థం సారె

శ్రీవారు పంపిన పసుపు, చందనం, తులసిలతో పద్మ సరోవరతీరాన, శ్రీ పద్మావతిఅమ్మవారికి, సుదర్శన భగవానునికి 'తిరుమంజనం' వైభవంగా జరుపబడుతుంది. పిదప శుభ ముహూర్తంలో పద్మపుష్కరిణిలో సుదర్శన భగవానునికి 'చక్ర స్నానం' ఘనంగా నిర్వహింపబడుతుంది. అదే సమయానికి తిరుమలేశుడు అక్కడికి వేంచేస్తాడని కూడ ప్రతీతి! ఆ సమయంలో పద్మసరోవరంలో వేలాదిమంది భక్తజనం పవిత్ర స్నానాలు చేస్తూ పునీతులవుతారు. అనంత దయాస్వరూపిణి పద్మావతి అమ్మవారి పంచమితీర్థమహోత్సవం దృశ్యం వర్ణించ డానికి మాటలు చాలవు. లేవు కూడా.

### అలమేలుమంగమ్మకు ఆనందనిలయుడి సారె

అలమేలుమంగమ్మ అవతరించిన "పంచమితీర్థం' నాడు ఆనందనిలయుడు తిరుమల నుంచి, తిరుచానూరుకు "సారె"ను పంపిస్తాడు.

రెండు పట్టుచీరలు, రెండు పట్టు రవిక గుడ్డలు, శ్రీస్వామివారికి అలదిన రెండు పెద్ద తడి పసుపుముద్దలు, రెండు తడి శ్రీగంధం ముద్దలు, పచ్చి పసుపుకొమ్ములతో ఉన్న పసుపుచెట్లు, పూలమాలలు, తులసీమాలలతో పాటు రెండు బంగారు నగలు, వీటితోపాటుగా పిండి వంటలైన ఒక పడి (51) పెద్దలడ్డులు, ఒక పడి (51) వడలు, ఒక పడి(51) అప్పాలు, ఒక పడి (51) దోసెలు మున్నగు వాటిని ఏనుగు అంబారీపైన తిరుమల శ్రీవారి ఆలయ అర్చకపరిచారక వరేణ్యులు జియ్యంగారులు సంప్రదాయకంగా తీసుకొని వచ్చి శ్రీ అలమేలుమంగమ్మకు సమర్పిస్తారు.

పూర్వం వేదాంతదేశికులవారు అనే మహనీయులు ఉండేవారు. ఆయన - "సాక్షాత్తు శ్రీనివాస భగవానుని అనంత



మైన దయాగుణమే "అలమేలుమంగమ్మ"గా అవతరించింది." అని వర్ణిస్తారు. అందువల్ల అటు తిరుమలేశుని, ఇటు తిరుచా నూరు పద్మావతిని విడివిడిగా ఎంతగా పొగడినా వారిద్దరూ అభిన్నులే! ఒక్కరే అని మనం మరచిపోగూడదు. ఏ ఒక్కరిని పొగడినా, కీర్తించినా, ఇద్దరినీ కీర్తించినట్లే. వారిద్దరి అవినాభావ సంబంధం సూర్యునికీ - సూర్యకిరణాలకూ, అగ్నికీ - వేడికీ, సముద్రానికీ - అలలకు ఉన్న సంబంధం లాంటిది. అందుకే అన్నమయ్య కూడా ....

ఆతడె నీవు, నీ వనగ నాతడె, నీపలుకే తలంపగా,
నాతని పల్కు , నీ హృదయ మాతడెపో, యలమేలుమంగ! నీ
చేతిదె సర్వజంతువుల జీవనమంతయు నంచు సన్ముని
వ్రాతము సన్నుతించు ననివారణ నీ సతి వేంకటేశ్వరా!

అంటూ ఇద్దరికీ అభిన్నత్వాన్ని వర్ణిస్తాడు.

అభిన్నులూ, ఒక్కరే అయిన అలమేలుమంగా సమేత శ్రీఆనందనిలయుణ్ణి మనం కూడా ఇలా ప్రార్థించుదాం...

"నారాయణస్య హృదయే భవతీ యథాస్తే
నారాయణోఽపి తవ హృత్కమలే యథాస్తే,
నారాయణస్త్వమపి నిత్యముభౌ తథైవ
తౌ తిష్ఠతాం హృది మమాపి దయావతి శ్రీః"

అమ్మా! అలమేలుమంగమ్మా! ఆనందనిలయుడైన నారా యణుని హృదయంలో నీవుంటావు! నీ హృదయంలో ఆ స్వామి ఉంటాడు! మీరు ఇద్దరూ కలిసి నా హృదయంలో నిండు దయతో కొలువై ఉందురుగాక!

*అమ్మ దయ ఉంటే చాలు! అన్నీ ఉన్నట్లే!!*

# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

మునులారా! మీ ఆకాంక్షను అర్థం చేసుకున్నాను. వేంకటేశ్వరస్వామి వినోదాలు రకరకాలు. వేంకటాద్రి పరిసరాలలో రాక్షస నిర్మూలనం కాగా స్వామి భూతలంలోనే ఉండాలని సంకల్పించాడు. తాను పరిపూర్ణుడైనా లోకులు తన్ను శేష గిరివాసుడని పరస్పరం చెప్పుకునే లాగా వ్యవహరించాడు. స్వామి స్వస్వరూపంతో గాక అర్చామూర్తిగా నిలబడ్డాడు. మౌన ముద్ర వహించాడు. కర్మనేత్రులకు తప్ప మరెవరికి కనబడని రీతిలో మెలిగాడు. భక్తులతో ప్రత్యక్షంగా మాట్లాడక స్వప్నంలో సాక్షాత్కరించి కర్తవ్యం బోధిస్తాడు. మాయారూపంలో మానవాళికి తనపై మరలు కలిగేలా చేస్తాడు. భక్తులలో ఎవరైనా భౌతికవాంఛలకు అతీతులై శరీరాదులపై మమకారం సుతరామూ లేక తనను తదేకబుద్ధితో సేవించే వారికి మోక్షం అనుగ్రహిస్తాడు.

ఒక్కొక్కవేళ వైకుంఠం నుండి తెచ్చిన విమానవాసుడుగా కనిపిస్తాడు. ఇక తేరిపార చూద్దామనేసరికి అంతర్ధానమౌతాడు. ఒకసారి ఆనందనిలయుడుగా కనిపిస్తాడు. మరోసారి అంతర్విమానస్థుడౌతాడు. తన నివాసమిదేయని విమానాన్ని దేవతలకు మాత్రం దర్శింపజేస్తాడు. సామాన్య మానవుల బాహ్యపూజలను ప్రీతితో అందుకుంటాడు. దేవపూజలను రహస్యంగా స్వీకరిస్తాడు. సామాన్యమానవులెవరైనా భక్తితో కోరుకొంటే వారికి వరాలు కుప్పిస్తాడు. లోకులు ఆశ్చర్యపడేలా రకరకాల మహిమల్ని ప్రదర్శిస్తాడు. అల్పదానమైనా అధికదానంగా భావిస్తాడు. సామాన్య పూజలకూ సంతోషిస్తాడు. అప్రాకృతుడైన స్వామి, సామాన్య మానవుని వలె ప్రజల వెంట తిరుగుతూ తన మీద మోహం కలిగేలా చేస్తాడు. తన దగ్గరకి రమ్మని వాంఛ కలిగిస్తాడు. ఒక్కొక్కసారి ముడుపులు, సొమ్ముల తెండని ఆదేశించి వారితోనే వస్తాడు. ఎంతో ఉత్సాహంతో తిరుమలలో రకరకాల ఉత్సవాలు జరిపించేవారికి సకలభాగ్యాలు అనుగ్రహిస్తాడు. ఉత్సవాల సమయాలలో దేవతలే భూమికి దిగివచ్చి స్వామి పుష్కరిణిలో మునకలు వేస్తారు. దేవతలు అర్చించే రకరకాల పిండివంటలను ఆప్యాయతతో ఆరగిస్తాడు. ఇవన్నీ రహస్యంగా జరిగే స్వామి వినోదాలే!

మాయావిమానంలో ఉన్నా ఆనంద నిలయుడుగ శిలారూపంలో స్వామి కనిపిస్తాడు. అర్పింపబడేది స్వల్పమైనా అందుకే సంతుష్టుడై ఆయురారోగ్యభాగ్యాదు అనుగ్రహిస్తాడు. కొండకు రాలేనివారు కొండకేసి చూస్తూ దండంపెడితే చాలు అనుగ్రహిస్తాడు. తన పట్ల భక్తి కలవారిని కాపాడుతాడు. ఇలాంటి విశేషాలు మహిమల కారణంగా దేవతలు కూడ భూలోకంలో ఏదో రూపాన వసించాలని కోరుకొంటారు.

కృత త్రేత, ద్వాపరయుగాలలో స్వామి సాక్షాత్కారం దుర్లభం. కాని, కలియుగంలో ముహూర్తకాలం స్మరించిన వారికి దర్శించేవారికి సుప్రసన్నుడు. ఈ రహస్యం తెలిసిన నానా ద్వీపాంతర వాసులు, సకల దేశవాసులు స్వామి పట్ల, భక్తిని పెంచుకుంటారు. వేంకటేశ్వరునికి సమానుడైన దైవం మరొకరు లేరు. పుష్కరిణికి సమానమైన తీర్థం మరొకటి లేనే లేదు. కృతత్రేతాద్వాపరయుగాలలో వేంకటాద్రి కనకమయం. కలియుగంలో శిలామయం.

ఇలాంటి ఎన్నో మహిమలు, వింతలు గలది వేంకటాద్రి. స్వామిపట్ల భక్తి కల్గిన భక్తుల కోరికలు సఫలమౌతాయి.

కొండకు రాలేని వారు కొండకేసి చూసి దండంపెడితే చాలు అనుగ్రహిస్తాడు

కలియుగంలోని మానవులకు ధార్మికచింతన చాలా తక్కువ. వీరిలో చాలమందికి ధనార్జనపట్లనే ఆసక్తి. సజ్జన సహవాసం కంటే దుర్జనులతోడి నెయ్యమే వారికి ఇష్టం. ఈ కారణాన వారు ఏకాగ్రతతో హరిని ధ్యానించలేరు. నిజంగా వారు కూడ అన్యచింతలు మాని శ్రీనివాసుని సేవించగలిగితే వారందరికి ముక్తి కరతలామలకం.

శ్రీనివాసుని కృపకు వైష్ణవధర్మమొకటే శరణ్యం. వరాహదేవుడు భూమాతకు చెప్పిన రహస్యం వైష్ణవధర్మం. అలాగే ప్రసక్తానుప్రసక్తంగా జీవ బ్రహ్మ ప్రశంసలను హఠ యోగం, రాజయోగాలను విశదీకరిస్తూ సచ్ఛిష్యలక్షణాలను కూడా విశదం చేశాడు.

(ఇంకా ఉంది)

## శ్రీవేంకటాద్రి 'గోవిందుడు'

ముఖచిత్ర కథనం

శ్రీకృష్ణుడు అవతారం కాదు. సాక్షాత్తు పరబ్రహ్మ స్వరూపం. శేషాద్రిపై వెలసి ఉన్న వరదహస్తుడైన ఘన వేంక టేశ్వరుడే ధర్మసంస్థాపనార్థమై యుగయుగాల్లో అవతరిం చాడు. అలాగే, ద్వాపరయుగంలో అవతరించి పురిటిలో నుంచి ఎన్నో అద్భుతలీలల్ని చూపి అర్జునునికి గీతోపదేశం చేసి పరంజ్యోతియై ప్రకాశించిన శ్రీకృష్ణుడు కలియుగంలో భక్తుల కొంగుబంగారమై వెలసిన వేంకటాద్రి గోవిందుడు ఒక్కడేయని భక్తుల విశ్వాసం. కేవలం విశ్వాసం మాత్రమే కాదు. ఇది యథార్థమని ఎందరో ఆళ్వార్లు, కర్ణాటక హరి దాసులు... ఇలా ఎందరో... మరెందరో శ్రీవేంకటేశ్వరుని కృష్ణునిగా వర్ణించారు, స్తుతించారు.

అలాగే, పదకవితాపితామహుడైన శ్రీతాళ్లపాక అన్నమాచార్యుల దృష్టిలో తిరుమల శ్రీనివాస ప్రభువు సాక్షాత్తు శ్రీకృష్ణుడే. అందుకే, అన్నమయ్య శ్రీవేంకటాద్రి గోవిందునికి, ద్వాపరయుగంనాటి గోపాలకృష్ణునికి అభేదం కల్పించి ఇద్దరూ అభిన్నులని వర్ణించారు.

### ధనుర్మాసంలో.......

ప్రతిసంవత్సరం ధనుర్మాసంలో ఒక్క నెలరోజుల పాటు ఆనందనిలయంలో జరిగే ఏకాంతసేవలో భోగ శ్రీనివాసమూర్తికి బదులుగా ఈ వెన్నముద్ద కృష్ణుడే శయన భాగ్యం పొందుతూ ఉన్నాడు. ఈ నెలరోజుల పాటు తెల్ల వారుజామున సుప్రభాతపఠనం ఉండదు. బంగారుశయ్యపై పవ్వళించిన చిన్నికృష్ణుని గోదాదేవి పఠించిన తిరుప్పావై పాశురాలను పాడుతూ మేల్కొల్పుతారు. ఇలా నెలరోజుల పాటు ధనుర్మాసమంతా చెబుతూ ఏకాంతంగా జరిగే తిరు ప్పావై పఠన అనంతరం చిన్నికృష్ణునికి గోరువెచ్చని నీటితో స్నానం చేయించి పాలు, వెన్న, వేడి వేడి పొంగళ్లు నివేదిస్తారు.

చివరిపుట కథనం

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో వెలసి ఉన్న

## గోదాదేవి

స్థానిక తిరుపతి శ్రీగోవిందరాజస్వామిఆలయంలో స్వామివారికి కుడివైపున సాక్షాత్తు శ్రీభగవద్రామానుజాచార్యుల వారిచే ప్రతిష్ఠితమైన 'గోదాదేవి' సన్నిధి వెలసి ఉన్నది. గోదాదేవి విగ్రహం చాల విశిష్టమైనది. ఆలయ ఐశ్వర్యాభివృద్ధి కొరకు రామానుజాచార్యులవారు శ్రీగోదాదేవి విగ్రహాన్ని స్వామివారి కుడి వైపున ప్రతిష్ఠించారు. ప్రతిరోజూ కూడా శ్రీగోవిందరాజస్వామివారికి జరిగేటట్లు గోదాదేవి అమ్మవారికి కూడా 'శాత్తుమొఱ' జరుగుతుంది. ప్రతినెలా నాలుగు శుక్రవారాలు గోదాదేవి అమ్మవారికి ఊంజల్‌సేవ, నాలుగు మాడవీధుల్లో వీధి ఉత్సవం జరుగుతుంది. ప్రతిసంవత్సరం తమిళఆడినెల 'పూర్వఫల్గుణి' నక్షత్రంలో 10 రోజులపాటు గోదాదేవి అమ్మవారికి 'తిరువాడిప్పూరం' ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. చివరగా ఆ తిరునక్షత్రంనాడు గోదాదేవికి గోవిందరాజస్వామివారితో పాటు ఏకాసనంలో అభిషేకం జరుగుతుంది. సాయంకాలం గోదాదేవి, గోవిందరాజస్వామి ఇరువురూ కూడా ఆలయం నుండి బయలుదేరి అలిపిరి పాదాలమండపంలోనికి వేంచేపు చేస్తారు. అప్పుడు అమ్మవారైన గోదాదేవికి తిరుమల శ్రీవారినుండి సారె, గంధం, అప్పడి మొదలుగునవి అనుగ్రహింపబడుతాయి.

ఇదే విధంగా 'ధనుర్మాసంలో' 30 రోజులపాటు గోదాదేవి అమ్మవారికి ఆలయంలో 'తిరుప్పావై' దివ్యప్రబంధ పఠనం జరుగుతుంది. ధనుర్మాసం చివరి 7 రోజులు అమ్మవారికి 'నీరాట్టోత్సవాలు' వేడుకగా జరుగుతాయి. అది ఎట్లంటే, ప్రతి సంవత్సరం 'భోగి' పండుగకు ముందురోజువచ్చే 7 రోజులపాటు ఉదయం పల్లకీలో సర్వాలంకారభూషితురాలై గోదాదేవి తిరుమాడవీధుల్లో ఊరేగి రామచంద్ర పుష్కరిణి వద్ద ఉన్న మండపానికి వేంచేస్తారు. అక్కడ అమ్మ వారికి అభిషేకం, శాత్తుమొఱ నిర్వహింపబడుతుంది. సాయంకాలం తిరిగి రాములవారి మాడవీధుల గుండా బయలుదేరి మిట్టవీధి, కొత్తవీధి, గంగుండ్ర మండపంవీథుల గుండా మార్గంలో శ్రీకృష్ణుని వెతుకుతూ ఆలయం చేరు కుంటుంది. 'భోగి' నాడు గోదాదేవి అమ్మవారికి భోగితేరు జరుగుతుంది. కనుమనాడు గోదాదేవి ధరించిన పుష్పమాలికను తిరుమలలోని శ్రీవేంకటేశ్వర స్వామివారికి అలంకరిస్తారు. అదే విధంగా ప్రతి సంవత్సరం శ్రీనివాసమంగా పురం బ్రహ్మోత్సవాల్లో ఐదవనాడు అంటే గరుడసేవరోజు గోదాదేవి ధరించిన పుష్పమాలికను నగరసంకీర్తనంతో ఊరేగింపుగా మంగపురాధీశునికి అలం కరింపజేస్తారు. కనుమనాడు గోదాదేవి అమ్మవారు ఆళ్వార్‌తీర్థం (కపిలతీర్థం) వేంచేస్తారు. అక్కడ అమ్మవారికి తిరుమంజనం జరుగుతుంది. సాయంకాలం గోదా అమ్మవారికి, కృష్ణునికి కల్యాణం జరుగుతుంది.

*డిసెంబరు 16 నుండి ప్రారంభమయ్యే ధనుర్మాస సందర్భంగా...*

# గోదాదేవి - శ్రీరామాయణ పురుషులు

*- శ్రీమతి ఈ.విజయలక్ష్మి*


ఆండాళ్ నాచ్చియార్ అనుగ్రహించిన తిరుప్పావై ప్రబంధానికి వ్యాఖ్యాన చక్రవర్తి **పెరియవాచ్చాన్ పిళ్లై, అళకియ మణవాళప్పెరుమాళ్, జనన్యాచార్యులు** అనే పూర్వాచార్యులు ముగ్గురు వ్యాఖ్యానాలను అనుగ్రహించారు. ఆ వ్యాఖ్యానాలలో వారు శ్రీరామాయణంలో ఉండే పలు శ్లోకాలను ఉదహరించి, తిరుప్పావైప్రబంధానికి శ్రీరామాయణానికి మధ్య ఉండే సామ్యాలను కొన్ని సందర్భాలలో, శ్రీరామాయణం కంటే తిరుప్పావై ప్రబంధానికి గల అతిశయాన్ని మరికొన్ని సందర్భాలలో వివరించారు.

"**ఆయ్**" అనే పేరు కలిగిన జనన్యాచార్యులు తమ వ్యాఖ్యానంలో **ఆళ్వార్లకు, గోదాదేవికి**; ఆ విధంగానే, శ్రీరామాయణ పురుషులైన **లక్ష్మణ, భరత, శత్రుఘ్నులకు** మధ్య ఉండే సామ్యాలను చాలా అందంగా వివరించారు. ఆ వివరణలో వారు-'లక్ష్మణస్వామిరీతి వంటిది మిగిలిన ఆళ్వారుల అందరి రీతి. భరతుని రీతి పెరియాళ్వారుల రీతి వంటిది, శత్రుఘ్నుని రీతి గోదాదేవిరీతి వంటిది'- అని అన్నారు.

శ్రీరాముడు అరణ్యాలకు వెళ్ళేటప్పుడు లక్ష్మణుడు "నేను కూడా నీ వెంట వస్తాను" అని నిర్బంధించి, శ్రీరామునితో అరణ్యాలకు వెళ్ళి, అన్ని విధాలైన కైంకర్యాలను ఆ స్వామికి చేశాడు. ఇటువంటి లక్ష్మణుని రీతి ఆళ్వారుల రీతి. వారు, లక్ష్మణునివలె భగవంతుని ప్రార్థించి, నిర్బంధించి అనుభవించాలని ప్రయత్నం చేశారు. అందువల్ల ఆళ్వార్లస్థితి లక్ష్మణుని స్థితి వలె ఉన్నది.

ఆ విధంగానే, భరతుని రీతివంటిది పెరియాళ్వారుల రీతి. భరతుడు, లక్ష్మణునివలె తాను ఆశించిన సేవను శ్రీరామునకు చేయాలని కోరకుండా, ఆ శ్రీరాముడు మెచ్చిన సేవనే చేయాలని శ్రీరాముని పాదుకలను గ్రహించి, ఆనందంగా అయోధ్యకు తిరిగి వెళ్ళాడు- అని **కణ్ణినుణ్‌శిఱుత్తాంబు** ప్రబంధ వ్యాఖ్యానంలో వ్యాఖ్యాన చక్రవర్తి అనుగ్రహిస్తారు. ఆ విధంగానే పెరియాళ్వార్లు కూడా, తాము కోరిన సేవను భగవంతునకు చేయడం కాకుండా, భగవంతుని సమృద్ధికోసం మంగళాశాసనం చేశారు. అందుచేత పెరియాళ్వారుల రీతి భరతుని రీతి వంటిది.

భరతుడు ఈ విధంగా భగవంతుని విషయంలో పారతంత్ర్యాన్ని ఆచరించాడు. కానీ, శత్రుఘ్నుడు మాత్రం, ఆ భగవత్పారతంత్ర్యానికి అవధి అయిన భాగవత పారతంత్ర్యాన్ని ఆచరించి చూపించాడు. దానికి ఉత్తమోదాహరణంగా నిలిచాడు. **పెరియవాచ్చాన్ పిళ్లై కణ్ణినుణ్‌శిఱుత్తాంబు** ప్రబంధ వ్యాఖ్యానంలో 'ఒక ద్రవ్యం, ఇంకొక ద్రవ్యంతో కలసినట్లుగా కాకుండా, ఒక గుణం ఒక ద్రవ్యంతో కలసి ఉండేటట్లుగా, శత్రుఘ్నుడు భరతునితో అత్యంతపారతంత్ర్యాన్ని కలిగినవాడై, అతనితో కలసి, అతనివెంట వెళ్లాడు?' అని భరతుడు తన వెంట శత్రుఘ్నుని తన మేనమామ ఇంటికి ప్రీతితో తీసుకొని వెళ్ళాడని వ్యాఖ్యానించారు. గోదాదేవి కూడా, ఈ విధంగానే భాగవత పారతంత్ర్య పరాకాష్ఠను కలిగినది. ఈమె భాగవతులను పురస్కరించుకొని, భగవంతుని ఆశ్రయించడానికీ ప్రయత్నించినది. ఆచార్యపురుషకారాన్ని పురస్కరించుకుని భగవంతుని ఆశ్రయించడం అనే దశలో గోదాదేవి స్థిరమైన నిష్ఠను కలిగినది. ***"శెల్వర్ పెరియర్, శిఱుమానిడవర్, నామ్‌శెయ్ వడెన్?"*** (లక్ష్మీనాథుడైన భగవంతుడు చాలా గొప్పవాడు. మనం చాలా చిన్నవారమైన మానవులం. మనమేమి చేయగలము?) అన్నట్లు భగవంతుడు పర్వతంవంటివాడు. మనం చాలా చిన్న అణువులాంటివారం. మనం ఆ స్వామిని ఏ విధంగా ఆశ్రయించగలం? అని అంటే, దానికి ఒక చక్కని మార్గం ఉన్నది. ***"విట్టుశిత్తర్ తంగళ్ దేవర్రై"*** అంటే భగవంతుడు విష్ణుచిత్తులకు పరతంత్రుడు. వారు ***"మంజనమాడ నీవారాయ్"*** (స్వామీ స్నానం చేయడానికి రా!) అని పిలిస్తే భగవంతుడు వారి దగ్గరకు తప్పక వస్తాడు. పువ్వులను ముడుచుకోవడానికి రమ్మంటే వస్తాడు. రక్ష పెడతాను, రమ్మంటే వస్తాడు. అటువంటి విష్ణుచిత్తులకు పరతంత్రుడైన భగవంతుని మనం వారి ద్వారా వారి పురుషకారంతో ఆశ్రయించవచ్చు" అని గోదాదేవి ఆచార్య పురుషకార పూర్వకంగా భగవంతుని ఆశ్రయించవచ్చునని అన్నది. అందుచేత, గోదాదేవిరీతి శత్రుఘ్నుని రీతి వంటిది.



“శత్రుఘ్నుడు శ్రీరామునకు ఎందుకు ఇష్టమైనవాడు అంటే, తనకు ఇష్టమైన భరతుని తప్ప వేరొకనిని ఎవరిని అతడు తెలియనివాడు కనుక” అని శ్రీరామానుజులు అనేవారట.

గోదాదేవిరీతి కేవలం శత్రుఘ్నుని రీతి వంటిదేనా? అని అంటే, తిరువాయ్‌మొళి ప్రబంధం వ్యాఖ్యానంలో నమ్మాళ్వార్లు ఒక్కొక్కరీతిలో లక్ష్మణునివలె, ఒక్కొక్కరీతిలో భరతునివలె, ఒక్కరీతిలో శత్రుఘ్నుని వలె, ఒక్కొక్కరీతిలో సీతాదేవివలె గోచరిస్తారు? అని చెప్పినట్లుగానే, గోదాదేవి కూడా ఒక్కొక్కరీతిలో చూస్తే లక్ష్మణునివలె కూడా సాక్షాత్క రిస్తుంది. భరతుని రీతి కూడా ఆమెలో కనిపిస్తుంది, సీతాదేవి రీతి కూడా ఆమెలో కనిపిస్తుంది? అని తిరుప్పావై వ్యాఖ్యానావతారికలో పూర్వాచార్యులు అంటారు. గోదాదేవి అవతరించింది ఏ విధంగా? అంటే సహజమైన భక్తి తోనే ఆమె అవతరించింది అని అంటారు వ్యాఖ్యాన చక్రవర్తి, జనన్యాచార్యులు కూడా.

మిగిలిన ఆళ్వారులు అయితే, **“మయర్వఱ మదినలమ్ అరుళినన్”** అని భగవదనుగ్రహం వల్ల పొందిన జ్ఞానభక్తులను కలవారు అని పెరియాళ్వారు లకు పుత్రిక అయినందున, ఆమె సహజంగా స్త్రీ అయినందువల్ల, పురుషుని విషయంలో స్త్రీకి ప్రీతి కలగడం సహజసిద్ధం కనుక, భూదేవి అంశతో అవతరించినది కనుక, గోదాదేవికి కల జ్ఞానభక్తులు సహజ సిద్ధమైనవి అని, అందువల్ల ఈమె ఏ విధంగా ఉన్నది? అంటే, లక్ష్మణస్వామివలె ఉన్నది అని ఈ వ్యాఖ్యాతలు అంటారు.

దీనిని వివరించడానికి వారు శ్రీరామాయణం లోని **“బాల్యాత్ ప్రభృతి సుస్నిగ్ధో లక్ష్మణో లక్ష్మీ వర్ధనః”** (బాలకాండం– 18–27) అనే సూక్తిని ఉదా హరించారు. ఈ శ్లోకంలో **“బాల్యాత్ ప్రభృతి సుస్నిగ్ధః”** అని అంటూ, చాలా చిన్న వయస్సు నుండే లక్ష్మణుడు శ్రీరాముని విషయంలో చాలా ప్రీతిని కలిగి ఉండేవాడు అని చెప్పబడింది. ఇక్కడ, రామాయణ వ్యాఖ్యాత గోవిందరాజులు **“లక్ష్మీం వర్ధయతీతి లక్ష్మీవర్ధనః”** సంపదను అభివృద్ధి చేసేవాడు అని “లక్ష్మీవర్ధనః,” అనే పదాన్ని వివరించారు. ఇక్కడ చెప్పబడిన సంపద ఏమి? అని అంటే, **“కైంకర్య సంపద్వర్ధకః”** (భగవంతుని కైంకర్యం అనే సంపదను వృద్ధి చేసేవారు) అని వారే వివరించారు.

ఆ విధంగానే, లక్ష్మణుడు, శ్రీరామునకు అన్ని విధాలైన కైంకర్యాలను నిరంతరంగా చేసినట్లు, అది కూడా, తొట్టిలో పరుండి ఉండే ప్రాయంనుండే? అని కూడా చెప్పబడింది. **“లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిః ప్రాణ ఇవాపరః, న, చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః”** అనే విధంగా లక్ష్మణుడు పక్కన లేకపోతే శ్రీరామునకు నిద్రపట్టేది కాదు? అని చెప్ప బడింది. **“సుస్నిగ్ధః”** అనే పదాన్ని చాలా అద్భుతంగా

గోవిందరాజులు వ్యాఖ్యానించారు. **"అంకురాత్ ప్రభృతి పరిమళేనేవోత్పన్నః తులసీకాండ ఇవ, జన్మనః ప్రభృతి నిరవధిక భక్తిసంపన్నః"** (విత్తనంగా ఉండే సమయంనుండే పరిమళం తోనే పుట్టిన తులసీకాండంవలె, పుట్టిన సమయం నుండే అంతులేని భక్తిసంపదను కలవాడు లక్ష్మణుడు) అని వారు వివరించారు. ఆ విధంగానే, తిరుప్పావై వ్యాఖ్యానంలో వ్యాఖ్యాతలు పుట్టినప్పుడే పరిమళంతో పుట్టే 'తులసి' వలె, పుట్టిన సమయం నుండే గోదాదేవి జ్ఞానభక్తులను కలిగి అవతరించింది అని అన్నారు. అందుచేత, లక్ష్మణస్వామిరీతి కూడా ఒక విధంగా గోదాదేవికి ఉన్నది అని ఏర్పడుతున్నది.

ఇంతేకాక, జనన్యాచార్యులవారి నాలాయిరప్పడి వ్యాఖ్యానంలో **"జనకరాజన్ తిరుమకళుడైయ...... ప్పిఅంద పాశురంగళ్ పెరియపెరుమాళ్ తిరువడిగళై ప్రాప్పిక్కెక్కుడలాయ్"** అని చెప్పబడింది. సీతాదేవి శ్రీరాముని విశేషించిన దుఃఖం చేత పలు వచనాలను పలికినది. అవి అన్నీ తిరిగి ఆ శ్రీరాముని పొందడానికి కారణమయ్యాయి. ఆ విధంగానే, **గోదాదేవి** భగవంతుని పొందాలనే ఆర్తితో పలికిన సూక్తులు అన్నీ శ్రీరంగనాథుని శ్రీచరణాలను పొందడానికి కారణమయ్యాయి. శ్రీకృష్ణుని పొందాలని ఆశపడి, నోము నోచడం అనే ఒక వ్యాజాన్ని పెట్టుకొని, గోదాదేవి, "భగవంతుని చేరాలి" అనే ఉద్దేశంతో పలికిన పాశురాలు అన్నీ, ఆ శ్రీకృష్ణుని పొందడానికి హేతువులయ్యాయి అనేది సీతాదేవికి, గోదాదేవికి మధ్య ఉండే ఒక విధమైన సామ్యం.

అంతేకాకుండా, భరతుని రీతి కూడా గోదాదేవికి ఉన్నది అని వ్యాఖ్యాన చక్రవర్తి తిరుప్పావై వ్యాఖ్యానావతారిక చివరిలో తెలియజేశారు. గోదాదేవి తన చెలికత్తెలను అందరినీ నిద్రలేపి, నందగోపాగృహానికి కావలి కాచే ద్వారపాలకుని నిద్రలేపి, అతని అనుమతిని పొంది, నందగోపాలుడు, యశోద, బలరాముడు మొదలైనవారిని నిద్రలేపి, తరువాత, నీళాదేవిని, శ్రీకృష్ణభగవానుని నిద్రలేపి, ఆ భగవంతుని సన్నిధిలో విజ్ఞాపన చేస్తూ, "మేము నీతో నిత్యమైన సంబంధాన్ని కలిగి ఉండాలి, నీకే మేము దాస్యం చేయాలి. మిగిలిన ఆశలు ఏమీ లేకుండా ఉండేటట్లు మమ్ములను నీవు చేయాలి" అని నిత్యకైంకర్యాన్ని ప్రార్థించి, ఆ విధంగానే దానిని పొందింది అని తిరుప్పావై ప్రబంధం తెలుపుతున్నది. ఆ విధంగానే, శ్రీరామాయణం యుద్ధ కాండం చివరిలో **"యదా వర్తతే చక్రం యావతీ చ వసుంధరా"** అని భరతుడు పలికిన శ్లోకంలో "ఎంతకాలం చక్రం తిరుగు తుందో, ఎంత చోటు ఈ భూమిలో ఉంటుందో అంత కాలం, అంత ప్రదేశంలోను నీవు నీ స్వామిత్వాన్ని ప్రవర్తింపచేస్తూ అందరినీ పాలించు" అని అంటూ శ్రీరామునిలో సహజ స్వామిత్వం ఉన్నదని అన్నాడు భరతుడు.


ఏ విధంగా గోదాదేవి భగవంతుని నిత్యకైంకర్యాన్ని ప్రార్థించి పొందిందో, ఆ విధంగానే, భరతుడు కూడా "భగ వంతుని స్వామిత్వం అనేది స్థిరంగా నిలచి ఉండాలి? అని, అతడు చిరకాలం పాలించాలి" అని అనడం ద్వారా "అతడు ఒక్కడే స్వామి, అని మిగిలిన వారు అందరూ అతనికి దాసులని, ఆ స్వామికి అందరూ దాస్యం చేయాలి" అనే అర్థాన్ని తెలియజేశాడు.

ఈ విధంగా **తిరుప్పావై** వ్యాఖ్యానావతారికలలో **గోదా దేవికి, శత్రుఘ్న, లక్ష్మణ, భరత సీతాదేవులనే** శ్రీరామాయణ పురుషులకు మధ్య ఉండే సామ్యం తెలియజేయబడింది.

**ఆండాళ్ తిరువడిగళే శరణమ్**

## వైకుంఠపాళి
## :: 108 - సమాధానాలు ::

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 శ్రీ | వ | త్సం | | 2 తా | | 3 ఆ | కా | 4 శ | రా | 5 జు |
| ని | | | | ర | | వ | | ని | | హు |
| 6 వా | లి | | 7 శు | క | మ | హ | ర్షి | | | డు |
| సు | | 8 కుం | | లు | | ము | | | 9 ప | |
| 10 డు | బు | డ | క్క | | | | 11 వీ | | ద్మా | |
| | | భే | | | 12 ప | ద్మ | స | రో | వ | రం |
| 13 తి | | 14 ది | 15 శ | | రా | | ము | | తి | |
| రు | | | ర్యా | | శ | | | 16 వీ | | |
| 17 చా | రు | మ | తి | | 18 రు | మ | ణ్వా | ను | డు | |
| నూ | | | | | డు | | | | | |
| రు | | 19 భృ | గు | వు | | 20 పం | చ | మీ | తీ | ర్థం |



# మారుతీ! నీకిదే ప్రస్తుతి!!

– శ్రీ జంధ్యాల శరత్‌బాబు, 99483 45013

అత్యంత శక్తి, అనంతయుక్తి, అపరిమిత భక్తితత్త్వాల ఏకైక ప్రతీక **'హనుమ'**. *హనుమాన్, హనుమంత, ఆంజనేయ, అనిలాత్మజ, పవనతనయ, సంజీవరాయ, మారుతి...* ఏ పేరుతో పిలిచినా పలికే వజ్రకంఠుడు ఆ అంజనాపుత్రుడు అఖండ ధీమంతుడు. అందుకే *'మంగళమూరితి మారుతనందనా! సకల అమంగళ మూలనికందనా! సంతతహితకారీ హృదయ విరాజిత అవధవిహారీ'* అంటూ స్తుతించింది తులసీదాస మానసం. *'శ్రీరామదూతం శిరసా నమామి'* అని ఆబాలగోపాలమూ కీర్తించే ఆ ఘనతరుని పేరిట వ్రతం ఎన్నెన్నో జన్మల పుణ్య ఫలం. అంతటి పుణ్యకర్మనిర్వహణం అంటే వేదవిహిత సంస్కారక్రియకు నిలువెత్తు ప్రతీక.

*'మార్గశీర్షే త్రయోదశ్యాం–శుక్లాయాం జనకాత్మజా! దృష్ట్వా దేవీ జగన్మాతా మహావీరేణ ధీమతా'* అని ప్రతీతి. **మార్గశిర త్రయోదశిన** అంతా నిర్వర్తించుకునే ఈ 'హనుమద్వ్రతం' ఆరోగ్యభాగ్య పరికల్పనం, విజయకారక సర్వసాధకం. *'మనో జవం మారుత తుల్యవేగం; జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠం; వాతాత్మజం, వానరయూథముఖ్యం'* అన్నట్లు సమస్తలోకాల్లోనూ ఆయనను మించిన భక్తితత్పరులు ఎవరూ ఉండరన్న మారుతి, సేవానిరతికి ఆసాంతమూ పేరొందిన మహనీయత కలిగినవాడు.

శక్తిసామర్థ్యాల, ఉక్తి నైపుణ్యాల కలబోత హనుమంత. వ్యక్తిత్వవికాసరంగ అధినేత, రామకథామృత వసంతకర్త. తాను త్రిమూర్త్యాత్మకుడు, పరిపూర్ణదేవతా స్వరూపుడు. అసలు **'హనుమ'** అనే మూడు నామాక్షరాలూ– తేజోవిశేషానికి, కాంతి సంపన్నతికి, ప్రపూర్ణఫలప్రదానికి ఉదాహరణలు. వేదవిశారదుడు, వ్యాకరణ విద్యాపారంగతుడైన ఆయనను తలిస్తే చాలు– కార్యసిద్ధి విజయానందాలు సుసాధ్యాలు. ఓర్పు, నేర్పుల నిదర్శనుడు ఆయన.

త్రికరణశుద్ధిగా రామభక్తుడయ్యాడు హనుమంతుడు. స్వామిసేవలో ఎంతగానో చరితార్థుడై ఆదర్శప్రాయస్థానాన నిలిచాడు. లంకాప్రవేశం తర్వాత సీతమ్మవారి అన్వేషణలో ఆ ధీశాలి బుద్ధిచతురత ఆసాంతమూ ప్రత్యేకం. *'దృష్టా మయా సీత'* అనడంతోనే రామభద్రుడు పరమానందభరితుడై, ఆయనను అక్కున చేర్చుకోవడం, ప్రత్యేకించి సుందరకాండ అంతటా హనుమ గుణవిశేషణాల పరిపూరితం. విశేషించి *'కుటుంబ వృద్ధిం ధనధాన్యవృద్ధిం। శ్రియశ్చ ముఖ్యా స్సుఖముత్తమం చ। శ్రుత్వా శుభం కావ్యమిదం మహార్థం। ప్రాప్నోతి సర్వాం భువి చార్థసిద్ధిమ్'* అనేది హనుమద్వ్రత నిర్వహణ ప్రక్రియలో ప్రతిఫలిస్తుంది.


"నా కథ అన్ని లోకాల్లోనూ ఎంతకాలం ప్రాచుర్యాన ఉంటుందో, అంత కాలమూ అది ఆలకించి ఆనందిస్తూ ఉండు!" అని శ్రీరామవాక్యం. అటువంటి మాననీయ 'హనుమాన్ వ్రతాన్ని' ఆయా దేవాలయాల్లో నిష్ఠగా నిర్వహిస్తుంటారు. అష్టోత్తరం, స్తోత్రావళిని జపిస్తూ – *'తత్త్వజ్ఞానప్రదాయకాయ, సర్వమంత్రస్వరూపాయ, బలసిద్ధికారాయ, ధీరాయ, శూరాయ, విజితేంద్రియాయ, భక్తవత్సలాయ'* అంటూ ప్రస్తుతిస్తారు, ఆరాధిస్తారంతా. వ్రతసందర్భాన ఊరూవాడా అన్నింటా అంతటా దండకధ్వనులు మారుమోగుతుంటాయి. నమస్తే! నమో వాయుపుత్రా! అంటూ నామసంకీర్తనలు కొనసాగిస్తారు.



*డిసెంబరు 13న హనుమద్వ్రతం సందర్భంగా...*

పూజాదికాల తదుపరి వ్రతకథ పారాయణ కార్యక్రమం ఏర్పాటవుతుంది. ఆ విధానం మాసవిశిష్టతను సూచిస్తుంది. సీతాన్వేషణ సాగింది మార్గశీర్షంలోనే కాబట్టి, శుద్ధ త్రయోదశి మరింత ప్రాముఖ్యత సంతరించుకుంది. ముందుగా పీఠం, కలశాలు, తదితర ద్రవ్యాలు సిద్ధపరచుకుంటారు. స్వామి ప్రతిమను ఉంచి, పూజ ఆరంభిస్తారు. పవిత్రదారాలను ధరిస్తారు. ఆయన శక్తిరూపధారిణిని కలశంలోకి ఆవాహన చేసి, తదుపరి క్రమంలో కథాశ్రవణం పాటిస్తారు. ద్వైతవనంలో ఉన్న పాండవులకు ఈ వ్రతప్రశస్తిని వ్యాసమహర్షి వివరించాడని ప్రసిద్ధి. అవసరం, అవకాశాల నడుమ సమతూకాన్ని విపులీకరించేదే హనుమకథ. సర్వశక్తికీ ఆయనే సంకేతరూపుడు. హనుమ అనుగ్రహాన్నీ కోరుతూ భక్తులు రాత్రి ఉపవాసదీక్ష అనుసరిస్తారు. అంటే స్వామిభక్తితో సహవాసమే. అన్నిటికన్నా ప్రథమంగా గణపతి సమర్చన. శాంతి శ్రేయస్సుల కోసమే ఈ క్రతువు అంతా.

ఇదే సందర్భంలో పలు హనుమాన్ నామప్రస్తావనలున్నాయి. వీటిని సుందరమంత్రాలుగా పరిగణిస్తుంటారు. *'త్వమస్మిన్ కార్యనిర్యోగే ప్రమాణం హరిసత్తమ। హనూమాన్ యత్నమాస్థాయ దుఃఖక్షయకరో భవ'* అని కదా సిద్ధమంత్రం! ఆయనను శబ్దస్వరూపుడిగా భావించేవారు ఎందరెందరో. లోకహితం గురించి, ధర్మసంస్థాపనకు సంబంధించి ఆంజనేయుడు సాగించిందంతా శిష్టసంరక్షణ, దుష్టశిక్షణ. *'యత్ర యత్ర రఘునాథకీర్తనం। తత్ర తత్ర కృత మస్తకాంజలిం। బాష్పవారి పరిపూర్ణలోచనం। మారుతిం నమత రాక్షసాంతకం'* అంటుంటే ఆ స్వామిరూపమే కళ్లముందర సాక్షాత్కరిస్తుంది.




వ్రతాన్ని ఆచరించేవారు ఆయననే మంత్రరూపుడుగా సంభావిస్తుంటారు. ఎవరు ఏ దృష్టితో చూసినా, హనుమది విలక్షణ మూర్తిమత్వం. సీతాన్వేషిగా, శ్రీరామచంద్రుని భక్త దాసునిగా, శ్రితజన పరిపోషకునిగా తనది విశిష్ట చరిత. తనను తమలపాకులతో పూజించడం ఆరోగ్యదాయకమని, వ్రతప్రసాద స్వీకరణ ఎన్నో విధాల మేలు కలిగిస్తుందనీ నమ్మిక. హనుమను దండకారాధన చేసిన కవులున్నారు, ప్రార్థించిన గాయకులూ ఉన్నారు. ఈ విధంగా ఎందరెందరి అభిమతాలనో సాకారం చేయగలిగిన సంవిధానం హనుమద్వ్రతరూపంలో ప్రస్ఫుటమవుతుంది.

శ్రీమద్రామాయణంలోని మంత్ర మహామాలికగా, విరాజిత రత్నభూషణంగా విలసిల్లుతోంది **హనుమవైభవం**. ఆ స్వామి అనుగ్రహబలం వల్లనే సర్వకాల సర్వావస్థల్లోనూ పరిరక్షణ సిద్ధిస్తోందన్నది ఆరాధకుల నిశ్చిత అభిప్రాయం, నిరంతర అనుభవం. పారాయణ జీవననాదంగా పరిణమించిన దశలో హనుమద్వ్రత అనుసరణం సమున్నతం, సముదాత్తం. **'ఓం నమో భగవతే వాయునందనాయ'**. దీనినే పదమూడు అక్షరాల త్రయోదశాక్షరిగా సంకల్పిస్తోంది భక్తలోకం. పదమూడు ముడులు వేసిన తోరాలను చేతికి కట్టుకోవడం; అదే సంఖ్యల్లో పండ్లు, పుష్పాలు, ఇతర పదార్థాలు సైతం దైవానికి సమర్పించడం తరతరాల సంప్రదాయంగా వస్తోంది.

'మాటిమాటికీ మనసారా నీ పాట పాడెద ప్రభురారా! నీ పూజలు, భజనలు చేసేము నోరారా!' అంటూ భక్తులు పలికే జయ జయనాదాలు ఎన్నెన్నో ఫలదాయకాలు. ఇంతకు మించిన భాగ్యసౌభాగ్యాలు మరెక్కడా ఉండవు. ఆచరిత కర్మల ఫలితానికి ఉత్తమ ఉదాహరణం హనుమద్వ్రతమే!

*"జై భజరంగభళి"*




# తన్నో షణ్ముఖః ప్రచోదయాత్

– డా॥ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖరరావు, 94919 46070

భక్తసులభుడు పరమశివుడు. కేవలం నెత్తిన నీళ్ళు పోసి రెండు మారేడు దళములు వేసినంతనే ఉప్పొంగిపోయి తన భక్తులను కంటికి రెప్పలా కాపాడే కరుణాలవాలుడు! ఆయన దేవేరి... అమ్మల గన్నయమ్మ, జగన్మాత అయిన శ్రీపార్వతీదేవి భర్తను మించిన కరుణామయి. అటువంటి వారి గారాల బిడ్డడు **శ్రీసుబ్రహ్మణ్యస్వామి!** కేవలం కావడి మొక్కులను సమర్పించినంతనే భక్తులకు వంశాభివృద్ధిని, బుద్ధిసమృద్ధిని ప్రసాదించే భక్తసులభుడు! తల్లిదండ్రులకు మించిన కరుణను భక్తులపై వర్షించే వరాల రాయుడు!

## శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆవిర్భావం

భగవంతుడు ఏ అవతారం ధరించినా దుష్టశిక్షణ, శిష్టరక్షణ, మంచిని పెంచడం, చెడును తుంచడమే అందులోని పరమార్థం. అదే **"సుబ్రహ్మణ్య ఆవిర్భావం"** వెనుక దాగి ఉంది. పూర్వం తారకాసురుడు అనే రాక్షసుడు బలగర్వితుడై సకల లోకవాసులనూ కష్టాలకు గురిచేస్తూ ఉండడంతో దేవతలందరూ కలిసి బ్రహ్మదేవుడి వద్దకు వెళ్ళి మొరపెట్టుకున్నారు. అందుకు–

"శివుడు తపస్సు చేస్తూ ఉన్నాడు. శివుడు తపస్సు మానివేసి పార్వతీదేవిని పరిణయమాడేటట్లు చేస్తే వారికి జన్మించే కుమారుడు తారకాసురుడిని అంతమొందించగలడు" అని సలహా ఇచ్చాడు.

బ్రహ్మదేవుడి మాటలను విన్న దేవతలు శివుడు తపస్సు మాని పార్వతీదేవిని వివాహం చేసుకొనేలాగా చేసేందుకు మన్మథుడిని పంపగా, శివుడు తన మూడవ కంటిని తెరచి మన్మథుడిని దహించివేశాడు. అయితే తారకాసురుడిని అంతమొందించవలసిన అవసరాన్ని గుర్తించిన శివుడు తనకు పరిచర్యలు చేస్తూ ఉన్న పార్వతీదేవిని వివాహం చేసుకున్నాడు. వారిద్దరూ కలిసి ఉన్న సమయంలో శివుడి రేతస్సు పతనమై భూమిపై పడింది. దానిని భూమి భరించలేక అగ్నిలో పడవేసింది. అగ్ని దానిని భరించలేక గంగలో వదలగా, దానిని గంగ తన తీరములోని శరవణమునకు తోసివేసింది. అక్కడే శ్రీకుమారస్వామి జన్మించాడు. శరవణమున జన్మించినవాడు కనుక స్వామికి **"శరవణభవుడు"** అనే పేరు ఏర్పడింది. అంతే కాకుండా గంగానదిలో పడిన రేతస్సు ఆరు భాగాలుగా ఏర్పడింది. ఆ ఆరు భాగాలు అలలతాకిడికి ఏకమై ఆరు ముఖములు, పన్నెండు చేతులు, రెండు కాళ్ళతో శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆవిర్భవించాడు. అందువల్ల ఆయనకు **"షణ్ముఖుడు"** అనే పేరు ఏర్పడింది. ఈ విధంగా ఆవిర్భవించిన శ్రీసుబ్రహ్మణ్యస్వామిని పెంచేందుకు శ్రీమహావిష్ణువు ఆరు కృత్తికలను నియమించాడు. వారు శ్రీసుబ్రహ్మణ్యస్వామిని పెంచి పెద్దచేశారు. ఆరు కృత్తికల చేత పెంచబడడం వల్ల స్వామికి **"కార్తికేయుడు"** అనే పేరు ఏర్పడింది.

ఇలా కృత్తికలచేత పెంచబడిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి తర్వాత శివపార్వతుల వద్దకు చేరగా, దేవతలు దేవసేనాధిపత్యం



ఇవ్వగా, శ్రీసుబ్రహ్మణ్యస్వామి తారకాసురుడిపై దండెత్తి తారకాసురుడిని అంతమొందించి దేవతలను, ప్రజలను రక్షించాడు.

ఈ విషయాన్ని భవిష్యోత్తరపురాణం –

**"మార్గశీర్షే సితే పక్షే షష్ఠీ భరత సత్తమ
పుణ్యాపాపహరా జ్ఞేయా శివాశీతా గుహప్రియా।
నిత్యతారకం షష్ఠ్యా గుహస్తారక రజవత్
రారాజతేన దయితా కార్తికేయస్య సా తిథిః॥"** అని పేర్కొంది.

మార్గశిరమాసం, శుక్లపక్ష షష్ఠిరోజు కుమారస్వామి తారకాసురుడిని సంహరించి, తారకాధిపతివలె ప్రకాశించాడు. కాబట్టి ఈ దినం కార్తికేయుడికి అత్యంత ప్రియమైనది అని అర్థం.

లోకకల్యాణార్థం శివపార్వతుల గారాలబిడ్డడుగా శ్రీసుబ్రహ్మణ్యస్వామి ఆవిర్భవించిన రోజూ, తారకాసురుడనే రాక్షసుడిని అంతమొందించిన రోజూ ఒకే తిథి కావడం విశేషం...!

## సృష్టికర్తనే బంధించిన సుబ్రహ్మణ్యస్వామి


త్రిమూర్తులలో లయకారుడైన శివుడికి కుమారుడిగా జన్మించి, స్థితికారుడైన శ్రీమహావిష్ణువు నియమించిన కృత్తికలచేత పెంచబడిన శ్రీసుబ్రహ్మణ్యస్వామి సృష్టికర్త అయిన బ్రహ్మదేవుడినే బాల్యంలో బంధించాడు.

శ్రీసుబ్రహ్మణ్యస్వామి పసివాడుగా తల్లిఒడిలో ఉన్న సమయంలో ఒకసారి శివుడు పార్వతీదేవికి ప్రణవమంత్రం యొక్క అర్థాన్ని వివరించాడు. బాలుడుగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి దానిని విని ఆకళింపు చేసుకున్నాడు. ఒకసారి బ్రహ్మదేవుడు కైలాసానికి రాగా బాలుడుగా ఉన్న సుబ్రహ్మణ్యస్వామి ప్రణవమంత్రార్థాన్ని వివరించవలసిందిగా అడిగాడు. బ్రహ్మ చెప్పలేకపోవడంతో సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మదేవుడిని బంధించాడు. శివుడు దీనిని చూసి జోక్యం చేసుకుని బ్రహ్మదేవుడిని విడిపించాడు.

## కావడిమొక్కుల వాడు...

పూర్వం అగస్త్యమహర్షి కైలాసానికి వెళ్ళి శివుడిని దర్శించి తిరిగి వెళ్ళే సమయంలో శివుడు రెండు కొండలను బహూకరించి శివశక్తిరూపంగా దక్షిణాదికి తీసుకువెళ్ళి కొలవవలసిందిగా తెలిపారు. వాటిని స్వీకరించిన అగస్త్యుడు వాటిని ఇదంబుడు అనే శిష్యుడికి ఇచ్చి వాటిని తనవెంట తీసుకుని రావలసిందిగా తెలిపాడు. ఇదంబుడు కావడిని కట్టుకుని రెండు పర్వతాలను అందులో ఉంచుకుని అగస్త్యుడి వెంట నడవసాగాడు. కొంతదూరం అంటే పళని వచ్చేసరికి ఆయాసం అధికమై కొంతసేపు విశ్రాంతికి ఆగాడు. కొంతసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ కావడిని ఎత్తుకొనగా ఒకవైపు పైకి లేచింది. మరోవైపు లేవలేదు. దీనితో వెనుతిరిగి చూడగా దానిపై శ్రీ సుబ్రహ్మణ్యస్వామి నిలబడి ఉన్నాడు. కొండదిగి వెళ్ళిపొమ్మన్నాడు. పోకపోవడంతో వారిద్దరిమధ్య యుద్ధం జరిగి చివరకు ఇదంబుడు చనిపోయాడు. ఈ విషయం తెలుసుకున్న అగస్త్యుడు శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారిని ప్రార్థించడంతో స్వామి ఇదంబుడిని తిరిగి బ్రతికించాడు. ఈ విషయం ఇదంబుడి భార్యకు తెలిసి కావడిలో పాలను తీసుకుని వెళ్ళి కృతజ్ఞతగా స్వామివారికి సమర్పించింది. అప్పటి నుంచి కావడి మొక్కులను సమర్పించడం ఆచారమైంది.

కాగా, కావడికి ఉపయోగించే బద్ద *'బ్రహ్మదండం'* అనీ, కావడికి ఉపయోగించే తాళ్ళు *'వాసుకి, అనంత, తక్షక, సంగపాల, గుడిక, పద్మ, మహాపద్మ, కర్కాటక'* అనే అష్టనాగు





**సుబ్రహ్మణ్య గాయత్రి**

ఓం తత్పురుషాయ విద్మహే
మహాసేనాయ ధీమహీ।
తన్నో షణ్ముఖః ప్రచోదయాత్॥


లకు ప్రతీక అనీ చెప్పబడుతూ ఉంది. స్వామివారికి పాలకావడులు, పూలకావడులను సమర్పించడం ఆనవాయితీ. కావళ్ళను స్వీకరించిన స్వామివారు కోరిన కోరికలను తీర్చడంతో పాటూ, వంశాభివృద్ధిని, కుటుంబ, ఆర్థికాభివృద్ధిని ప్రసాదిస్తాడని విశ్వాసం.

## నెమలి వాహనం... కోడి ధ్వజం...

తారకాసురుడి సోదరుడు శూరపద్మడు. తారకాసురుడు అంతమొందాక శూరపద్మడు దేవతలతో పాటూ సకలలోకవాసులను ఇబ్బందులపాలు చేయసాగాడు. దీంతో దేవతలు సుబ్రహ్మణ్యస్వామిని ప్రార్థించగా... సుబ్రహ్మణ్యస్వామి శూరపద్మడిపై దండెత్తి యుద్ధం చేశాడు. భీకరమైన పోరు జరిగింది. ఆరవ రోజు శూరపద్మడు పక్షిరూపాన్ని ధరించి సుబ్రహ్మణ్యస్వామితో తలపడ్డాడు. సుబ్రహ్మణ్యస్వామి శూలాయుధం ప్రయోగించడంతో పక్షి రెండుగా ఖండింపబడింది. ఈ రెండింటిలో ఒకటి నెమలిగా, మరొకటి కోడిపుంజుగా మారి శ్రీసుబ్రహ్మణ్యస్వామి వారిని శరణు వేడుకోవడంతో నెమలిని వాహనంగా, కోడిని ధ్వజంగా చేసుకున్నట్లు కథనం.

## వల్లీ... దేవసేనలు...

శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి ఇద్దరు దేవేరులు ఉన్నారు. శ్రీవల్లీదేవి, శ్రీదేవసేనలు వారు. తారకాసురుడిని అంతమొందించిన తర్వాత దేవేంద్రుడు తన కుమార్తె దేవసేనను సుబ్రహ్మణ్యస్వామికి ఇచ్చి వివాహం చేయగా, తిరుత్తణి ప్రాంతపాలకుడైన





నందిరాజు కుమార్తె అయిన వల్లీదేవిని వేటగాడి రూపంలో వెళ్ళి వివాహం చేసుకున్నాడు. దీనితో శ్రీసుబ్రహ్మణ్యస్వామి వల్లీ దేవసేనల సమేతుడు అయ్యాడు. వల్లీ దేవసేనల సమేతుడైన శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని ఆరాధించడం వల్ల భార్యాభర్తల మధ్య అన్యోన్యత వృద్ధి చెందడంతో పాటు సంసారసౌఖ్యం వృద్ధి అవుతుంది.

## సుబ్రహ్మణ్యషష్ఠి

మార్గశిరమాసంలోని శుక్లపక్షం షష్ఠి–సుబ్రహ్మణ్యషష్ఠి. సుబ్రహ్మణ్యషష్ఠి నాడు స్వామివారిని షోడశోపచారాలు, అష్టోత్తరాలతో పూజించి నైవేద్యం సమర్పించాలి. ఈ రోజు మొత్తం ఉపవాసం ఉండి, మర్నాడు తిరిగి పూజచేసి భోజనం చేసి ఉపవాసాన్ని విరమించాలి. శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని సర్పంగా కూడా భావించడం సంప్రదాయం. కాబట్టి ఈ పండుగనాడు పుట్ట వద్దకు వెళ్ళి పూజలు చేయడం మంచి ఫలితాలనిస్తుంది. రాహు, కేతు, సర్ప, కుజదోషాలతో బాధపడేవారు కఠినమైన ఉపవాసముండి, శ్రీసుబ్రహ్మణ్యస్వామివారిని పూజించడం మంచిది. అంతేకాకుండా బ్రహ్మచారిని ఇంటికి పిలిచి స్వామిరూపంగా భావించి పూజించి పులగం, క్షీరాన్నం వంటి వంటలను చేసి, భోజనం పెట్టి, పంచలసాపు, దక్షిణ, తాంబూలం ఇచ్చి నమస్కరించాలి. ఈనాడు **'శరవణభవ'** అనే ఆరు అక్షరాల నామాన్ని జపించడం మంచి ఫలితాలను ఇస్తుంది.

సుబ్రహ్మణ్యషష్ఠిని సంప్రదాయబద్ధంగా జరుపుకొనడం వల్ల వంశాభివృద్ధి, విజ్ఞానాభివృద్ధి, బుద్ధిసమృద్ధి కలుగుతాయి.

తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలోని తిరుపతి కపిలతీర్థంలోని శ్రీకపిలేశ్వరస్వామివారి ఆలయంలో సుబ్రహ్మణ్యషష్ఠి సందర్భంగా శ్రీసుబ్రహ్మణ్యస్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తారు.

# ఆళ్వారులు కొలిచిన 108 దివ్యదేశాలు

- శ్రీ కె.సి.నాయుడు, 77020 12946

ఋషులద్వారా అవిచ్ఛిన్నంగా మానవులకు అందిన జీవనవిధానాలను **'ఆర్షసంప్రదాయాలు'** అంటారు. ఇవి ఎప్పుడు ప్రారంభమైనవో తెలియనంత ప్రాచీనమైనవి మరియు స్వచ్ఛమైనవి, జ్ఞానం ప్రకాశించేవి. మనకు అందుతున్న సమాచారమును బట్టి ద్వాపర యుగాంతమున మహాభారతమును గ్రంథస్థం చేసిన శ్రీవ్యాసభగవానుడు బ్రహ్మసూత్రములను కూడా వ్రాశాడు. వారు చెప్పిన వేదార్థసారములు అత్యంత ఆదరణీయములైనాయి. ఆర్షసంప్రదాయాభిమానులైన భారతీయులెందరో వీనిని ఉద్ధారకములుగా స్వీకరించారు. తత్త్వాన్ని తెలిపే వాఙ్మయాన్ని ఋషులు ప్రబంధాలుగా ప్రవర్తింపజేశారు. ఈ విజ్ఞానసాగరంలో మునిగితేలిన ఋషులను **'దివ్యసూరులు'**గా కీర్తించబడినారు.

వీరందరూ భగవంతుని సేవించి తరించి భక్తి సాగరమును ఆమూలాగ్రం ఈదినవారు. అటువంటి వారు గనుకనే మనలను మృత్యుసంసారము నుండి రక్షించి మోక్షమార్గము వైపు పయనించునట్లు బోధించారు. వీరిని పరిభాషలో **'ఆళ్వార్లు'** అంటారు. ఆళ్వారు అంటే **'భగవదనుభవంలో మునిగినవారు'** అని అర్థం. ఈ ఆళ్వార్లు పలికిన వాక్కులను **"నాలాయిర దివ్యప్రబంధము"** అని వ్యవహరిస్తారు. ఈ ఆళ్వారులందరూ దక్షిణ భారతావనిలోనే అవతరించడం విశేషం.



వారిలో ప్రముఖులైనవారు 1)భూతయోగి (పూదత్తాళ్వార్) 2)సరోయోగి(పొయ్‌గైయాళ్వార్) 3)మహాయోగి (పేయాళ్వార్) 4)విష్ణుచిత్తులు (పెరియాళ్వార్) 5)భక్తిసారులు (తిరుమళిశైయాళ్వార్) 6)కులశేఖరులు (కులశేఖరాళ్వార్) 7)మునివాహనులు (తిరుప్పాణాళ్వార్) 8)భక్తాంఘ్రిరేణులు(తొండరడిప్పొడియాళ్వార్) 9)పరకాలులు (తిరుమంగైయాళ్వార్) 10)పరాంకుశులు (నమ్మాళ్వార్ లేక శఠగోపులు) 11)గోదాదేవి 12)మధురకవులు.

ఈ ఆళ్వారులు తమ రచనలలో 108 విష్ణురూపాలను కొలిచారు. ఇవి వైష్ణవులకు అత్యంత పవిత్రమైన క్షేత్రాలుగా విలసిల్లాయి. ఇందులో 105 భారతదేశములోను, ఒకటి నేపాల్‌లోను, మిగిలిన రెండూ భూమి వెలుపల ఉన్నాయి.


ఇందులో ఎనిమిది మిక్కిలి పవిత్రమైనవని భావిస్తున్నారు. 1)తిరువేంకటనాథుడు-తిరుమల, ఆంధ్రప్రదేశ్ 2) శ్రీరంగనాథస్వామి-శ్రీరంగం, తమిళనాడు 3) శ్రీమూర్తి-ముక్తినాథ్, నేపాల్ 4) శ్రీవరదరాజ పెరుమాల్-కాంచీపురం, తమిళనాడు 5)శ్రీఅనంతపద్మనాభస్వామి-తిరువనంతపురం, కేరళ 6) బద్రీనారాయణ్-బదరీనాథ్, ఉత్తరాఖండ్ 7)శ్రీవైకుంఠం 8)పరమపదం (7, 8 భూమి వెలుపల ఉన్నాయి.)

వీనిలో తమిళనాడులో 84, కేరళలో 11, ఆంధ్రప్రదేశ్‌లో 2, గుజరాత్‌లో 1, ఉత్తరప్రదేశ్‌లో 4, ఉత్తరాఖండ్‌లో 3, నేపాల్లో 1 వెలసినవి. ఇందులో శయనభంగిమలో 27, కూర్చున్నవి 21, నిలబడి ఉన్నవి 60 ఉన్నాయి మరియు తూర్పుముఖంగా 79, పడమరముఖంగా 19, ఉత్తరముఖంగా 3, దక్షిణముఖంగా 7 ఉన్నవి.

ఈ విధంగా ఆళ్వార్లు కొలిచిన దివ్యదేశాలను దర్శించి తరిద్దాం.

*॥ఓం నమో భగవతే నారాయణాయ॥*

ధారావాహిక




*(గత సంచిక తరువాయి భాగం...)*

గాయకులు పిమ్మట మహానందముతో లోనజొచ్చి, శ్రీకులశేఖరాళ్వారులు **'వడియాయ్ కిడన్దున్ పవళవాయ్ కాణ్ బేన్'** (కడవగ వడియుండి నీ ప్రవాళాధరము కాంచెదను) అని ప్రార్థించినందున శ్రీద్వారదేహళిపై (గడప), (కులశేఖర) ఆళ్వారు స్వరూపమనియే ప్రపత్తియుంచి 'అలర్మేల్మంగాదేవీ వాస స్థల హృదయా, నీ పాదలక్రింద వచ్చి చొచ్చితిని' అని లక్ష్మీదేవి పురుషకారముతోడ శ్రీపాదములకు ప్రణమిల్లి దివ్యాభరణ జ్యోతితో విలసిల్లు శ్రీపాదములు మొదలు శ్రీకుంతలముల వరకు సేవించుచు నిలచిరి. అప్పుడు శ్రీవేంకటరమణుడు ప్రబంధగాయకులకు తీర్థము, ప్రసాదము, శ్రీశఠారి శేషాం శుకము శ్రీపాదములు ప్రసాదించుట మున్నగు మర్యాదల చేయించి గాయకులను చూచి-

'మీరు మా రామనుజులకు శ్రీముఖసూక్తి గురువులగుట చేత మాకు మిక్కిలి ప్రీతిపాత్రమైతిరి. అయినందున వ్యాసపరా శరులు మావిషయమున కవితాగానము చేసినట్లు రమణీయ ద్రావిడభాషయందు ప్రప్రథమముగా మాపై కవితాగానము చేసినందున మాకు మాధుర్య మొడగూర్చు మొదలాళ్వారుల కవితలయందలి ఒక గీతమాలాపింపుడు' అనగా,

గాయకులు 'అతిక్షుద్రుడగు దాసుని (నన్ను) దివ్య సూరుల కొరకై ఇట్లు, ఆహా! ఆదరపాత్రునిగా చేయుచున్నారే!' అని మిగుల సంతసించి మొదలాళ్వారులు ప్రసాదించిన ప్రబంధములందలి మొదటి గీతములను, ముగింపు గీతములను **'మనత్తుళ్ళాన్ వేంగడత్తాన్' 'నెఱియార్ కుళల్కత్తై'** అనెడు గీతములను దేవగానము ననుసంధించి ముక్తులు సామగానము చేయునట్లు పాడగా అంతట శ్రీనివాస స్వామి సంతసించి, మరల శ్రీపాదములు శ్రీశఠారి తీర్థప్రసాదములు మొదలగు మర్యాదలనన్నిటిని ప్రసాదించి యనుగ్రహము జూప, గాయకులు వానినన్నిటిని స్వీకరించి కృతార్థులైరి.

పిమ్మట శ్రీశైలపూర్ణులును అనంతార్యులును గాయకుల తోడ 'తాము రేపటినుండి అధ్యయనోత్సవమందు దివ్యసూరుల దివ్యప్రబంధములను శ్రీవేంకటాచలపతి ఆకర్ణించునట్లుగా దేవ గానమున అనుసంధించి పాడి అనుగ్రహింపవలెను' అని పలికిరి. గాయకులు 'ఇది శ్రీనివాసుని యాజ్ఞయే'యని మరు నాడు ఆరంభించి అధ్యయనోత్సవమున **'తిరుప్పల్లాండు'** మొదలుగా దివ్యప్రబంధముల నన్నిటిని 'కర్ణరసాయనములగు మధురాలాపములు' అనునట్లుగ ప్రతిదినము గానముచేసి కృతకృత్యులై తిరునాళ్ల ముగియగా శ్రీశైలపూర్ణులు; అనంతా ర్యులు అర్చకులు మున్నగు భగవత్పరిజనులందరును మిగుల నాదరింపగా పిమ్మట శ్రీవేంకటనాథుని యనుమతిగొని గుడి నుండి శ్రీభగవద్రామానుజులు సన్నిధికి పోవగా వారు ప్రబంధ గాయకులను ప్రత్యుత్థానాభివందనాదులతోడ సత్కరించిరి.

*(ఇంకా ఉంది)*



స్వామివారిని దర్శించుకునే సమయంలో 'గోవింద' నామస్మరణ చేయాలి

యువత

# యువశక్తి.. నవ్యభక్తి

– శ్రీ జె.దీపక్, 75170 71551

ఎంతో విలువైనదీ అపురూపమైనదీ యౌవనమే! సర్వసహజంగా 15-35 సంవత్సరాల వయసు ఉన్నవారిని యువతరంగా పరిగణిస్తుంటాం. సృజన, క్రియాశీలత, సమధిక ఉత్సాహం నిండిన ఆ యువతీయువకులే నవ్యసమాజ నిర్ణేతలూ నిర్మాతలూ. వారందరిలోనూ ప్రతి ఒక్కరితోనూ పురోగమనం ముడివడి ఉంటుంది. ఆశ, శ్వాస వారేనన్న మాట.

ధార్మికత అంతటిలోనూ ప్రధానం **'భక్తిమార్గం'**. అది పరమపవిత్ర భావన. ఆ తత్త్వం మెండుగా నిండినవారు **శ్రవణ, కీర్తన, స్మరణ, అర్చన, వందన, దాస్య, సఖ్య, ఆత్మనివేదన** కలిగి ఉంటారు. **'శ్రవణం'** అంటే మంచి మాటలు వినడం. వాటిని జ్ఞాననిరతికి అన్వయించుకోవడం. దీంతో దైవం మీద విశ్వాసం మరింత విస్తరిస్తుంది. జగత్తు అంతా పరమాత్మ స్వరూపం. ఇలా అనుకోవడంలోనే సువిశాలత, విశ్వ శ్రేయో తాత్త్వికత పెల్లుబుకుతుంటాయి.

భగవానుని సదా కీర్తించడమే **'కీర్తనభక్తి'**. 'హరికై, సత్కరుణా సుధాలహరికై, ఆనందమందాకినీ, ఝరికై, నిత్య నివాస శేషగిరికై' అని శ్లాఘించినట్లు, ఉత్తమ రచనలు చదవడం బుద్ధి వికాసాలను పెంపొందిస్తుంది. ఆ చదివిన వాటిని స్మరించి కీర్తించిన ప్రతీసారీ యువజనోత్సాహం ద్విగుణీకృతమవుతుంటుంది.


**'స్మరణం'** అనేది విద్యతో వర్ధిల్లుతుంది. పుస్తకాల్లో పురాణగాథలను చదివినపుడు, తరగతి గదుల్లో వినినపుడు, మిత్రులతో కలిసి వల్లె వేసినపుడు, పదే పదే స్మరించుకున్నపుడూ భక్తిప్రపత్తి విస్తారమవుతుంటుంది. శ్రీవేంకటేశం మనసా స్మరామి, దేవాధిదేవా నమో నమామి అనుకుంటున్నంత సేపు స్మరణ చింతన అనంతం.

పదకవితా పితామహుడు అన్నమయ్యది **'శ్రీపదార్చన'**. సంకీర్తనల ద్వారా ఆయన వెలయించిన రచలన్నీ

శాంత సత్య క్షమా దయాక్రాంత బుద్ధి।
సంతతానంద మహిత యశః ప్రవృద్ధి।
భాగ్యసౌభాగ్యశోభ ప్రభా సమృద్ధి।
భారతజనయిత్రి ధాత్రి పొల్పందుగాక॥

– అని సుధాంశుకవి ఆకాంక్ష. భారతీయ నరనారీ భావాంకిత జయస్ఫూర్తితో జాతికి భవ్యదీక్ష, దివ్యరక్ష కలుగుతుందన్నది అంతరంగ తరంగం. యువతలో 'ఆధ్యాత్మికత' వెల్లివిరిసినప్పుడే అన్నీ సిద్ధిస్తాయి, కలలన్నీ తప్పక ఫలిస్తాయి.

యువజనులతోనే నవాభ్యుదయం. ఏ దేశపురోభివృద్ధి అయినా వారితో సులభసాధ్యం. మనది అత్యధిక సంఖ్యలో యువత ఉన్న దేశం. అందుకే అందరి ఆశలూ, ఆశయాలూ వారి చుట్టూనే పరిభ్రమిస్తుంటాయి. జీవితంలో అన్ని దశల్లోనూ




తిరుమల శ్రీవారి ఆలయం చుట్టూ ఉన్న మాఢవీథులలో 'పాదరక్షలు' లేకుండా ప్రవేశించాలి.

ప్రత్యేకించి యువసాహితీ, సంగీత, నర్తనవేత్తలకు స్ఫూర్తి ప్రదాయకాలు. వాటిల్లోని వేంకటపతి తత్త్వాలను జీవాత్మ పరమాత్మల తాదాత్మ్యరీతులను మరింత అనుభవానికి తెచ్చు కోవాల్సి ఉంది. '*చెంగట నల్లదివో శేషాచలము, నింగినున్న దేవతల నిజవాసము, ముంగిట నల్లదివో మూలనున్న ధనము, బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము*' అనడంలోని రూప చిత్రణ యువభక్తులకూ అనుభవైక వేద్యం.

'వందనమో సనక సనందన సంసేవ్యా! జనగణ మంగళ సంభావ్యా, వకుళమాలికా వరపుత్రా, సకల జగన్నుత చరిత్రా' అనేది **'అభివందన'** భక్తి. సర్వసాధారణంగా యువతీ యువకుల్లోనే ప్రశ్నించే గుణం, స్పందన స్వభావం వ్యక్త మవుతుంటుంది. వాటి మూలపరిణామంతో ఎంతో తెలుసు కుంటారు, ఎన్నో నేర్చుకుంటారు. ఇదే క్రమంలో వారి అధ్యయన శీలత, నిర్వహణ దీక్షాదక్షతలను వెలికితీసే సాధనాలు కావాలి, రావాలి. ఆ రీత్యా క్షేత్రదర్శనాలు, ధర్మప్రచారాలు ఎంతెంతో ఉపకరిస్తాయి.

దైవంతో స్నేహబంధ ప్రయత్నమే **'సఖ్యత'**. 'చనుడీ కొండకు; స్వామి పుష్కరిణిలో స్నానమ్ము గావింపుడీ, జనులారా! కనులారా గాంచుడీ విభున్', అనే శ్రీనివాసోదాహరణ అభ్యర్థనలో అభివ్యక్తమయ్యేది సఖ్యభక్తి. ఇందులో భక్త్యావేశంతో పాటు **'ఆత్మనివేదనం'** అంతర్లీనంగా నెలకొంటుంది. సత్యశివ సుందరత్వాలీ భగవత్ తత్త్వాలు. పురాణాలు, పారాయణాలు, వ్రత ఆచరణలు తేటతెల్లం చేసేవన్నీ ఇటువంటి సంప్రదాయ విధానాలనే!

సంప్రదాయం అనేసరికి మానవతా మహితతత్త్వం మన ముందు నిలుస్తుంది. వేదవాణి '*లోకాస్సమస్తాస్సుఖినో భవంతు*' అంటుంది. '*సర్వే భద్రాణి పశ్యంతు మా కశ్చిత్ దుఃఖభాక్ భవేత్*' అని తెల్చి చెప్తుంది. పురాణవాణి ధార్మిక విధానాలను విపులీకరిస్తున్నాయి. వీటన్నింటినీ పూర్తి సదవ గాహనకు తెచ్చుకోవాల్సింది యువతే! ఈ క్రమంలో సదస్సులు, ఆధ్యాత్మిక ప్రదర్శనలు, పుణ్యక్షేత్ర సందర్శనలు యువతరానికి అన్ని విధాలా దోహదమవుతాయి. ఒకప్పటి భక్తిఉద్యమ విలక్షణతను ఇప్పటి యువజనం అవగతం చేసుకోవడం ఎంతైనా అవసరం. ఎందుకంటే అదంతా శ్రద్ధాసక్తుల సమన్వితం. అనుభవానికి తెచ్చుకోవాల్సింది, ఆ బాధ్యత వహించి తీరాల్సిందీ యువతే! అందుకు మార్గదర్శకాలు అనేకం.

పరమాత్మను హృదయంలో దర్శించడమే భక్తి అను కుంటే; అందుకు దారి చూపగలిగేది గురువులే. వారు చివరి వరకూ అవసరమైనవారే. సదాత్మను పొందడంలో దిక్సూచి మాదిరిగా నిలుస్తారు. ఆత్మసాక్షాత్కారమే గురువన్నది దీని తాత్పర్యం. గురువుకు ఉండాల్సింది విశదీకరణ సామర్థ్యం. శిష్యుడు పెంపొందించుకోవాల్సింది విశ్వాస ఏకీకరణం.

మన సనాతనధర్మం పలు నియమాలను ఏర్పాటు చేసింది. ఇవన్నీ శాశ్వత విలువను కలిగి ఉన్నవే. స్వచ్ఛత, ఉత్తమ గుణం, సహనశీలత, దాతృత్వశక్తి దీనిలోని అంత ర్భాగాలు. మనదైన ధర్మాన్ని అనుసరించడంలో తీసుకోవాల్సిన ప్రధాన జాగ్రత్తలు రెండు. వాటిల్లో ఒకటి– **భక్తి, జ్ఞాన, కర్మయోగ** సమ్మిళితమని గ్రహించి ఆచరించడం. మరోటి, ధర్మనిరతికి ఎదురయ్యే అవాంతరాలు తొలగింపులో యువశక్తే కీలకపాత్ర వహించడం. '*ధారయతి ఇతి ధర్మం*' అని కదా సూక్తి. ఈ విధమైన జీవశక్తి పుష్కలంగా ఉండేది యువ తరంలోనే కాబట్టి, వారి బాధ్యత అనంతం.

పాఠ్యపుస్తకాలు, శాస్త్రకళ– రచనలు, గురుబోధనలు, సత్త్వగుణగణప్రచారాలు, విధివిధానాల అనుసరణలు, ప్రవచనాల విస్తరణలు, సేవాభావాన్ని ఆచరణకు తెచ్చే శక్తియుక్తులు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మిత్ర బృందాలతో పాటు యువతి/యువకుడిలో పరిఢవిల్లే ధర్మ పరిరక్షణ సంకల్పదీక్ష జాతి అంతటికీ ఏకైక రక్ష. '*శ్రీపద్మనాభ పురుషోత్తమ వాసుదేవ, వైకుంఠమాధవ జనార్దన చక్రపాణే, శ్రీవత్స చిహ్న శరణాగత పారిజాత, శ్రీవేంకటాచలపతే...*' అంటూ చేతులు జోడించి ప్రార్థిద్దాం స్వామివారిని! ఆయన కృపాకటాక్ష వీక్షణాలతో యువభక్తి తత్త్వవిస్తృతిని అందరం మనసారా కోరుకుందాం. నమో వేంకటేశాయ!

# తిరుత్తేవనార్‌తొగ్గై
## (కీళ్‌చాలై)
## మాధవప్పెరుమాళ్ కోయిల్

- ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరునాంగూర్ దివ్యదేశంలో తొమ్మిదవ దివ్యదేశం **'తిరుత్తేవనార్‌తొగ్గై'.** ఈ దివ్యదేశం శీర్‌కాళి అనే దివ్యదేశం నుండి 8 కిలోమీటర్ల దూరంలో, తిరునాంగూర్‌కి సమీపంలో **'మాధవప్పెరుమాళ్ కోయిల్'** అనే పేరుతో వెలసి ఉన్నది. మంచి ప్రకృతి రామణీయకతతో ఒకే ప్రాకారంతో ఈ దివ్యదేశం అమరియున్నది. పశ్చిమాభిముఖంగా శ్రీదేవీ-భూదేవీ సమేతుడై, నిలుచున్న భంగిమలో శంఖచక్రాదులను ధరించి అభయ హస్తంతో నాలుగు భుజాలతో **'దైవనాయకన్'** అనే దివ్య నామంతో మూలమూర్తి సేవను ప్రసాదిస్తున్నాడు. ఉత్సవ మూర్తులు మూలమూర్తి వలె చతుర్భుజములతో శ్రీదేవి, భూదేవీ సమేతుడై **'మాధవప్పెరుమాళ్'** అనే దివ్యనామంతో అను గ్రహిస్తున్నాడు. ప్రత్యేక సన్నిధిలో అమ్మవారు సముద్రం నుండి వచ్చినది కనుక **'కడల్‌మగళ్‌నాచ్చియార్'** అంటే 'సముద్రతనయ' అనే పేరుతో అమ్మవారు వేంచేసి ఉన్నారు. ఉత్సవమూర్తి **మాధవనాయకి, మధురనాయకి** అను తిరునామాలతో పిలువ బడుచున్నారు. ఇచ్చట ఉన్నటువంటి తీర్థం **శోభనతీర్థం, దేవసభాపుష్కరిణి, దేవకుండపుష్కరిణి** అని పిలువబడుచున్నది. **శోభనవిమానం** ఈ దివ్యదేశంయొక్క విమానం.

### ప్రత్యేకత

**'కడల్‌మగళ్‌నాచ్చియార్'-** సముద్రతనయ క్షీరాబ్ధినుండి విచ్చేసింది కనుక, ఆ సన్నిధి విమానంయొక్క నీడ విమానమందే పడుతుందిగాని భూమిలో పడనే పడదట.

### స్థలపురాణం

దేవేంద్రుడు దేవతలకి రాజుగా దేవలోకంలో సమస్త మైనటువంటి భోగాలను అనుభవిస్తూ, తమ యొక్క స్థితిని మరవడం జరిగినది. ఒకానొక సందర్భంలో దుర్వాసమహర్షి శ్రియఃపతి ప్రసాదంతో ఒక అద్భుతమైనటువంటి మాలను తీసుకుని వస్తూ ఉన్నాడు. 'ఈ సుగంధభరితమాలతో తనకేమీ పనిలేదు' అని అనుకున్నటువంటి దుర్వాసమహర్షి, ఒక సామాన్యమైన రాజుకి ఈ మాలను ఇస్తే బాగుండదు కదా! కనుక, దేవేంద్రుడికి ఈ మాలను ఇస్తే బాగుంటుందని అనుకుని, ఐరావతంపైన కూర్చుని ఆడంబరంగా వస్తున్నటువంటి ఇంద్రుడికి ఇవ్వాలని తలచాడు. అప్పుడు ఇంద్రుడు మదాంధీకృత లోచనుడై, గర్విష్ఠుడై, రెట్టింపు అహంకారంతో ఉన్నాడు. దేవేంద్రుడు దుర్వాసమహర్షిని చూచి కనీసం దిగలేదు, నమస్కారం అనీ చెప్పలేదు. నమస్కరించలేదు కూడ. దుర్వాస మహర్షి దీనిని పెద్దగా లెక్కచేయకుండా తన చేతిలో ఉన్నటువంటి మాలను ఆ దేవేంద్రుడికి ఇవ్వగా, దేవేంద్రుడు అలక్ష్యభావనతో ఆ మాలను తీసుకుని, ఆ మాలను గౌరవంగా భక్తిగా శిరస్సుకు తాకించకుండా, వెంటనే ఆ మాలను ఐరావతం పైన వేశాడు. ఆ ఐరావతము తనపైన ఏదో వేయబడినది అనే భావనతో ఆ మాలను వెంటనే తన తొండముతో తీసి కిందపడవేసి, కాళ్ళతో తొక్కి వేసినది.




ఈ విషయాన్ని ప్రత్యక్షంగా చూస్తున్నటువంటి దుర్వాసమహర్షికి అమితమైన కోపం వచ్చింది. ఇది తనకి జరిగినటువంటి అవమానం కాదు. తనయందు ఉన్నటువంటి ఒక ఆదరం చేత అమ్మవారు మరియు శ్రీవారు ఈ మాలను ప్రసాదించారు. వారికి కూడా ఈ అవమానం జరిగినది అని కోపంతో దేవేంద్రుణ్ణి ఇలా శపించాడు. "హే ఇంద్ర! ఐశ్వర్యమదంతో నీవు గుడ్డివాడయ్యావు. ఏ యొక్క సంపదను పొంది నీవు పరబ్రహ్మ స్వరూపుడైనటువంటి నారాయణుని,



అమ్మవారిని అవమానించావో ఆ సంపద, ఆ ఐశ్వర్యం ఇక నిన్ను విడిచిపెట్టి వెళ్లనీ! పదవీచ్యుతుడవు కమ్ము! అలాగే అందరిచేత అవమానింపబడు!" అని శాపమిచ్చాడు.

దుర్వాసమహర్షి శాపం చేత అన్నింటిని పోగొట్టు కున్నాడు ఇంద్రుడు. చివరగా రాక్షసులు అతని ఐశ్వర్యాన్ని, దేవలోకాన్ని పొందారు. ఇంద్రుడు తన యొక్క తప్పును తెలుసుకుని, తన అపరాధాన్ని మన్నించమని దుర్వాస మహర్షిని, అలాగే బృహస్పతిని ప్రార్థించగ, వారు బ్రహ్మదేవుని దగ్గరకువెళ్లి అడగమని చెప్పడం, ఇంద్రుడు బ్రహ్మదేవుని దగ్గరకు వెళ్లి ప్రార్థించగా, చతుర్ముఖబ్రహ్మ 'శ్రియఃపతిని శరణాగతి చేయి' అని పంపించాడు.

ఇంద్రుడు పాలకడలిలో యోగనిద్రలో శయనించి ఉన్నటువంటి పరంధాముణ్ణి సమీపించి శరణాగతి చేయగా, భక్తవత్సలుడు సౌశీల్యగుణసంపన్నుడైనటువంటి పరమాత్మ ఇంద్రునియందు దయను చూపెట్టి, 'నీకు ఆ ఐశ్వర్యం మళ్ళీ తిరిగి వస్తుంది. ఇంద్రపదవి కూడా నీకు దక్కుతుంది' అని చెప్పి ఆశ్వాసనం ఇచ్చాడు. తరువాత లక్ష్మీనారాయణుడు పాలకడలిని చిలికి, ఇంద్రుడు పోగొట్టుకొన్నటువంటి 'ఐరావతము, ఉచ్చై శ్రవము, కామధేనువు, చింతామణి, కల్పవృక్షము' ఐశ్వర్యాలన్నింటినీ కూడా ఒక్కొక్కటి కూడా పైకి రప్పించి ఇంద్రుడికి చెందేటట్లు చేశాడు.

పాలకడలినుండి చంద్రుడు, వారిణి, అమ్మవారు కూడా పైకి రాగా, ఇంద్రుడు వెంటనే అమ్మవారి కాళ్ళపై పడి తను చేసినటువంటి అపచారాన్ని మన్నించమని ప్రార్థింపగ, అమ్మ వారు స్వామివారితో అతనిని అనుగ్రహించమని చెప్పగ, తమ చేతిలో ఉన్నటువంటి ఆ పారిజాతమాలను ఇంద్రుడికి అనుగ్రహించడం జరిగినది. భక్తిశ్రద్ధలతో ఇంద్రుడు ఆ మాలను పొంది, తన కన్నులకు అద్దుకుని, ఆ మాలకు మంచి మర్యాదను ఇచ్చాడు. ఆ పారిజాతమాల ప్రసాదాన్ని పొందిన తరువాత ఇంద్రుడు దేవలోకానికి అధిపతి అయ్యాడు.

ఆ సమయంలో మహావిష్ణువు మహాలక్ష్మిని వివాహం చేసుకుని, ఆ వివాహవస్త్రాలతోనే సేవాభాగ్యాన్ని ప్రసాదించాడు. దేవదేవుని దివ్యవివాహస్వరూపాన్ని దర్శించుకోవాలని దేవతలందరూ కూడా ఒకే చోట చేరినటువంటి స్థలమే **'తిరుత్తేవనార్‌తొగ్గై'** అని పిలువబడుచున్నది.

భగవంతుడు మహాలక్ష్మిని వివాహం చేసుకున్న తర్వాత, ఆ వివాహం జరిగిన చోటు కూడా ఈ దివ్యదేశమే అని చెప్పబడుచున్నది. ఈ దివ్యదేశవిషయమే **'తిరుమంగై ఆళ్వారులు'** పది పాశురములు మంగళాశాసనము చేశారు.

ఎవరైతే ఈ తిరుత్తేవనార్‌తొగ్గై అనే దివ్యదేశానికి వచ్చి స్వామిని, అమ్మవారిని దర్శించుకుంటారో వారికి వెంటనే వివాహము, సత్సంతానము కూడా పొందగలరు.

**శ్రీమద్దివ్యసభాసరస్తటభువి శ్రీదేవబృందే పురే**
**దేవో దైవతనాయకః తదబలా క్షీరాబ్ధిజా శోభనే।**
**దీప్త్యా నిర్జిత భాస్కరే తు రమణః తద్ వ్యోమయానే స్థితః**
**శిష్టః శ్రేష్ఠవసిష్ఠ వాంఛితకరః ప్రత్యఙ్ముఖో భాసతే॥**

*॥ ఓమ్ తత్సత్ ॥*

## విశేషాంశములు

| | |
|---|---|
| భగవంతుడు | : మూలమూర్తి 'దైవనాయకన్'<br>ఉత్సవర్లు-మాధవప్పెరుమాళ్ |
| అమ్మవారు | : మూలమూర్తి 'కడల్‌మగళ్‌నాచ్చియార్' (సముద్రతనయ)<br>ఉత్సవర్లు-మాధవనాయకి, మధురనాయకి. |
| తీర్థం | : శోభనపుష్కరిణి, దేవసభాపుష్కరిణి, దేవకుండపుష్కరిణి |
| విమానం | : శోభనవిమానం |
| ప్రత్యక్షం | : వశిష్ఠునికి, ఉదంకమహర్షికి |
| ఆగమం | : పాంచరాత్రాగమం |
| కీర్తించిన ఆళ్వార్లు | : తిరుమంగై ఆళ్వారులు |



# శ్రీపద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలు,

తిరుచానూరు


| తేదీలు | వారం | పగలు ఉత్సవం | రాత్రి ఉత్సవం |
|---|---|---|---|
| 27-11-2024 | బుధవారం | లక్షకుంకుమార్చన | సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణం |
| 28-11-2024 | గురువారం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజారోహణం | చిన్నశేషవాహనం |
| 29-11-2024 | శుక్రవారం | పెద్దశేషవాహనం | హంసవాహనం |
| 30-11-2024 | శనివారం | ముత్యపుపందిరివాహనం | సింహవాహనం |
| 01-12-2024 | ఆదివారం | కల్పవృక్షవాహనం | హనుమద్వాహనం |
| 02-12-2024 | సోమవారం | పల్లకీ ఉత్సవం, సా॥వసంతోత్సవం | గజవాహనం |
| 03-12-2024 | మంగళవారం | సర్వభూపాలవాహనం, స్వర్ణరథోత్సవం | గరుడవాహనం |
| 04-12-2024 | బుధవారం | సూర్యప్రభవాహనం | చంద్రప్రభవాహనం |
| 05-12-2024 | గురువారం | రథోత్సవం | అశ్వవాహనం |
| 06-12-2024 | శుక్రవారం | పల్లకీ తిరుచ్చి ఉత్సవం, తీర్థవారీ, అవభృథం, చక్రస్నానం, పంచమీతీర్థం | తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం |
| తిరుచానూరు శ్రీపద్మావతీ తాయార్ల పుష్పయాగ మహోత్సవం | | | |
| 07-12-2024 | శనివారం | పుష్పయాగం (పంచమీతీర్థం మరుసటి రోజు జరుగును) | |











# తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన ధర్మకర్తలమండలి

## 2024, నవంబరు నెలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంచే నియమితులైన తి.తి.దేవస్థానముల నూతన ధర్మకర్తలమండలి



శ్రీ బి.ఆర్.నాయుడు,
తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు



శ్రీ జ్యోతుల నెహ్రూ,
శాసనసభ సభ్యులు-జగ్గంపేట
సభ్యులు



శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి,
శాసనసభ సభ్యురాలు-కొవ్వూరు
సభ్యురాలు



శ్రీ ఎం.ఎస్.రాజు,
శాసనసభ సభ్యులు-మడకశిర
సభ్యులు



డా॥ పనబాక లక్ష్మి,
సభ్యురాలు



శ్రీ నన్నూరి నర్సిరెడ్డి,
సభ్యులు



శ్రీ జాస్తి పూర్ణ సాంబశివరావు,
సభ్యులు



శ్రీ సదాశివరావు నన్నపనేని,
సభ్యులు



శ్రీ కృష్ణమూర్తి వైద్యనాథన్,
సభ్యులు



శ్రీ అక్కిన మునికోటేశ్వర రావు,
సభ్యులు



శ్రీ మల్లెల రాజశేఖర్ గౌడ్,
సభ్యులు



శ్రీ జంగా కృష్ణమూర్తి,
సభ్యులు



శ్రీ దర్శన్ ఆర్.ఎన్.,
సభ్యులు

# తిరుమల తిరుపతి దేవస్థానముల నూతన ధర్మకర్తలమండలి



శ్రీ వైద్యం ఎం.శాంతారామ్,
సభ్యులు



శ్రీ పి.రామమూర్తి,
సభ్యులు



శ్రీమతి తమ్మిశెట్టి జానకీదేవి,
సభ్యురాలు



శ్రీ బొంగునూరి మహేందర్ రెడ్డి,
సభ్యులు



శ్రీమతి అనుగోలు రంగశ్రీ,
సభ్యురాలు



శ్రీ బూరగపు ఆనంద్‌సాయి,
సభ్యులు



శ్రీమతి సుచిత్ర ఎల్లా,
సభ్యురాలు



శ్రీ ఎస్.నరేష్ కుమార్,
సభ్యులు



డా॥ అదిత్ దేశాయ్,
సభ్యులు



శ్రీ సౌరభ్ హెచ్.బోరా,
సభ్యులు



శ్రీ జి.భానుప్రకాష్ రెడ్డి,
సభ్యులు



శ్రీ ఎస్.సత్యనారాయణ, ఐ.ఏ.ఎస్.,
కమీషనర్, రెవిన్యూ ఎండోమెంట్స్, ఆం.ప్ర.
ప్రభుత్వ కార్యదర్శి, రెవిన్యూ (ఎండోమెంట్స్), ఎఫ్.ఏ.సి.,
ఎక్స్-అఫిషియో సభ్యులు



శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి,
తి.తి.దే., తిరుపతి
ఎక్స్-అఫిషియో సభ్యులు



06-11-2024న తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులుగా తిరుమల శ్రీవారి ఆలయంలో శ్రీ బి.ఆర్.నాయుడుగారు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ధ్వజస్తంభాన్ని తాకి మ్రొక్కుతున్న దృశ్యం



06-11-2024న తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులుగా శ్రీ బి.ఆర్.నాయుడుగారి ప్రమాణస్వీకరణానంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి ప్రసాదాన్ని అధ్యక్షుల దంపతులకు అందజేస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., అదనపు కార్యనిర్వహణాధికారి శ్రీ సి.వెంకయ్యచౌదరి, ఐ.ఆర్.ఎస్.



07-11-2024న తిరుమలలోని కాకులమానుదిబ్బ డంపింగ్‌యార్డును తి.తి.దే. సిబ్బందితో కలిసి పరిశీలిస్తున్న తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుగారు



08-11-2024న తిరుమలలోని ధర్మగిరి వేదవిజ్ఞానపీఠంను సందర్శించిన తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుగారికి స్వాగతం పలుకుతున్న ప్రిన్సిపాల్ శ్రీ కె.ఎస్.ఎస్.అవధానిగారు



08-11-2024న తిరుమలలోని పెద్దజీయర్ మఠాన్ని సందర్శించిన తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుగారికి మంగళాశాసనపూర్వక ఆశీస్సులు అందజేస్తున్న శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామివారు



08-11-2024న తిరుమలలోని ఎస్.వి.గోశాలను తి.తి.దే. ధర్మకర్తలమండలి అధ్యక్షులు శ్రీ బి.ఆర్.నాయుడుగారు సందర్శించి గోమాతను సేవిస్తున్న దృశ్యం. ఈ కార్యక్రమంలో ఎస్.వి.గోశాల డైరెక్టర్ డా॥హరనాథ రెడ్డి గారు పాల్గొన్నారు



# ఉపదేశ సందేశం

– శ్రీమతి మేడేపల్లి అన్నపూర్ణ, 99483 45013

**శ్రీ**మద్భగవద్గీత జీవనసారాంశం. మానవజీవితం త్రిదశమయం– **బోధనం, సాధనం, ఆచరణం.** మనది ధర్మక్షేత్రం. ఉత్తమ, ఉదాత్త, ఉన్నతస్థితిగతుల నిలయం. అధర్మాన్ని సహించదు. అన్యాయాన్ని భరించదు. కురుక్షేత్రం మాదిరిగా సంగ్రామం సాగుతూనే ఉంటుంది. తుది విజయం ఎప్పటికీ మంచితనానిదే. అప్పుడూ ఇప్పుడూ ఎల్లప్పుడూ కూడా. **'ధర్మక్షేత్రే కురుక్షేత్రే'** అని మొదలవుతుంది గీతాశాస్త్రం. బోధించింది కృష్ణపరమాత్మ. ఆలకించింది పార్థుడిమది. అదంతా మానవాళికి కర్తవ్యబోధ.

**ఏకాదశినాడు 'గీతాజయంతి'.** ఎంతో పవిత్ర దినోత్సవ వేళ. ఆ రోజునే **'భగవద్గీత'** ఆవిర్భావం. పూర్వరంగాన్ని సమీక్షిస్తే– కురుపాండవ సమరం మొదలై, పలు పరిణామాలు చోటు చేసుకున్నాయి. అన్నింటినీ వివరించాలని కోరిన ధృతరాష్ట్రుడికి అంతర్నేత్ర దర్శనం చేయించాడు సంజయుడు. రణసీమలో అర్జునుడికి కృష్ణుడి జ్ఞానోపదేశమూ ఆవిష్కృతమైంది. అన్నిటినీ అంతటినీ ప్రభావితం చేసిన సందర్భమిది. వ్యక్తులను వ్యవస్థలనూ కర్తవ్యోన్ముఖంగా మలచిన తరుణమూ అదే. అందుకే గీతాశాస్త్రానికి ఇంతటి విశిష్టత, ప్రత్యేకత.

**'కర్తను నేను సమస్త భూతములకున్, కౌంతేయ! సర్వమ్ములో వర్తించున్'** అన్నాడు కృష్ణదేవుడు. *'అవతార ధర్మమని నిర్వర్తించు, భూభారమున్ దీర్తున్; నీవు నిమిత్త మాత్రమగుమంతే!'* అని ప్రస్ఫుటం చేశాడు. దేవదత్తం పరువు, గాండీవ గౌరవం, శ్వేతఅశ్వాల మాహాత్మ్యం, కపిధ్వజప్రతిష్ఠ కలకాలం నిలిచే తీరాలన్నాడు. ఆత్మవిస్మృతి తగదని, సందిగ్ధం కూడదని ఉద్బోధించాడు. ఆత్మగౌరవపథాన ముందుకే అడుగువేయాలని ప్రోత్సహించాడు. 'నరుడివి నీవైతే నేను నారాయణుడిని' అని తెలియపరిచాడు. ధర్మాన్ని చేపట్టి ఘనవిజయపతాకను ఎగురవేయాలని ఉత్సాహం కలిగించాడు. **అర్జునవిషాదయోగం** మొదటిదైతే, **మోక్షసన్యాసయోగం** చివరిదైన పద్దెనిమిదోది. మధ్యలోనివి సాంఖ్య, కర్మ, జ్ఞాన, ఆత్మసంయమ, భగవద్విజ్ఞాన, అక్షరపరబ్రహ్మ యోగాదులు.

**డిసెంబరు 11న గీతాజయంతి సందర్భంగా...**

వీటితోపాటు రాజగుహ్య, విభూతి, విశ్వరూప సందర్శన, భక్తి, క్షేత్రక్షేత్రజ్ఞ, గుణత్రయ విభాగ, పురుషోత్తమ ప్రాప్తి, దైవాసుర సంపద్విభాగ శ్రద్ధాత్రయ విభాగయోగాలు భగవద్గీత అంతర్భాగాలు. ఇందులోని మార్గదర్శ అంశాలు–

**1)** అసత్యం లేనే లేదు, సత్యం అనేది ఉండకపోదు;

**2)** ఆత్మ అవినాశి; తత్త్వం తెలిసి మసలాలి మనం. జయాపజయాలను సమదృష్టితో చూడగలగాలి. స్థిర ప్రయోజనాన్ని వీడకూడదు;

**3)** కర్మయోగంలోచేసే ధర్మం స్వల్పమైనా ఫలప్రదమే;

**4)** మనసు నిశ్చలమైతేనే ఏ సాధన అయినా ఫలిస్తుంది;


**5)** అడుగడుగునా సందేహంలో కొట్టుమిట్టాడేవాడికి ఇహలోకంలోనూ సుఖశాంతులుండవని తెలుసుకోవాలి;

**6)** ఆహారవిహారాల్లో పరిమితి పాటించే వ్యక్తికి దుఃఖాలు తొలగి, యోగసిద్ధి కలుగుతుంది.

అవివేకపూరిత అభ్యాసంకన్నా జ్ఞానంమిన్న. దాని కంటే ధ్యానం ఉత్తమం. అన్నిటినీ మించి, కర్మఫలత్యాగం మంచిది. దీనివల్ల మనసుకు శాంతి కలుగుతుందన్నది గీతాచార్య ఉద్బోధ. పవిత్రత కార్యదక్షత, నిరాడంబరత్వం నిండిన భక్తులే తనకు ఇష్టమన్నారు ఆయన. మనోనిర్మలత్వం, మౌనస్వభావం, శాంత పూరితత్త్వం, అంతఃకరణ శుద్ధులను 'మానసిక తపస్సు'గా అభివర్ణించారు. **'త్వమేవ శరణం గచ్ఛ సర్వభావేన భారత, తత్ప్రసాదాత్పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసి శాశ్వతమ్'** అంటుంది తుదిఅధ్యాయ శ్లోకం. భారతవంశ శ్రేష్ఠుడవైన నువ్వు స్వామిని శరణుకోరడం వల్ల కరుణాకటాక్షాలు లభిస్తాయన్నది ధనుంజయుడికి చేసిన ఉపదేశం. ఉభయుల మధ్య చర్చను తెలుసుకున్నవారు జ్ఞానయజ్ఞ ఆరాధకులవుతారనీ తాత్పర్యం. సరిగ్గా వీటిని మనసులో పదిలపరచుకుని గీతాజయంతి క్రతువును నిర్వర్తించుకుంటారు.

**మోక్షదఏకాదశి** అని కూడా పిలుస్తారు. గీతబోధలన్నీ సముదాత్త జీవన విధాన సూచకాలు. అందుకనే గీతాజయంతిన పఠన కార్యక్రమాలు నిర్వహిస్తారు. వేదవిజ్ఞానసారంగా సంభావిస్తారు ఇంటింటా, ఊరూరా.. వ్రతానికి ఒక్కరోజు ముందు ఉపవాసదీక్ష పాటిస్తారు. ఉపవాసం అంటే ఆధ్యాత్మికంగా స్వామితో వాసమే. ఆలయాల్లోనూ ప్రత్యేకపూజలు జరుపుతారు. ఆగమసారం, యోగవిచారం వాటిల్లో ప్రతిఫలిస్తాయి. 'హరే మురారే మధుకైటభారే గోవింద గోపాల ముకుంద' అని నినదిస్తాయి జనమానసాలన్నీ. 'పాండవరక్షక పాపవినాశక కేశవహరే మాధవా, అర్జున రక్షక అజ్ఞాన నాశక కృష్ణా' అంటూ భక్తితరంగితమవుతాయి. అదే గీతామృతం. ఆస్వాదనతో అందరికీ హృదయానందం. రోజంతా తన్మయత, ఉద్విగ్నత వెల్లివిరుస్తుంటాయి.

**'ఇదం శాస్త్రం మయా ప్రోక్తం గుహ్యవేదార్థదర్పణం'.** ఇదీ కృష్ణ బోధాంశం. 'నాదైన ఈ గీత సకల పదార్థాలకూ అద్దం వంటిదని ఆయన ఉవాచ'. భగవద్గీత సారాంశాన్ని అవగతం చేసుకుంటే, అదే వికాసదీప్తి. సన్మార్గపయనంతో మాత్రమే స్ఫూర్తి కీర్తి. కాంతికిరణమే గీతోపనిషత్తు. ఇందులోని తత్త్వాన్ని జీవితానికి ఏ మాత్రం వర్తింపచేసుకున్నా సమున్నత స్థితి తథ్యం. ఇదే భావనతో జయంతిఉత్సవ తరుణాన గీతపఠనం, ధార్మిక కార్యక్రమాలు, శ్లోకపోటీలు, నర్తన ప్రదర్శనలు, రూపచిత్రణలు, సేవాశిబిరాలను ఏర్పాటు చేస్తుంటారు. ప్రజలు, ప్రవచనాలు, దానధర్మాలతో వాతావరణమంతా శోభాయమానమవుతుంది.




తిరుమల తిరుపతి దేవస్థానం పరిధి ఆలయాల్లో జరిగే పారాయణాలు వీనులవిందు, నేత్రానందం అందిస్తాయి. వేద పండితుల పర్యవేక్షణలోని నాద ధ్వనులు అందరికీ అలౌకిక అనుభూతిని ప్రసాదిస్తుంటాయి. జీవితరంగాన ప్రతీ వ్యక్తీ నిలవాలి, గెలవాలి. గెలిచి తీరాల్సిన కృషి అది. ఈ విశ్వానికి దివి

న్యాయమంటూ ఒకటుంది. జీవాత్మకు పరమాత్మతో గల ప్రగాఢబంధంతో ముడిపడి ఉంటుంది. మార్పు అనేది సహజ సిద్ధం. అందరూ తమను తాము ఉత్తమంగా తీర్చిదిద్దుకోవాలి. ఎందులోనూ 'అతి' తగదు. తన గురించి తానే అర్థం చేసు కావాలి మనిషి. తనదైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుని సమున్నత స్థితిని అందిపుచ్చుకోవాలి మరి. ఈ అంశాలన్నిటినీ తేటతెల్లం చేస్తుంది గీతాజయంతి.

*'యత్ర యోగీశ్వరః కృష్ణో యత్ర పార్థో ధనుర్ధరః, తత్ర శ్రీర్విజయో భూతిర్ధ్రువా నీతిర్మతిర్మమ'.* ఎక్కడ కృష్ణుడు ఉంటాడో, అర్జునుడూ ఉంటాడో అక్కడ నిశ్చయంగా ఉండేవి సంపద, శక్తి, నీతి, విజయం. దేవాధిదేవుడైన శ్రీకృష్ణపరమాత్మే పరమసత్యం. ఇదే భగవద్గీత ఏకవిలక్షణం. భౌతిక ప్రకృతి, జీవులు, కర్మలు, శాశ్వతకాలం గురించిన తత్త్వరూపాలే ఇందులో నెలకొన్నాయి. శుద్ధ భక్తియుక్త సేవతోనే భక్తులందరూ ఆ దివ్యగుణత్వాన్ని అనుభవానికి తెచ్చుకుంటారు.

తాత్త్వికత, ఆచరణాత్మకతల కలయికే భగవద్గీత. ఆధ్యాత్మిక, ధార్మిక విలువల రంగరింపుతో గీతాజయంతి జన హృదయాన సుస్థిరస్థానం సంపాదించింది. గీత అనేది కేవల బోధనో, శాస్త్రమో కాదు. ఒకే ఒక్క మాటల్లో అది జీవితం. జాతి అంతటికీ 'దిగ్దర్శనం'. నాటి, నేటి సమస్యలెన్నింటికో ధీటైన పరిష్కారాలు గల సమగ్ర విధానం. ఇందులోని ఎన్నెన్నో కోణాలను మననం చేయిస్తుంది జయంతివ్రతం. అదొక సమారోహంగా అసంఖ్యాక భక్తజనాదరణ అందుకుంది ఏనాడో!

## 2025, జనవరి నెల ఉత్సవాలు, పర్వదినాలు

| | |
|---|---|
| 01 | ఆంగ్ల సంవత్సరాది |
| 10 | వైకుంఠఏకాదశి |
| 13 | భోగిపండుగ |
| 14 | సంక్రాంతి |
| 15 | కనుమ |
| 26 | రిపబ్లిక్ డే |



'మోక్షదఏకాదశి' విశిష్టతను ధర్మజుడికి కృష్ణుడు ఉపదేశించాడని కథనం. ఆ మేర, వ్రత సమాచరణ, ఉపవాస దీక్ష ఇది అత్యంత విశేషణీయం. ఎంతైనా మహిమాన్విత పూరితం. ప్రత్యేకించి కృష్ణ పరమాత్మ గీతాప్రబోధకుడు, తత్త్వ ఉపదేశకుడు. అందువల్లనే నిఖిల లోకమూ 'శ్రీకృష్ణశ్శరణం మమ' అంటోంది. 'నమో భగవతే వాసుదేవాయ' అంటూ చేతులు మోడ్చి ప్రార్థిస్తోంది. ఆయన లీలావతారుడు, పరి పూర్ణుడు. గీతోపదేశంతో సత్యదర్శనం చేయించిన జగద్గురువు. చైతన్య చరితామృతం ప్రకారం, భాగవత ఆత్మారామశ్లోక అనుసారం– సచ్చిదానందస్వరూపుడే ఆయన. విష్ణుసహస్ర నామాలూ ఇదే రీతిన స్తుతి చేస్తున్నాయి.

'దండమయా విశ్వంభర, పుండరీకదళనేత్ర హరీ' అంటూ కృష్ణభగవానుని కొలుచుకుందాం. గీతాజయంతి శుభ తరుణాన 'నందాత్మజా ఖండాత్మ సుఖదాయకాద్యంతరహిత విధి నందీశగమనాది సురగణ వందిత' అని గీతాచార్యునికి ప్రణమిల్లుదాం ప్రతీ ఒక్కరం!

'సర్వం శ్రీకృష్ణార్పణమస్తు'

# సందేహాలు సమాధానాలు

–డా॥ రేవూరు అనంతపద్మనాభరావు, 98665 86805

**ప్ర) ముక్తి, మోక్షము, సద్గతి, కైవల్యము, పరమపదసోపానము- వీటి అన్నింటి అర్థము ఒక్కటేనా?**

**- కె.రామారావు, అమలాపురం.**

**జ)** 'ముక్తి' అనేది ప్రాపంచిక బంధాల నుండి విముక్తి. ఆధ్యాత్మిక స్వేచ్ఛను సాధించి జ్ఞానోదయ స్థితికి చేరుకోవడం. ఇది కర్మ, పునర్జన్మ చక్రం నుండి ఆత్మ యొక్క విముక్తిని సూచిస్తుంది. 'జీవన్ముక్తి' అంటారు. జననమరణాల చక్రం నుండి విముక్తి పొందడం లేదా జన్మరాహిత్యాన్ని పొందడం 'మోక్షం'గా పురాణాలు చెబుతున్నాయి. ముక్తి, మోక్షం- సమానార్థకాలు. 'సద్గతి' అనే దానికి మోక్షానికీ మధ్య వ్యత్యాసం ఉంది. ఆత్మ భౌతిక శరీరాన్ని విడిచిపెట్టినప్పుడు ఆధ్యాత్మిక ప్రపంచంలో సరియైన స్థానానికి వెళ్లడం సద్గతి. 'సద్గతి ప్రాప్తిరస్తు' అంటారు. "శ్రీకైవల్యపదంబు చేరుటకునై చింతించెదన్" అని పోతన భాగవత ప్రథమ పద్యంలో కోరుకొంటాడు. సుఖదుఃఖ మోహరహిత స్థితి. "యం ప్రాప్య నివర్తంతే తద్ధామ పరమం మమ" అని గీతాచార్యుడు ప్రవచించాడు. ఇక 'పరమపద సోపానమంటే అంతిమ మెట్టు, ప్రక్రియ, ప్రయాణప్రయత్నం-ఈ మూడింటిలో ఆనందముంటుంది. పై పదాలు వేరైనా స్థూలభావం ఒకటే.

**ప్ర) దశ దానాలు అంటారు గదా. వాటిలో అత్యుత్తమమైనది ఏది?**

**- వేలూరి రామ్మోహన్‌రావు, ఏలూరు.**

**జ)** శాస్త్రనియమానుసారం దానయోగ్యమైనవి కొన్ని మాత్రమే. వాటినే దానం చెయ్యాలి.

శ్లో॥ గోభూతిల హిరణ్యాజ్య వాసో ధాన్యగుడాని చ।
రౌప్యం లవణ మిత్యాహుః దశదానాః ప్రకీర్తితాః॥

దూడతో కూడుకున్న ఆవు, భూమి, నువ్వులు, బంగారం, ఆవునెయ్యి, వస్త్రాలు, ధాన్యం, బెల్లం, వెండి, ఉప్పు అనేవి దశ దానాలు. మంత్ర పూర్వకంగా దానం చెయ్యాలి. దానఫలితాలిలా ఉన్నాయి-

**దానచింతామణి గ్రంథంలో తెలుపబడిన వివరాలు:** 'గోదానం' వలన దాతకు స్వర్గలోకప్రాప్తి కలుగుతుంది. 'భూదానం' వలన శివలోకప్రాప్తి. 'తిలదానం' వలన విష్ణులోకప్రాప్తి. 'హిరణ్యదానం' వలన అగ్నిలోకప్రాప్తి. 'ఆజ్యదానం' వలన ఇంద్రలోకప్రాప్తి. 'వస్త్రదానం' వలన సకలశుభప్రాప్తి. 'ధాన్యదానం' వలన దిక్పాలకలోకప్రాప్తి. 'బెల్లం'(గూడ) దానం వలన అనంతసంపదల ప్రాప్తి. 'రజత దానం' వలన వంశాభివృద్ధి. 'లవణ దానం' వలన ఆయుర్దాయము లభిస్తాయి. దానం తీసుకొనే వారికి ఏదో ఉపకారం చేస్తున్నామనే భావనతో చేయరాదని శాస్త్రం చెబుతోంది.

**ప్ర) కుజమహాదశ జరుగుతున్నవారు తప్పనిసరిగా సుబ్రహ్మణ్యస్వామిని పూజించాలా?**

**- ఎం.వెంకటమహాలక్ష్మి, పామర్రు.**

**జ)** సుబ్రహ్మణ్యస్వామిని (మురుగన్) మంగళవారాలలో భక్తిశ్రద్ధలతో పూజించడం కుజగ్రహసంబంధంగా చేస్తారు. భార్యాభర్తలమధ్య విభేదాలు, ఆరోగ్య సమస్యలు, భూతగాదాల పరిష్కరణకు ఈ కార్తికేయపూజ నిర్వహిస్తారు. కృత్తికా నక్షత్రం నాడు, షష్ఠి తిథినాడు, మంగళ వారాలు ఉపవాసం ఉంటారు. మానవుని జాతకచక్రంలో మొత్తం 120 సంవత్సరాలుగా దశాభుక్తులు నడుస్తాయి. చంద్రదశ 10 సంవత్సరాల తర్వాత కుజ దశ 7 సంవత్సరాలు. కుజదోషం వివాహ విషయంలో చూస్తారు. కుజుడు మంగళుడు. భూమికి అధిపతి. దేహంలోని రక్త కణాల కారకుడు. మాంగల్యకారకుడు. మేష, వృశ్చికరాశులు స్వక్షేత్రంకాగా, మకరరాశి ఉచ్ఛ. కర్కాటకరాశి నీచ. యోగకారకుడు కుజుడైతే ధైర్యసాహసాలు కలిగి ఉంటారు. భూస్థితి కలిగి ఉంటారు. కుజుడు బలహీనంగా ఉంటే అన్నదమ్ముల మధ్య తగాదాలు వస్తాయి. జాతకంలోని ఇతర గ్రహస్థితులనుబట్టి ఆయా దశల ఫలితాలు లభిస్తాయి. కుజుడు 4, 7, 8, 10 స్థానాలను చూస్తాడు. కుజుడు బలంగా ఉంటే సంఘంలో పేరు ప్రఖ్యాతులు లభిస్తాయి. కుజమహర్దశలో జాతకుడు ప్రమాదాల నుండి రక్షింపబడతాడు. ఆత్మవిశ్వాసము, ఉత్సాహము పెరుగుతాయి ఈ దశాకాలంలో.

**ప్ర) కృత-త్రేతా-ద్వాపర యుగాలకంటే కలియుగంలో 'భక్తిమార్గం' ద్వారా సులభంగా మోక్షం సాధించవచ్చునా?**

**- ఎం.వి.సులోచన, భీమవరం.**

**జ)** కృతయుగంలో 'విష్ణుధ్యానము', త్రేతా యుగంలో 'యజ్ఞాలు', ద్వాపరయుగంలో 'భగవత్ పూజనము', కలియుగంలో 'సంకీర్తనము' గొప్పవిగా పురాణాలు చెబుతున్నాయి. కృతాదియుగంలో సాధించబడేవి కలియుగంలో హరిసంకీర్తనం ద్వారా సాధ్యపడుతాయని విష్ణుపురాణం చెబుతోంది. బ్రహ్మవైవర్తపురాణాన్ని అనుసరించి కలియుగంలో తపస్సు యోగసాధనలు సాధ్యపడవు. 'సంకీర్తనం' పరమసాధనం. దాని ద్వారా మోక్షసాధన సులభం. నవవిధ భక్తిమార్గాల్లో 'సంకీర్తన' ప్రధానంగా పేర్కొనబడింది. స్కాంద పురాణంలోని చాతుర్మాస్యమాహాత్మ్యం కూడా ఇదే వివరణ ఇస్తోంది.

# శ్రీ జాబాలి ఆంజనేయస్వామి, తిరుమల

– శ్రీమతి కె. విజయలక్ష్మి, 70131 85538

శ్రీరామతీర్థంలో స్నానమాచరించి తడిబట్టలతో ప్రదక్షిణలు చేసినంతనే సకల వ్యాధులు, గాలిచేష్టలు, గ్రహ పీడలు, భూత, ప్రేత, పిశాచబాధలు, కష్టాలు తొలగిపోయి ఆయురారోగ్యాలను, జీవన సౌఖ్యాన్ని ప్రసాదించే దేవుడు **'శ్రీజాబాలి ఆంజనేయస్వామి!'**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, కలియుగ వైకుంఠం అయిన తిరుమలక్షేత్రంలో తిరుమలకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో 'జాబాలి' క్షేత్రం ఉంది. జాబాలి మహర్షి 'జపం' చేసిన స్థలం కనుక 'జాపాలి' అనే పేరు ఏర్పడి కాలక్రమంలో 'జాబాలి'గా మారినట్లు ప్రతీతి. ఇప్పటికీ ఈ క్షేత్రం 'జాపాలి', 'జాబాలి' అనే పేర్లతో వ్యవహరింపబడుతూ ఉంది. జాబాలి మహర్షి జపంవల్ల స్వయంభువుగా కొలువుదీరిన స్వామివారు కనుక శ్రీజాబాలి ఆంజనేయస్వామి అనే పేరు ఏర్పడింది. కాగా, శ్రీఆంజనేయస్వామి ఈ ప్రాంతంలోనే అంటే జాబాలి ప్రాంతంలోనే జన్మించినట్లు కథనం. తల్లి అంజనాదేవి తపస్సు చేసి హనుమంతుడిని ప్రసవించడంవల్ల ఈ కొండకు అంజనాద్రి అనే పేరు ఏర్పడినట్లు చెప్పబడుతోంది.. తాను జన్మించిన ప్రాంతంలో స్వామి స్వయంభువుగా కొలువుదీరిన ప్రాంతం జాబాలి!



స్థలపురాణం పరిశీలిస్తే పూర్వం జాబాలిమహర్షి శ్రీఆంజనేయస్వామి వారిని ప్రసన్నం చేసుకోవాలని భావించి.. వివిధప్రదేశాలలో పర్యటిస్తూ అనేకచోట్ల తపస్సు చేసుకుంటూ.. చివరకు వేంకటాచలమునకు చేరాడు.

ఈ ప్రాంతం చాలా మహిమాన్వితమైనదిగా గుర్తించిన మహర్షి అక్కడ ఆశ్రమాన్ని ఏర్పాటు చేసుకుని నిత్యం జపం, హోమం చేయసాగాడు. ఈ విధంగా కొంతకాలం తపస్సు చేసిన అనంతరం మహర్షి తపస్సుకు మెచ్చి శ్రీఆంజనేయస్వామి ప్రత్యక్షం కాగా, మహర్షి పరిపరి విధాలుగా ప్రార్థించి ఇక్కడనే కొలువుదీరమని కోరాడు. మహర్షి కోరికను మన్నించి శ్రీఆంజనేయస్వామివారు స్వయంభువుగా కొలువుదీరినట్లు స్థలపురాణ కథనం. అంతే కాక, ఇక్కడ స్వామివారిని పూజించడం వల్ల జాబాలిమహర్షికి ఏర్పడిన 'వాక్‌దోషం' తొలగిపోయినట్లు చెప్పబడుతూ ఉంది. కాగా, శ్రీరామచంద్రమూర్తి వానరసైన్యం సహకారంతో లంకా రాజ్యంపై దండెత్తి రావణాసురుడిని ఓడించి, సీతాదేవిని వెంట బెట్టుకుని అయోధ్యకు వెళ్తూ మార్గ మధ్యలో జాబాలికి చేరుకుని కొంతకాలం ఉండినట్టు





శిష్యుడైన **బావాజీ** తిరుమలకు చేరాడు. ఆయనకే **'హథీరాంజీ'** అని పేరు. ఆయన జాబాలి చేరుకుని ఇక్కడ తపస్సు చేయడంతో పాటూ, ఇక్కడ చిన్న ఆలయాన్ని నిర్మింపజేసినట్లు చరిత్ర చెబుతోంది. హథీరాంజీమఠం ఆధ్వర్యం లోనే ఆలయం నడుస్తూ ఉంది. ఇటీవలి కాలంలో ఆలయంలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలు జరిగి నూతనంగా ఆలయాన్ని నిర్మింపజేశారు.

ప్రతీరోజూ పూజలు జరిగే జాబాలి శ్రీఆంజనేయ స్వామివారి ఆలయంలో ప్రతి సంవత్సరం చైత్రమాసంలో పూర్ణిమనాడు **హనుమజ్జయంతి**ని పురస్కరించుకుని ప్రత్యేక ఉత్సవాలను నిర్వహిస్తారు. అలాగే వైశాఖమాసంలో కూడా ప్రత్యేకపూజలను నిర్వహిస్తారు. ఆశ్వీయుజ, మార్గశిర మాసంలో వచ్చేటటువంటి దేవీనవరాత్రులు, హనుమద్వ్రతం; దీపావళి, వైకుంఠఏకాదశివంటి పర్వదినాల సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు.

జాబాలి శ్రీఆంజనేయస్వామి వారి ఆలయం ప్రతి రోజూ **ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి ఏడుగంటల వరకు తెరచి ఉంటుంది.** తిరుమల క్షేత్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పాపవినాశనం వెళ్లే దారిలో ఉంది. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు జీపులు, టాక్సీలలో తిరుమల నుంచి జాబాలికి వెళ్లవచ్చు. తిరుమలనుంచి పాపవినాశంకు ఆర్టీసివారు బస్సులు నడుపుతూ ఉన్నారు. ఈ మార్గంలో **శ్రీవేణుగోపాలస్వామి ఆలయం**, జాబాలి, ఆకాశగంగ, పాపవినాశనంలను దర్శించి తిరిగి తిరుమలకు ఈ బస్సులో చేరుకోవచ్చు. శ్రీవేణుగోపాల స్వామి వారి ఆలయం తర్వాత **'జాబాలి'** బస్‌స్టాపు ఉంది. ఇక్కడి నుంచి సోపానమార్గంలో సుమారు ఒక కిలోమీటరు దూరంలో జాబాలి ఆలయం ఉంది.

శ్రీ జాబాలి ఆంజనేయస్వామి వారిని దర్శించి భక్తులు తరించవచ్చు.

'జైశ్రీరామ్'

చెప్పబడుతూ ఉంది. ఈ సమయంలో శ్రీరాముడు స్నానం చేసిన తీర్థానికి **'శ్రీరామతీర్థం'** అనీ, సీతాదేవి స్నానమాచరించిన తీర్థానికి **'సీతాతీర్థం'** అనే పేర్లు ఏర్పడినట్లు కథనం.

ఎత్తైనకొండలు, వాటిపై పచ్చని చెట్లు, వివిధతీర్థాల మధ్య జాబాలి ఆలయం ఆహ్లాదకరమైన వాతావరణంలో దర్శనమిస్తుంది. శ్రీజాబాలి ఆంజనేయస్వామివారి ఆలయం ఉత్తర భారతదేశ నిర్మాణశైలిలో ఉత్తరాభిముఖంగా ఉంది. ఆలయానికి ఎదురుగా కొనేరు (తీర్థం) ఉంది. దీనికి 'శ్రీరామతీర్థం' అని పేరు. పూర్వం శ్రీరాముడు ఈ తీర్థంలో స్నానమాచరించినందువల్ల దీనికి 'శ్రీరామతీర్థం' అనే పేరు ఏర్పడింది. ఆలయం వెలుపల వేపచెట్టు ఉంది. ఈ చెట్టు మొదలు వద్ద వినాయకుడి రూపం సహజసిద్ధంగా ఏర్పడింది. భక్తులు ముందుగా వినాయకుడిని దర్శించుకుంటారు.

ప్రధానఆలయం– ముఖమండపం, ప్రదక్షిణమండపం, గర్భాలయాలను కలిగి ఉంది. గర్భాలయంలో స్వయంభువుగా కొలువుదీరిన శ్రీఆంజనేయస్వామి అభయహస్తం ధరించి, మరో చేతిలో గదను ధరించి దర్శనమిస్తూ ఉన్నాడు. స్వామి వారికి వెండికవచమును ఉంచి పూజలు నిర్వహిస్తారు. కాగా, స్వామివారిని గురించి అనేక మాహాత్మ్యాలు, నమ్మకాలు ప్రచారంలో ఉన్నాయి. వివిధవ్యాధులు, వివిధకష్టాలు ఉన్నవారు ఆలయానికి ఎదురుగా ఉన్న **శ్రీరామతీర్థం**లో స్నానమాచరించి తడిబట్టలతో ప్రదక్షిణలు చేస్తే అవన్నీ తొలగిపోయి ఆయు రారోగ్యాలు సిద్ధిస్తాయని, కష్టాలు తొలిగిపోతాయని విశ్వాసం.

చారిత్రకంగా పరిశీలిస్తే పూర్వం ఢిల్లీకి దగ్గరలోని రామానంద ఆశ్రమ పీఠాధిపతి అయిన అభయానందజీ

# 'ఆళ్వార్ల' వైభవం

- శ్రీ ఆర్.సుధన్వన్

## తిరుమంగై ఆళ్వార్

తిరుమంగైఆళ్వార్ల తిరునక్షత్రం 'తమిళకార్తికనెల-కృత్తికానక్షత్రం'. ఆళ్వార్ల పరంపరలో ఆఖరివారు తిరుమంగై ఆళ్వారు. వీరు శ్రీవారి ధనుస్సు అయిన 'శార్ఙ్గాంశం'. 'తిరుమంగై' రాజధానిగా చేసుకొని పాలించడం వల్ల తిరుమంగై అని పిలువబడ్డాడు. ఆస్థాన వైద్యుని కుమార్తె అయిన 'కుముదవల్లి' ఇతణ్ణి పెళ్ళాడదానికి శ్రీవైష్ణవ సంప్రదాయ పద్ధతులను షరతులను కొన్నింటిని విధించింది. ఆ షరతులకు కట్టుబడి కల్యాణం చేసుకున్నాడు. షరతులు అమలుపరచటానికై మహారాజుకు చెల్లించాల్సిన కప్పాన్ని ఖర్చు చేశాడు. మహారాజుకు ధనం చెల్లించడానికి దారి దోపిడీలకు పాల్పడ్డాడు.

పెరుమాళ్ మారువేషంలో వచ్చి అతను వెళ్తున్న మార్గం సరైంది కాదని చెప్పి, అష్టాక్షరీ మంత్రం ఉపదేశించాడు. తిరుమంగై ఆళ్వార్ ఒక్కరే భువిలో దాదాపు 82 దివ్యదేశాలను సందర్శించి, నీలమేఘశ్యాముని కీర్తిస్తూ వెయ్యికి పైగా పాశురాల్ని గానం చేశాడు. వీరు మొత్తం 6ప్రబంధాలను రచించారు. **'పరకాలుడు', 'కలియన్'** అని కూడ వీరిని వ్యవహరిస్తాడు.

## తిరుప్పాణాళ్వార్

వీరు 'తమిళకార్తికనెల-రోహిణి నక్షత్రం'లో అవతరించారు. వీరు ఉన్న దివ్యదేశం **'ఉరయూరు'**. ఆలయ ఉత్సవాల్లో శ్రీమహావిష్ణువును కీర్తిస్తూ కీర్తనలను చక్కని స్వరంతో హరికీర్తనలు గానం చేస్తూ నిరంతరం వీణ ధరించడం వల్ల **'తిరుప్పాణన్'** అని పిలిచేవారు. ప్రతి రోజు కావేరి ఒడ్డున రంగనాథుని కీర్తిస్తూ, స్వామిని దర్శించాలని బాధపడుతుండేవాడు. ఆలయ అర్చకులు ఒకనాడు అతనిని గమనించి అతని మీద రాళ్ళు విసిరారు. తిరుప్పాణన్‌కు తలపైన గాయమైంది. ఆలయంలో మూలవిరాట్టుకు కూడా అదే చోట గాయమైంది. ఆనాటి రాత్రి ఆలయ ప్రధానార్చకుని కలలో కనిపించి, తన గాయానికి కారణం తెలిపి, తిరుప్పాణన్‌ని తీసుకొనిరమ్మన్నాడు. పరంధాముని ఆజ్ఞపై ప్రధానార్చకుడు తిరుప్పాణన్‌ను తన భుజాలమీద మోసుకొని ఆలయానికి వచ్చారు. దైవాన్ని చూసిన వెంటనే తిరుప్పాణన్ స్వామిని కీర్తిస్తూ గానంచేసిన పదిపాశురాల సంకలనాన్ని **'శ్రీఅమలనాదిపిరాన్'** అంటారు. వీరికే **'శ్రీపాణయోగి'** అని సంస్కృతనామం. వీరు దైవాన్ని కీర్తిస్తూ సశరీరంగా స్వామి వారిలో ఐక్యమయ్యారు.

## తొండరడిప్పొడి ఆళ్వారు

వీరు తమిళమార్గళినెల 'జ్యేష్ఠ' నక్షత్రంలో అవతరించారు. వీరే 'విప్రనారాయణు'లుగా ప్రసిద్ధి చెందారు. వేద వేదాంగాల అధ్యయనం, భాషాపాండిత్యంలో కృషి చేసిన విప్రనారాయణ శ్రీరంగనాథుని అలంకరణను చేసేవారు. అందుకే ఈయనను 'వైజయంతిమాల' అంశ అని అంటారు. ప్రతినిత్యం పూలను సేకరించి స్వామికి అలంకరించేవారు. పరిస్థితుల కారణంగా విప్రనారాయణ భక్తిమార్గాన్ని వదిలివేయగా అతనిని తిరిగి భక్తిమార్గంలోకి మళ్ళించడానికి పరమాత్మ అతనిని దొంగగా చిత్రించి చెరసాలలో వేస్తాడు. ఆ తర్వాత విప్రనారాయణ అక్కడ తన తప్పు తెలుసుకున్నాడు. తర్వాత కమలాక్షుడు క్షమించాడు. నిజం తెలుసుకున్న రాజు భక్తుడని విడుదల చేశాడు. తర్వాత శ్రీవైష్ణవగురువులను సేవించి **'తొండరడిప్పొడి ఆళ్వారు'**గా ప్రసిద్ధి చెందాడు. **"తిరుమాలై"** మరియు **"తిరుపళ్ళిమెళుచ్చి"** అనే పాశురగ్రంథాలతో తొండరడిప్పొడి ఆళ్వారు విష్ణుభక్తికి నిదర్శనంగా నిలిచారు. **'భక్తాంఘ్రిరేణువు'** అని వీరి సంస్కృత నామము.







డిసెంబరు 13, 14, 29న ఆళ్వార్ల శాత్తుమొఱ వర్షతిరునక్షత్రాల సందర్భంగా...

ఉపనిషద్వాక్యం

# 'భగవంతుని అర్చించండి'

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

మానవుడైనవాడు చేయాల్సిన యజ్ఞాలలో 'దేవయజ్ఞం' ప్రధానం. దేవతల కృప లేనిదే మనుగడ లేదు. జీవుడు తన కర్మఫలానికి అనుగుణంగా దేవతాశక్తులు నిండిన శరీరాన్ని సంపాదించుకుంటాడు. ఆయా కర్మలకు, ఆయా దేవతల అనుగ్రహమే ఆయా ఇంద్రియాల శక్తులు.

సూర్యుని నుండి 'చూపు', వాయువు నుండి 'ఘ్రాణం', వరుణుని నుండి 'రుచి', అగ్ని నుండి 'వాక్కు', ఇంద్రుని నుండి 'హస్తాలు...' ఇలా ఒక్కొక్క అవయవంలో ఒక్కొక్క దైవశక్తి ఉంటుంది. వీటన్నింటినీ శాసించే బుద్ధి వద్ద నాడీమండలంలో ఆయా దేవతాస్థానాలున్నాయి.

మన శరీరాన్ని మనం నిర్మించుకోలేదు. దానిని నియమించడమే మన చేతిలోది. కనుక దానిలోనున్న భౌతిక వివరాలే మనకు తెలియవు. అవి తెలియాలంటే సూక్ష్మమైన భౌతిక వైజ్ఞానిక సాధనాలు కనిపెట్టాలి. వాటిని శాసించే దైవిక శక్తుల్ని తెలుసుకునేందుకు మరో సూక్ష్మవిజ్ఞానం ఉంది. దానిని వేదసంస్కృతి బోధిస్తుంది.

అందుకే **'యజ్ఞో భువనస్య నాభిః'** అని శ్రుతి చెప్తోంది. దేవతాశక్తులన్నిటికీ మూలమైన పరబ్రహ్మాన్ని శివునిగానో, విష్ణువుగానో, జగదంబగానో భావించి పూజించే విధానం మన నిత్యజీవితంలో నిబద్ధీకరించారు మన పెద్దలు.

అయితే కాస్త మేధావులమనుకున్నవారు- ఈ పూజలన్నీ తక్కువ స్థాయికి చెందినవిగా భావించి, తమ మేధస్సే గొప్పదని వీటిని నిరసిస్తారు. అటువంటి వారిని సున్నితంగా మందలిస్తూ శ్రుతిమాత ఇలా బోధిస్తుంది:

**'అర్చత ప్రార్చత ప్రియ మేధాసో అర్చత'**
**(ఋగ్వేదం)**

**ఓ ప్రియమైన మేధావులారా! భగవంతుని అర్చించండి (ఉపాసించండి). విశేషంగా అర్చించండి.**




మనమెంత జ్ఞానులమైనా, మేధావులమైనా అనేక జన్మల కర్మబంధాలు మనకు ఉన్నాయి. అవి వాసనారూపంగా మన చిత్తంలో ఉంటాయి. అవి సమసిపోతేగానీ శుద్ధజ్ఞానం రాదు. మేధస్సువేరు- శుద్ధజ్ఞానపూర్వకమైన ఆనందానుభవం వేరు. మేధస్సు అనేకవిషయాల్ని పోగుచేయగలదు. కానీ సత్యసాక్షాత్కారం దానివల్ల కాదు. కాబట్టి కర్మవాసనాక్షయం కావాలంటే భగవత్కృప కావాలి. భగవద్భావన హృదయానికి పట్టడమే భగవత్కృప. ఆలోచించి నిర్ణయించే బుద్ధికి, ఆరాధించి ఆనందించే హృదయమూ కలవాలి. అప్పుడే జీవనం సక్రమమవుతుంది. బుద్ధికున్న శక్తి పరిమితం. దాని శారీరక హద్దులు, శక్తిపరమైన హద్దులు స్వల్పం. అందుకే యోగంతో శరీరశక్తిని వృద్ధిచేసుకుంటారు. తపస్సుతో మనశ్శక్తిని పెంచుకుంటారు.

సత్యసాక్షాత్కారం బుద్ధికి అందదు. ఆలోచన, అధ్యయనం ఒక విధమైన అవగాహనని ఇస్తుంది అంతే. పరిపూర్ణ జ్ఞానానికి అది చాలదు. ఉపాసనాబలం వల్లనే అనేక రహస్యాలు అవగతమవుతాయి. ఏ పుస్తకమూ, ఏ ప్రవచనమూ చెప్పలేని రహస్యాలు ఈశ్వరకృపవల్ల మాత్రమే స్ఫురిస్తాయి.

'మేధస్సుకి, ఉపాసన తోడైతే తాను తరించి, పదిమందినీ తరింపజేయగలడు. భగవదర్చన లేనివాడు తరించడం పూర్తిగా అసాధ్యం'- అని వేదహృదయం.

ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్
తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

## యోగ నరసింహుడు-తొండనూర్

దూరం నుంచి చిన్నకొండలా అగుపించే యోగనరసింహసన్నిధి వైపు అందరూ అడుగులు వేశారు. ఇక్కడ వయోజనుల సౌకర్యార్థం మెట్లు కూడా నిర్మించి ఉన్నాయి.

'యోగానంద నరసింహుడు' అత్యంత గంభీరంగా యోగపట్టంలో, యోగదండం ధరించి పరివేష్ఠించియున్నాడు. తమ సూక్ష్మదేహాలతో ముందుగానే గర్భాలయంలోకి చేరుకున్న నారదాదులు యోగనరసింహుని అలౌకిక దివ్యసౌందర్యాన్ని తనివితీరా ఆస్వాదించి ఆనందించారు.

కర్పూరహారతినిస్తూ భట్టర్ యోగనరసింహునికి 'యోగానంద నరసింహుడు, 'అళగియ సింగర్' (అందమైన సింహం) అనే పేర్లున్నాయని, తాయార్‌కి ప్రత్యేక సన్నిధిలేదని, జగన్మాత 'విజయలక్ష్మి' యోగనరసింహుని వక్షఃస్థలంలో విరాజిల్లుతుందని, ఆలయవిమానం పేరు 'బ్రహ్మవిమాన'మని వివరించాడు. ప్రహ్లాదుడు ప్రతిష్ఠించిన మూలమూర్తి యోగ ముద్రతో, యోగపట్టంలో తూర్పుముఖసేవ ప్రసాదిస్తూ భ్రూనేత్రంతో అలరారుతున్నాడు.

ఈ మూర్తిని రామానుజాచార్యులు స్వయంగా సేవించారు. ఆయనను 'పిళ్లై జీయ్యర్' అని కూడా సంబోధిస్తారు. ఈ మహిమాన్వితమూర్తిని కణ్వ, ముద్గల, గౌతమ, భృగు, దత్తాత్రేయ, ప్రహ్లాద, మేధాతిథి, వ్యాస, శౌనక, నారదులు దర్శించి సేవించారని తెలియజేశాడు.

గంధర్వులు ఇది వింటున్న నారదుని ముఖంపై కదలాడిన చిరునవ్వు గమనించారు. యుగాల నాడు తాను దర్శించి సేవించిన విషయం ఈనాటికీ ప్రజానీకం గుర్తుంచుకుని ప్రస్తావించటం నారదునికి సంతోషాన్ని కలిగించింది.

తీర్థప్రసాదవితరణ చేసిన భట్టర్ భక్తులందరి శిరస్సులపై యోగదండంతో దీవించారు. అక్కడ శఠారి లేకపోవటం గమనార్హం. ప్రధాన సన్నిధి బయటకు వస్తూనే ఎడమ వైపున ఉన్న తెర తొలగించారు భట్టర్. తమ నిజరూపమైన ఆదిశేషుని పడగనీడలో అద్భుతమైన రామానుజులమూర్తి కొలువై ఉంది. ఆ మూర్తి ఇరుపక్కలా హొయసల సామ్రాజ్యలాంఛనాలు చెక్కబడి ఉన్నాయి. భట్టర్ మంగళహారతిచ్చేటప్పుడు రామానుజులమూర్తిని అందరూ స్పష్టంగా చూడగలిగారు.

ఉదయవరుల ఉదరభాగంపై పాముపెలుసులు భక్తబృందానికి చూపించి రామానుజులు కేవలం ఆదిశేషుని అవతారమని మరొక్కసారి పేర్కొన్నాడు భట్టర్. అక్కడే ఉన్న ఒక వెదురుపెట్టె చూపించి రామానుజులు తమ మడివస్త్రాలను అందులో పెట్టుకునేవారని చెప్పాడు. ఈ చారిత్రాత్మకస్థలంలోనే రామానుజులు తెర వెనుక కూర్చుని, వెయ్యిపడగల ఆదిశేష రూపంలో వెయ్యిమంది సన్యాసులతో శాస్త్రచర్చ జరిపి వారిని ఓడించారని భక్తులకు భట్టర్ తెలియపరిచారు.

యోగనరసింహసన్నిధిలోని రామానుజులకు కాషాయ వస్త్రాన్ని సమర్పించి, సేవించి, ప్రార్థిస్తే స్త్రీలకు గుణవంతుడైన భర్త, సత్సంతానం, సత్సంగం ప్రాప్తిస్తాయని చెబుతారు.

*(ఇంకా ఉంది)*

మన మహర్షులు

# ఋష్యశృంగ మహర్షి

- శ్రీమతి భమిడిపాటి వి.బాలత్రిపురసుందరి

పూర్వం కశ్యపుడు అనే పేరుగల గొప్ప మహర్షి ఉండేవాడు. ఆయన కొడుకు విభాండకుడు, బ్రహ్మచారి. ఎప్పుడూ తపస్సు చేసుకుంటూ ఉండేవాడు. ఒకనాడు ఆయన నదిలో స్నానం చేసి వచ్చాక ఆ నది నీళ్ళు తాగిన ఒక మృగానికి అంటే జంతువుకి ఒక అబ్బాయి పుట్టాడు. పుట్టింది జంతువుకే అయినా, ఆ జంతువు ఎవరో తెలుసుకుందాం.

ఒకసారి చిత్రరేఖ అనే అప్సరస ఇంద్రుడి సభలో నాట్యం చేస్తోంది. ఆవిడ నాట్యానికి చాలా లేళ్ళు వచ్చేశాయి. అంత చక్కటి నాట్యం ఆవిడది. పాపం అన్ని లేళ్ళు ఒకేసారి వచ్చేసరికి చిత్రరేఖ నాట్యం చేస్తూ ఆ లేళ్ళవైపు చూసింది. ఇంద్రుడికి కోపం వచ్చి చిత్రరేఖని 'మృగం అవుగాక!' అని శపించాడు. పాపం చిత్రరేఖ బాధపడింది. 'ఎలాగూ శపించేశాను, అది తిరిగి తీసుకోవడానికి కుదరదు. నీకు మనిషి రూపంలో ఒక అబ్బాయి పుడతాడు. అప్పుడు నీకు శాప విమోచనం అవుతుంది' అన్నాడు ఇంద్రుడు.

ఆ చిత్రరేఖే ఈ మృగం అన్నమాట. మృగానికి పుట్టాడు కాబట్టి ఆ అబ్బాయికి ఒక చిన్న కొమ్ము కూడ ఉంది. ఆ అబ్బాయి ఎవరోకాదు అతడే ఋష్యశృంగమహర్షి. ఋష్య శృంగుడు పుట్టాక, చిత్రరేఖకి శాపవిమోచనం కలిగి మళ్ళీ ఇంద్రలోకానికి వెళ్ళిపోయింది.

ఒకసారి విభాండకుడు ఆ అడవిలోకి వచ్చి ఋష్య శృంగుణ్ణి చూసి, దివ్యదృష్టితో ఆ పిల్లవాడు తనవల్ల పుట్టిన వాడేనని తెలుసుకొని తనతో తీసుకువెళ్ళి అన్ని విద్యలూ నేర్పించాడు.

ఆ కాలంలో రోమపాదుడు అనే పేరుగల రాజు అంగ దేశాన్ని పాలించేవాడు. అతనికి పిల్లలు లేరు. ఒకసారి తన స్నేహితుడైన దశరథమహారాజు ఇంటికి వెళ్ళాడు. దశరథుడికి 'శాంత' అనే ఒక కూతురుంది. ఆ పిల్లని చూసి రోమపాదుడు 'తాను పెంచుకుంటాను' ఇవ్వమని అడిగాడు. దశరథుడికి ఇంక పిల్లలు లేరు కదా! అందుకని పెంచుకునేందుకు ఇవ్వనన్నాడు.

కాని వసిష్ఠమహర్షి త్రికాలాలు తెలిసినవాడు కావడం వల్ల దశరథుడికి నచ్చచెప్పాడు. శాంతని రోమపాదుడుకి పెంపకం ఇవ్వడం వల్ల మంచే జరుగుతుందనీ, దాని వల్ల వాళ్ళిద్దరికి మగపిల్లలు పుట్టే అవకాశం ఉందనీ చెప్పాడు. చివరకి ఆరునెలలు దశరథమహారాజు ఇంట్లోనూ, ఆరునెలలు రోమపాదుని ఇంట్లోనూ శాంత పెరిగేటట్లుగా వసిష్ఠమహర్షి ఒప్పందం కుదిర్చాడు. శాంతను తీసుకుని రోమపాదుడు అంగదేశానికి వెళ్ళిపోయాడు.

కొంతకాలం తర్వాత రోమపాదుడు పిల్లలకోసం బ్రాహ్మణులకి దానధర్మాలు చేయడం మొదలుపెట్టాడు.

ఒక బ్రాహ్మణుడు తాను దానం తీసుకుని మళ్ళీ తన కొడుకుని తీసుకువచ్చి అతనికి ఒక గోవునిమ్మన్నాడు. దానికి రోమపాదుడు 'ఈ బ్రాహ్మణులకి ఆశ ఎక్కువ. ఎంత ఇచ్చినా చాలదు' అని నిందించాడు. దానికి ఆ బ్రాహ్మణుడు 'తన కొడుక్కి ఒక్క గోవు ఇమ్మని అడిగితే మొత్తం బ్రాహ్మణజాతినే అవమానించావు కాబట్టి నీ రాజ్యంలో వర్షాలే లేకుండా పోతాయి' అని శపించి, తండ్రీ కొడుకులిద్దరూ వెళ్ళిపోయారు.

రోమపాదుడు పశ్చాత్తాపంతో మిగిలిన బ్రాహ్మణులని సంప్రదించాడు. వాళ్ళు రోమపాదుడికి ఋష్యశృంగమహర్షి గురించి వివరించి, ఆయన్ని రాజ్యంలోకి రప్పిస్తే మంచి వర్షాలు పడతాయని చెప్పారు. రోమపాదుడు కొంతమంది వేశ్యల్ని పంపి ఋష్యశృంగమహర్షిని ఎలాగయినా రాజ్యంలోకి రప్పించమని చెప్పాడు.

అందమైన ఆ వేశ్యలు ఋష్యశృంగుడి తండ్రి విభాండకుడు ఆశ్రమంలో లేని సమయం చూసి ఆశ్రమంలోకి వెళ్ళారు. ఋష్యశృంగుడు వాళ్ళు కూడా మునికుమారులనుకొని వాళ్ళకి ఆతిథ్యం ఇచ్చాడు. కొంచెంసేపు అతనితో గడిపేసి వెళ్ళిపోయారు. మర్నాడుకూడ వాళ్ళు అలాగే వచ్చి

ఋష్యశృంగుణ్ణి తపస్సు చేసుకునేందుకు వాళ్ళ ఊరు రమ్మని చెప్పారు.

పాపం ఋష్యశృంగుడికి ఎప్పుడూ తండ్రితో అడవిలోనే ఉండటం వల్ల మగ, ఆడ తేడా కూడ తెలియదు. వాళ్ళతో అంగదేశం వెళ్ళాడు. ఋష్యశృంగుడు అంగదేశంలో అడుగు పెట్టగానే వానలు కురిసి చక్కగా పంటలు పండాయి. ఒకనాడు ఋష్యశృంగుడు శాంతని చూసి, ఆమెని పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు.

శాంత దశరథుని కూతురని, తాను పెంచుకుంటు న్నానని చెప్పాడు రోమపాదుడు. దశరథుణ్ణి పిలిపించి, శాంత ఋష్యశృంగుల పెళ్ళి ఘనంగా జరిపించాడు.

రోమపాదుడు ఋష్యశృంగుడి ఆశీర్వాదంతో పిల్లల కోసం యాగం చేసి, ఒక కొడుకుని పొందాడు. ఆనందంతో శాంతాఋష్యశృంగుల్ని భక్తితో చూసుకున్నాడు.



కొంతకాలం గడిచాక ఋష్యశృంగుడు శాంతతో కలిసి అయోధ్యకి వెళ్ళాడు. శాంత వస్తోందని అయోధ్యానగరం అంతా చక్కగా అలంకరించారు. కౌసల్య, సుమిత్ర, కైకేయి అనే పేరు గల దశరథుని ముగ్గురు భార్యలు ఎదురువచ్చి శాంతా ఋష్యశృంగుల్ని తీసికెళ్ళారు.

ఋష్యశృంగుడు దశరథుడికి మగపిల్లలు లేరని అశ్వ మేథయాగం, పుత్రకామేష్టి చేయించాడు. కులగురువయిన వసిష్ఠ మహర్షి సహాయంతో పుత్రకామేష్టి శాస్త్రోక్తంగా చేయించాడు ఋష్యశృంగుడు. ఆ అగ్నిహోత్రంలోంచి ఒక దివ్యపురుషుడు వచ్చి ఒక బంగారు పాత్రలో పాయసాన్ని ఇచ్చి దశరథుణ్ణి 'ఈ పాయసం నీ భార్యలకు ఇస్తే సంతానం కలుగుతుందని' చెప్పాడు. పాయసాన్ని ముగ్గురు భార్యలకు తినిపించి, శ్రీరామ–భరత–లక్ష్మణ–శత్రుఘ్నులనే నలుగురు కొడుకుల్ని పొందాడు దశరథుడు. పరమపవిత్రమైన యాగాన్ని పూర్తిచేయించి ఋష్యశృంగుడు భార్య శాంతను తీసుకుని తన తండ్రి విభాండకుడి ఆశ్రమానికి వెళ్ళిపోయాడు.

ఋష్యశృంగుడు ఎంత గొప్ప ఋషో తెలిసినవాడు కనుక విభాండకుడు, కొడుకు తనకు చెప్పకుండా ఆశ్రమాన్ని విడిచి వెళ్ళి పెళ్లి చేసుకున్నాడని కోపగించక, ఋష్యశృంగుణ్ణి శాంతని ఆదరించాడు. తర్వాత ఋష్యశృంగుడు ద్వాదశ వార్షిక యజ్ఞం చేశాడు.

ఏమైనా ఋష్యశృంగుడు గొప్ప తపస్సంపన్నుడే కాకుండా శ్రీమహావిష్ణువునే శ్రీరాముడుగా లోకానికి అప్పగించి, రామరాజ్యాన్ని ప్రసాదించి, రాక్షసబాధలతో సతమతమవుతున్న ప్రజల్ని కాపాడిన గొప్ప పుణ్యాత్ముడు కూడ.

ఋష్యశృంగుడు పిల్లలు లేని వారికి యజ్ఞయాగాదులు చేయించి వాళ్ళకి పిల్లలు కలిగేలా చేసి ఎన్నో రాజవంశాలు నిలబెట్టాడు. ఆయన ఎక్కడ ఉంటే అక్కడ చక్కటి వర్షాలు పడి, పంటలు బాగా పండి, ఆ రాజ్యం అంతా ధనధాన్యాలతో తులతూగుతూ ఉండేది. ఆయన మన రాజ్యంలో కాలు పెడితే చాలు అనుకునే వాళ్ళట అప్పటిరాజులు. తన ధార్మికచింతనతో లోకాన్ని కాపాడినవాడు ఋష్యశృంగుడు.

'సర్వే జనాః సుఖినో భవన్తు'

## గ్రంథసమీక్ష

# అంశుబోధిని

**రచయిత-** కుప్పావేంకట కృష్ణమూర్తి; **సైజు-**1/8 డెమ్మీ; **పుటలు-**224; **ధర-**రూ. 175/-; **ప్రతులకు-** ఎమెస్కో బుక్స్ ప్రైవేట్ లిమిటెడ్, 1-2-7, భానూ కాలనీ, గగన్ మహల్ రోడ్డు, దోమలగూడ, హైదరాబాదు- 500 029. తెలంగాణ. ఫోను- 040-23644028.

భరద్వాజమహర్షి రచించిన ప్రాచీనవైదిక- సూర్య కిరణ విజ్ఞానశాస్త్ర మూలగ్రంథం **"అంశుబోధిని".**

ఒకప్పుడు భరద్వాజుడు, బ్రహ్మదేవుణ్ణి "మొత్తం వేదాలను పారాయణ చేసేంతటి ఆయుష్షును కోరాడు". అది నాకు సాధ్యం కాదంటూనే, అనంతమైన నాలుగువేద రాశుల నుంచి కేవలం నాలుగు పిడికిళ్ల వేదభాగాలను మాత్రం అందించాడు బ్రహ్మ.

భరద్వాజముని ఆ వేదభాగాలను పారాయణం చేస్తుండగా, అందులో అథర్వణ వేదభాగంలోని **"సూర్యోప నిషత్తు"** ఆయనను బాగా ఆకర్షించగా, దాన్ని పరిశోధించాడు.

సూర్యకిరణాల్లో ఉన్న స్థూల, సూక్ష్మ, కారణ శక్తుల వల్ల 'స్థూలసృష్టి, సూక్ష్మసృష్టి, కారణసృష్టులు' సంభవిస్తాయని కూడా ధ్రువీకరించాడు. వాటిని నిరూపించడానికి ఆ మహర్షి 12 అధ్యాయాలుగా, వేయి అధికారాల్లో ఉన్న సూత్రాల రూపంగా వివరిస్తూ, సూర్యకిరణ విజ్ఞానపరంగా 'అంశుబోధినీ' గ్రంథాన్ని అందించాడు.

"సోలార్ ఎనర్జీ" అని ఈ రోజుల్లో పిలువబడుతూ, సూర్యకిరణశక్తి మీద అందింపబడిన ఈ పురాతన గ్రంథాన్ని 1931లో శ్రీసుబ్బరాయశాస్త్రిగారు ఆంగ్లానువాద సహితంగా బెంగుళూర్లో ప్రకటించారు. అయితే, అందులో మొదటి అధ్యాయం తప్ప మిగతా అధ్యాయాలు దొరకనే లేదు"- అంటూ ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞానరంగాల్లో విశేషకృషి చేసిన ప్రముఖ రచయిత శ్రీకుప్పావేంకటకృష్ణమూర్తిగారు, వీటిపై అనేక పరిశోధన వ్యాసాలను ప్రకటించారు. వాటి అన్నింటి సారసంగ్రహంగా, కుప్పా వేంకటకృష్ణమూర్తిగారు ప్రస్తుతం అందిస్తున్న నూతన గ్రంథమే ఈ "అంశుబోధిని".

దీనిలో మన భారతీయులకు ఉన్న సృష్టివిజ్ఞానం, సృష్టిపథరేఖలు, సూర్యకిరణవిజ్ఞానం, ఇప్పటి "బిగ్‌బ్యాంగ్" సిద్ధాంతంతో దగ్గరి పోలికఉన్న కశ్యప-కూర్మశక్తుల విస్ఫోటనం మున్నగు అంశాలను "ఫ్లోచార్ట్" ద్వారా రచయిత వేంకటకృష్ణమూర్తిగారు అత్యంత సరళంగా అందించారు.

ఐ.ఐ.సి.ఐ., రిటైర్డు చీఫ్ సైంటిస్ట్ డా॥వై.రామ చంద్రరావు ఈ గ్రంథానికి 'ముందుమాట'ను రాస్తూ ఇలా అంటారు. "మూలగ్రంథాన్ని పలుమార్లు అధ్యయనం చేసిన మా బోటి వార్లకు, ఈ అనువాదాన్ని ఇంత సరళంగా తీసుకరావడానికి శ్రీకృష్ణమూర్తిగారు ఎంత శ్రమపడ్డారో! అని ఆశ్చర్యం వేయకమానదు"- అనే మాట ప్రత్యక్షర సత్యంగా కనిపిస్తోంది.

సూర్యుని ప్రతి కిరణంలోను ఒక తమశ్శక్తి అంత ర్లీనంగా దాగి ఉంటుందనీ, దాన్ని ఒక యంత్రం ద్వారా కూడా కొలువ వచ్చని చెప్పటమే గాక, ఆ యంత్రాన్ని ఈ గ్రంథంలో వర్ణించిన తీరు ఆశ్చర్యకరం.

పురాతన భారతీయవిజ్ఞానమార్గంలో అధ్యయనం చేయాలన్న ఆసక్తి ఉన్న ప్రతివారు తప్పక చదివి తీరవలసిన గ్రంథం ఈ "అంశుబోధిని".

*- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, తిరుపతి.*



నమస్తులసి సర్వజ్ఞే పురుషోత్తమ వల్లభే।
పాహిమాం సర్వపాపేభ్యఃసర్వసంపత్ ప్రదాయినీ॥

ఓ తులసీమాతా! నీవు శ్రీహరిని భర్తగా పొందినదానవు. సకలసంపదలను ప్రసాదించు దానవు. సర్వము తెలిసినదానవు. మా పాపాలను తొలగించి మమ్ములను అనుగ్రహించు తల్లీ!

## శ్రీవేంకటేశ్వరలీలలు



# అనుకుంది జరిగింది

– శ్రీమతి భాస్కరభారతీదేవి, 94412 76050

కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామివారు అంటే నాకు చాలా భక్తి. 2024 నవరాత్రి బ్రహ్మోత్సవాలలో వాహన సేవలను టీ.వి. ద్వారా శ్రీవేంకటేశ్వర భక్తిఛానల్‌లో నేను చూశాను. అక్కడి జనసంద్రాన్ని చూసినప్పుడు తిరుమలకు భక్తులు ఎక్కెడెక్కడివారో రాగలగుతున్నారు. మనం ఇక్కడే ఉండి చూడలేకపోతున్నానని బాధపడ్డాను. ఇంట్లో బొమ్మల కొలువుపెట్టి, అమ్మవారిని కలశంలో ఆవాహన చేసి, ప్రతి రోజూ కుంకుమార్చన చేస్తున్నాను. ఈ పుణ్యక్షేత్రంలోనే ఉండే అదృష్టభాగ్యాన్ని కలిగించారు స్వామీ! అంతే అని భావించాను. అన్ని వాహనసేవలు పూర్తి అయ్యాయి. ఆఖరిరోజున చక్రస్నానం టీవీలో చూస్తున్నప్పుడు, స్వామివారి చక్రంకు స్నానం చేయించిన సమయంలో భక్తులు పుష్కరిణిలో మునకలు వేయడాన్ని చూసి, 'ఆహా! ఎంత అదృష్టవంతులు వీరు' అని అనిపించింది. ఇంతలో మా స్నేహితురాలు శ్రీమతి ప్రసన్నగారు వారింటికి నన్ను విజయదశమి తాంబూలానికి ఆహ్వానించారు. వారింటికి వెళ్లినప్పుడు తాంబూలంతో పాటుగా ఆవిడ ఒక బాటిల్‌లో శ్రీవారిపుష్కరిణి జలం ఇచ్చారు. నా ఆనందానికి అవధులు లేవు. అంతుకు మూడు, నాలుగు గంటల ముందు చక్రస్నానం




చూస్తూ, 'మనకూ ఆ జలం దొరికితే బాగుండును' అని అనుకున్నాను. స్వామివారే నా స్నేహితురాలి రూపంలో పుష్కరిణి జలం పంపించారు. ఎంత విశేషమో! ఆవిడ ఇచ్చిన పుష్కరిణి జలం భక్తితో తలమీద చల్లుకున్నాను. స్వామివారికి మనస్ఫూర్తిగా నమస్కరించి కృతజ్ఞతలు చెప్పుకున్నాను. అదే రోజు సాయంత్రం 7 గం॥లకు ఎవరో మా ఇంటి తలుపు తట్టారు. ఎదురుగా ఎదురింటివారు ఒక గాజు గ్లాసులో నీళ్లు పట్టుకుని నిలుచున్నారు. నాకు అర్థం కాలేదు. 'ఏమిటది?' అని అడిగాను. 'తిరుమల స్వామివారి అభిషేకజలమని' అన్నారు. నాకు సంతోషంతో నోటమాట రాలేదు. ఆ అభిషేకజలాన్ని తీసుకొని భద్రపరచాను. స్వామివారి తీర్థజలం ఇచ్చిన వారికి కృతజ్ఞతలను తెలియబరిచాను. ఆ విధంగా విజయదశమి రోజు ఉదయం చక్రస్నానజలం మరియు సాయంత్రం అభిషేకజలాన్ని స్వామివారే ఆ ఇద్దరు వ్యక్తుల రూపంలో అందజేశారు. ఇది నిజంగా స్వామివారి యొక్క లీలావిశేషం తప్ప, వేరే కాదు. 'నీవు తప్ప నాకు దిక్కు ఎవరూ లేరు' అని శరణాగతి కోరితే, స్వామి వారు తప్పక మనకు అండగా ఉండి, తోడుగా వస్తారు.

ఓం నమో వేంకటేశాయ

# బాలనీతి

# గురు శిష్యులు

– శ్రీమతి బి.వి.టి.సుందరి

అనగా అనగా ఒక ఊళ్ళో ఒక గురువుగారు ఉండే వారు. ఆయన దగ్గర చాలామంది శిష్యులు చదువుకుంటూ ఉండేవారు. శిష్యులందరూ అన్నదమ్ముల్లా కలిసి మెలిసి ఉండేవారు.

ఒకరోజు గురువుగారికి పొరుగూర్లో పని పడింది. ఒక శిష్యుణ్ణి మాత్రం వెంట తీసుకెళ్ళారు. ఇద్దరూ నడిచి వెడుతున్నారు. శిష్యుడు తనకు తెలియని ఎన్నో విషయాల గురించి అడగడం, అతడి సందేహాలన్నీ తీరుస్తున్న గురువు భగవంతుడి గురించి చెప్తూ... 'భగవన్నామం చేస్తే ఏ పనైనా సులువుగా జరిగిపోతుంది' అన్నారు. 'రామనామం' అన్నింటి కంటే గొప్పది. రామనామం జపిస్తే సంసారమనే సముద్రాన్ని అవలీలగా దాటవచ్చు... ఎటువంటి కష్టాన్నయినా ఎదుర్కోవచ్చు!' అన్నారు.

గురువుగారు చెప్పింది వింటున్న శిష్యుడికి ఒక సందేహం వచ్చింది. "గురువుగారూ! ఇప్పుడు మనం ఇలా నడిచి వెళ్ళేటప్పుడు ఏదైనా నది వస్తే?" అన్నాడు.

"దానిదేముందిరా శుభ్రంగా దాటవచ్చు!" అన్నారు గురువుగారు. "రామ రామ"– అంటూ నదిని దాటెయ్యగలమా గురువుగారూ!" అడిగాడు శిష్యుడు ఆశ్చర్యంగా.

"ఎందుకు దాటలేమురా? భగవంతుడి మీద భక్తి ఉండాలేగాని, భగన్నామంతో ఎంత పనయినా జరుగుతుంది. ఏకాగ్రత ఉండాలి! అంతే! సరే, తొందరగా నడు, పొద్దు పోతోంది. మనం ఇంకా చాలా దూరం నడవాలి!" అన్నారు.

శిష్యుడికి ఆకలేసింది. "గురువుగారూ! ఆకలేస్తోంది." అన్నాడు. "అదిగో కొంచెం ముందుకి వెడితే చెట్లు కనిపిస్తున్నాయి కదా... అక్కడ ఆగి ఎక్కడైనా నీళ్ళు దొరుకుతాయేమో చూసుకుని "ఫలహారం చేద్దాం!" అన్నారు.

నడుస్తూ అనుకున్న చోటికి వచ్చేశారు. దగ్గర్లో ఒక నది కనిపించింది. అక్కడ ఆగి ఫలహారం చేశారు. కొంచెంసేపు విశ్రాంతి తీసుకున్నారు. "ఇంక బయల్దేరదాము లేరా!" అంటూ గురువుగారు కూడా లేచారు.

"గురువుగారూ! ఇప్పుడు మనం ఈ నదిని దాటాలి కదా...?" అని అడిగాడు. "అవునురా అదే చూస్తున్నాను. చుట్టుపక్కల ఏమీ కనిపించడం లేదు. ఒక పడవ కాని, ఏమన్నా బల్లకట్టు కానీ కనిపిస్తుందేమోనని చూస్తున్నాను" అన్నారు.

"నదిని దాటడానికి పడవలూ, బల్లకట్లూ ఎందుకండీ! రామనామం ఉందిగా! 'రామ రామ రామ' అనుకుంటూ ఏపనైనా చేసెయ్యచ్చు అన్నారుగా... అలాగే అనుకుంటూ నదిని దాటేద్దాం! అన్నాడు శిష్యపరమాణువు.



తను చెప్పినవన్నీ శ్రద్ధగా విన్నందుకు శిష్యుడికేసి అభిమానంగా చూశారు గురువుగారు. భుజం తట్టి "తెలివైన వాడివిరా! అంటూ ఒక పడవుందేమో చూడరా!" అన్నారు.

"పడవెందుకు గురువుగారూ! సంసారమనే సముద్రాన్ని దాటించ గలిగిన రామనామం .. ఈ నదిని దాటించలేదా..? రామనామం జపిస్తూ నదిని దాటేద్దాం!" అన్నాడు.

గురువుగారికి విసుగొచ్చింది. "ఎలా వెడతావురా?" అన్నారు. "ఎలాగేమిటీ? మీరు చెప్పినట్టే వెడదాం! భయమైతే నేను ముందు వెడతాను. మీరు నా వెనుక రండి!" అన్నాడు అసలయిన శిష్యుడు. వెంటనే రెండు చేతులూ జోడించి "రామ రామ రామ" అంటూ రామనామాన్ని జపిస్తూ నది మీద నడుచుకుంటూ ఆవలి గట్టుకి చేరిపోయాడు శిష్యుడు.

వాడు వెళ్ళిన వైపే చూస్తూ నిలబడిపోయారు గురువుగారు. "మీరు కూడా రామ నామం చేస్తూ వచ్చెయ్యండి గురువుగారూ! కావాలంటే మీతో పాటు నేను కూడా అంటాను. భయపడకుండా వచ్చెయ్యండి!" అన్నాడు.

గురువుగారు ఇంకా తేరుకోలేదు. రామనామంలో అయితే గొప్పతనం ఉంది... అది గొప్పది అని చెప్పడంలో కూడా గొప్పతనం ఉంది. దాన్ని ఆచరణలో పెట్టడం అన్నింటి కంటే గొప్పది. నా గురువు నాకు చెప్పింది, నేను నా శిష్యుడికి చెప్పాను. వాడు దాన్ని ఆచరణలో పెట్టాడు. ఎంత గొప్పవాడు నా శిష్యుడు..!

గురువుగారు ఆలోచిస్తూండగానే 'రామ రామ రామ' అంటూ శిష్యుడు తిరిగి వచ్చేశాడు. రామనామం చేస్తూ తిరిగి నదిమీద నడుస్తూ వెనక్కి వచ్చిన శిష్యుణ్ణి చూస్తూండిపోయారు గురువుగారు.

అలా నిలబడిపోయిన గురువుగార్ని చూసి "పాపం గురువుగారికి ఏకాగ్రత కుదరలేదేమో!" అనుకున్నాడు శిష్యుడు. గురుభక్తి, ఏకాగ్రత ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించాడు గురువుని మించిన శిష్యుడు!!

**నీతి** సాధనలో భక్తి, ఏకాగ్రత ఉంటే ఏదైనా సాధించవచ్చు.

## అధ్యయనోత్సవాలు - తిరుమల

**(2024, డిసెంబరు 30 నుండి 2025, జనవరి 23 వరకు)**

| రోజు | పగల్‌పత్తు ఉత్సవం-పాశురాలు | ఆళ్వారుల పేరు |
|---|---|---|
| 01. | "ఇయఱ్పా" తొడక్కం | పొయ్‌గై, పూద, పేయ్, తిరుమళిశై, శఠకోపన్ |
| 02. | "తిరుప్పల్లాండు" తొడక్కం | పెరియాళ్వార్ |
| 03. | "శెన్నియోంగు"తొడక్కం | పెరియాళ్వార్ |
| 04. | "విణ్ణీలమేలాప్పు" | ఆండాళ్ నాచ్చియార్ |
| 05. | "ఊనేఱు శెల్వత్తు" | కులశేఖరాళ్వార్ |
| 06. | "వాడినేన్ వాడి" | తిరుమంగై ఆళ్వార్ |
| 07. | "వాడమరుదిడైపోగి" | తిరుమంగై ఆళ్వార్ |
| 08. | "పండైన్నాత్తెయుమ్" | తిరుమంగై ఆళ్వార్5-7 |
| 09. | "తెల్లియార్ దేవర్క్కుం" | తిరుమంగై ఆళ్వార్8-2 |
| 10. | "కాదిల్ కడిప్పిట్టు" | తిరుమంగై ఆళ్వార్ (10-7) |
| 11. | చిన్నశాత్తుమొఱ "తిరునెడుందాండగమ్" | తిరుమంగై ఆళ్వార్ |
| | **రాపత్తు ఉత్సవం - పాశురాలు** | |
| 12 | "తిరువాయ్‌మొళి" ముదల్‌పత్తు | నమ్మాళ్వార్లు |
| 13 | "తిరువాయ్‌మొళి" రెండవపత్తు | " |
| 14 | "తిరువాయ్‌మొళి" మూడవపత్తు | " |
| 15 | "తిరువాయ్‌మొళి" నాల్గవపత్తు | " |
| 16 | "తిరువాయ్‌మొళి" ఐదవపత్తు | " |
| 17 | "తిరువాయ్‌మొళి" ఆరవపత్తు | " |
| 18 | "తిరువాయ్‌మొళి" ఏడవపత్తు | " |
| 19 | "తిరువాయ్‌మొళి" ఎనిమిదవపత్తు | " |
| 20 | "తిరువాయ్‌మొళి" తొమ్మిదవపత్తు | " |
| 21. | "తిరువాయ్‌మొళి" పత్తాంపత్తు పెద్దశాత్తుమొఱ | " |
| 22. | 'కణ్ణినుణ్ శిరుత్తాంబు' | మధురకవి ఆళ్వారు |
| 23. | 'ఇరామానుశనూత్తందాది' 'ఉపదేశరత్తినమాలై' | అముదనార్, వరవరముని |
| 24. | వరాహస్వామి సన్నిధిలో అధ్యయనోత్సవం (ఏకాంతం) | |
| 25. | తణ్ణీర్‌అముదు ఉత్సవం (తిరుమలనంబి వంశీయులు) (అధ్యయనోత్సవ సమాప్తి) | |

ఆయుర్వేదం


# జామలో ఔషధ గుణాలు పుష్కలం

- డా॥చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

"పంచభూతాత్మకే దేహే హ్యాహారః పాంచభౌతికః"- అంటుంది మన సనాతన భారతీయ వాఙ్మయం. ఆహార రూపంలో మన దేహంలోనికి ప్రవేశించిన పంచభూతాల అంశాలు జీర్ణమై ఆయా ధాతువులను చేరి విలీనమవుతాయి. అందుకే ఆయుర్వేదం ఆహారానికి విశిష్టమైన ప్రాధాన్యతనిస్తుంది. మనం ఆహారంగా వాడే పదార్థాలలో పళ్ళు, కాయగూరలు, ఆకుకూరలు, పప్పు, గింజ, తృణధాన్యాలు మొదలగు వాటిలో స్థూల, సూక్ష్మ పోషకాలుండి మన ఆరోగ్యపరిరక్షణకు సదా ఉపయోగపడుతూ ఉంటాయి.

**జామకాయలు, జామపళ్ళు** రెంటిని మనం ఆహార ద్రవ్యంగా ఉపయోగిస్తాం. అట్లే జామాకుల్లో కూడా ఔషధగుణాలను, రసాయనాలను నిక్షిప్తీకరించి, వివిధవ్యాధులను ఎదుర్కొనే సమర్థతను భగవంతుడు వీటిలో పొందుపరచి జీవకోటికి ప్రసాదించాడు. జామను ఏయే వ్యాధుల్లో ఎలా ఉపయోగించుకోవాలో ప్రస్తుతం తెలుసుకుందాం.

**మంగు మచ్చలు:** ఒక జామాకును ముక్కలుగా చేసి తగినంత పెరుగులో కలిపి కొద్దిసేపు నాన్చి మెత్తగా నూరి మచ్చలపై పట్టించి గంటసేపాగి కడిగేస్తే మంచి ప్రయోజనం చేకూరుతుంది. అట్లే మొటిమల సమస్య కూడా తగ్గిపోతుంది.



**తెల్లబట్ట సమస్యకు:** 200 మి.లీ. నీటిలో 4, 5 జామాకులను ముక్కలగా చేసి, దానిని ఒక స్పూన్ తాటికలకండ వేసి, ఆకులు రంగు మారేంత వరకు నీటిని మరిగించి, చల్లార్చి వడగట్టి ఉంచుకుని రెండుపూటలా సగం ప్రమాణం చొప్పున సేవిస్తుంటే స్త్రీలలో కలిగే ఈ సమస్యలో శీఘ్రంగా గుణం కనిపిస్తుంది.

**దంతాలు దృఢంగా ఉండేందుకు:** రోజూ ఒకసారి 200 మి.లీ. నీటిలో ఒక జామకాయ ముక్క, 3, 4 చిటికెల పటికపొడి వేసి మరిగించి, చల్లార్చి వడగట్టి పుక్కిలిస్తే పిప్పిపంటి బాధలు, చిగుళ్ళ సమస్యలు లేకుండా ఉంటాయి.

**నోటి దుర్వాసన తగ్గేందుకు:** రోజూ ఒకట్రెండుసార్లు పూటకు 3, 4 లేత జామ ఆకుల్ని నమిలి మింగుతుంటే నోటి దుర్వాసన తగ్గటమే కాక చిగుళ్ళ నుంచి రక్తస్రావం కావటం కూడా తగ్గుతుంది.

**ప్లేట్ లెట్ కణాల సంఖ్య పెరిగేందుకు:** 250 మి.లీ. నీటిలో 10 జామాకులని చిన్న ముక్కలుగా వేసి ఆకులు రంగు మారేంత వరకు నీటిని మరిగించి, చల్లార్చి వడగట్టి ఒకట్రెండు స్పూన్ల తేనె కలిపి త్రాగాలి. ఇలా రోజూ 2,3 సార్లు వాడుకుంటే డెంగ్యూ, చికెన్‌గున్యాలాంటి విషజ్వరాలు తగ్గుతాయి. ప్లేట్‌లెట్ కణాల సంఖ్య త్వరగా పెరుగుతుంది.

**శిరోజాలు రాలకుండా ఉండేందుకు:** వారానికి ఒకట్రెండుసార్లు ఒక లీటరు నీటిలో గుప్పెడు జామాకులు వేసి నీటిలో బాగా మరిగించి, చల్లార్చి ఆ నీటిని వడగట్టి జుట్టు కుదుళ్ళకు పట్టించి గంటసేపాగి తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

**గజ్జి, తామర, దురద లాంటి చర్మ సమస్యలకు:** జామాకులలో కొద్దిగా పసుపు, కాస్త నీరు చేర్చి మెత్తగా నూరి లేపనం చేస్తూంటే వివిధరకాల చర్మ సమస్యలు తగ్గిపోతాయి.

**మలబద్ధక సమస్య తగ్గేందుకు:** రోజూ రాత్రి పడుకునేటపుడు బాగా మాగిన జామపండును ముక్కలుగా కోసి వాటిపై కొద్దిగా మిరియాలపొడి, అరబద్ద నిమ్మరసం చల్లి సేవిస్తే మలబద్ధక సమస్య తగ్గటమే కాక, జీర్ణశక్తి మెరుగై, వ్యాధినిరోధకశక్తి పెరుగుతుంది.

**జిగటవిరేచనాలు మరియు ఐ.బి.యస్. (ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్) సమస్య తగ్గేందుకు:** రోజూ ఒకట్రెండుసార్లు 50- 100 మి.లీ. నీటిలో దోరగా ఉన్న జామపండుని ముక్కలుగా చేసి 7, 8 గంటలు అలాగే ఉంచిన పిదప ఆ నీటిని వడగట్టి త్రాగితే ఈ సమస్యల్లో చక్కటి ప్రయోజనం చేకూరుతుంది.

**దీర్ఘకాలిక పుళ్ళు, వ్రణాలు తగ్గేందుకు:** తగినన్ని జామాకులను మిక్సీలో వేసి పొడి చేసి, ఆ పొడిని ఐదురెట్లు కొబ్బరినూనెలో కలిపి సన్నని మంటపై కొద్దిసేపు మరిగించి, చల్లార్చి, వడగట్టి నిల్వ ఉంచుకుని రోజు రెండుసార్లు పై పూతకు వాడుకుంటుంటే గుణం కనిపిస్తుంది. ఇలా వాడటంవల్ల ఒంటిదురదలు, దద్దుర్లు కూడా తగ్గుతాయి.

డిసెంబరు,2024

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం–** ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి. తీసుకున్న ఋణములు భారమయ్యే అవకాశముంది. వాగ్వివాదములకు చోటులేకుండా జాగ్రత్తపడాలి.



**వృషభం–** అన్నదమ్ముల సహకారం ఉంటుంది. సుఖసంతోషాలకు లోటుండదు. ఆస్తుల విలువలు పెరగడం, రత్నములు మణులు మొదలగు వస్తువులను అమ్మివేయడం వలన ఆదాయం కల్గుతుంది. మిత్రులు బంధువులతో ఆశావహంగా గడుపుతారు.



**మిథునం–** ఇది ఆనందదాయకమైన, అదృష్ట వంతమైన కాలం. మీ ప్రయత్నాలలో విజయం పొందుతారు. వ్యాజ్యాల విషయాల్లో కూడా ఉప శమనం కనిపిస్తుంది. మీ స్థితి మరియు సంపాదన కూడా మెరుగుపడుతుంది.



**కర్కాటకం–** సహోద్యోగులతో వివాదాలను ఉత్తమంగా తప్పించుకోవాలి. విద్యార్థుల ప్రయత్నాలు కార్యరూపం దాలుస్తాయి. చదువు విషయంలో మరింత కృషి మరియు శ్రద్ధ అవసరం కావచ్చు. పెట్టుబడులకు సమయం కాదు.



**సింహం–** మీ తోబుట్టువులు మీతో మంచి సమయాన్ని గడపడానికి ఇష్టపడతారు. మీకు మంచి సామాజిక జీవితం ఉంటుంది. మీరు సంగీతం, కళలు మొదలైన సృజనాత్మక విషయాలలో సమయాన్ని వెచ్చించే అవకాశం ఉంది.



**కన్య–** అధికారం, సమాజంలో ఉన్నత స్థానం లభిస్తుంది. భౌతికసుఖాలను, విలాసాలను అనుభవిస్తారు. మీరు కొత్త స్నేహితులను కూడా సంపాదించుకుంటారు మరియు ఆనందకరమైన జీవనశైలితో జీవనంలో ముందుకు సాగుతారు.



**తుల–** విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంచుకుని, వక్తృత్వపు పోటీల్లోనూ, పోటీ పరీక్షల్లోనూ విజయం సాధిస్తారు. వ్యవసాయ దారులకు అధికదిగుబడుల వలన ఆదాయం, అన్ని వృత్తుల వారికి సమృద్ధి.



**వృశ్చికం–** ధనం నిల్వచేస్తారు. కళత్ర పుత్రులతో సుఖజీవనం. కుటుంబ వాతావరణం బాగుంటుంది. తోబుట్టువులతో సత్సంబంధాలు బాగుంటుంది.



**ధనుస్సు–**దూరప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. మార్గావరోధాలు కల్గుతాయి. ఫ్లూ జ్వరాలు, కండరముల నొప్పులు వంటి ఆరోగ్య సమస్యల బారినపడే అవకాశం ఉంది.



**మకరం–** వ్యవసాయదారులకు కలసివచ్చే సమయం. శత్రువులపై జయం. వృత్తి ఉద్యోగాలలో గౌరవం, ఆర్థిక పరిపుష్టి, కుటుంబవృద్ధి అవుతుంది. వ్యాపారాలలో ముందంజ, ఆర్థికలాభాలు వస్తాయి.



**కుంభం–** అభివృద్ధి మరియు లాభాలను పొందే శుభ తరుణం ఇది. ఈ కాలంలోనే ఉద్యోగ విషయంలో ఉన్నతి అంటే ప్రమోషన్ మరియు జీతం పెంపు కల్గుతుంది. కొత్త అవకాశాలను పొందుతారు





**మీనం–** స్నేహితుల నుండి మద్దతు మరియు అన్ని ప్రయత్నాలలో విజయం పొందుతారు. సంపద వృద్ధిని సూచిస్తోంది. ఆర్థికసమస్యల నుండి బయటపడతారు. సమాజంలో మెరుగైన స్థానం మరియు ఆనందాన్ని అనుభవించే సమయం.

చిత్ర కథ

# మహాదాత

కథ- శ్రీ డి.శ్రీనివాసదీక్షితులు
చిత్రాలు- శ్రీ కె.ద్వారకనాథ్




వెంటనే కర్ణుడు భటుని ఆదేశించాడు, గంధం చెక్కల్ని తీసుకు రమ్మని. భటుడు వెళ్లి తిరిగి వచ్చాడు.
ప్రభూ! ఎండిన గంధపు చెక్కలు ఎక్కడా దొరకలేదు!
అలాగా...
కర్ణుడు భటుల్ని పిలిపించాడు. భవనానికి సమకూర్చిన గంధం చెక్కల స్తంభాల్ని గొడ్డలితో నరికించాడు. భవనం కూలిపోయింది. ఆ చెక్కల్ని బ్రాహ్మణునికి ఇచ్చాడు కర్ణుడు.
అలాగే అంగరాజా!
నీ భార్య దహనసంస్కారం ఈ చెక్కలతో నిర్వహించు.
అంగరాజు ఇచ్చిన కట్టెల్ని బండి మీద తీసుకుపోతూ ఆ విషయం అర్జునునికి చెప్పాడు బ్రాహ్మణుడు.
అర్జునా! గ్రహించావా?
అర్జునుడు తలవంచుకున్నాడు. శ్రీకృష్ణుడు వివరించాడు.
దానం చెయ్యాలనే కోరిక బలంగా ఉంటే ఎలాగైనా చేస్తాడు. అతనికి ఏవీ అడ్డంకులుండవు.
శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వాడు. కర్ణుని దానగుణంలో గొప్పదనం అర్జునుడు బాగా గ్రహించాడు.
అంగరాజు మహాదాతగా లోకంలో ప్రసిద్ధి చెందాడు. అతని కీర్తి శాశ్వతంగా నిలిచిపోయింది.

# బాలవినోదం

## సంఖ్యలను కలిపి రంగులు వేయండి



## చిత్రాన్ని చూడండి రంగులు వేయండి






అ) గీతాజయంతి
ఆ) స్కందషష్ఠి
ఇ) ధనుర్మాసం


పైన చెప్పిన పర్వదినాలకు సంబంధించి తగినట్లుగా వృత్తంలోని సంఖ్యలను వ్రాయండి.

ప్రతి పర్వదినాలకు సంబంధించిన చిత్రాలను కనుగొనండి.



జవాబు:
అ) 2, 3, 10, 12
ఆ) 5, 7, 9, 11
ఇ) 1, 4, 6, 8

పూమాలతో ఉన్న గోదాదేవి శ్రీకృష్ణుని చేరే మార్గం కనుగొనండి!



## భక్తివాక్యం

క్రింది అక్షరాలను సరిచేసి వాక్యాలుగా అమర్చండి...




దం మా ర న ప గో దం వి

జవాబు: గోవిందం పరమానందం



చక్రంలో అదే రంగులో ఉన్న ప్రశ్నకు తగిన సమాధానం వ్రాయండి!!







జవాబులు:
అర్జునుడు, శ్రీమద్భగవద్గీత, రథసారథి, హనుమాన్, పద్దెనిమిది, కౌరవ-పాండవులు, పద్దెనిమిది, శ్రీకృష్ణావతారం



## క్రింద ఇచ్చిన తాళాలకు సరియైన తాళం చెవిని కనిపెట్టండి!





జవాబులు

1=ii, 2=i, 3=iv, 4=iii, 5=v

## నీతిని తెలుసుకుందాం!


క్రింది బొమ్మలను వరుసగా చేర్చి నీతివాక్యాన్ని తెలుసుకోండి!




| నీతి - ఐక్యమత్యమే మహాబలం | జవాబులు - 2, 3, 4, 1 |
|---|---|



విశ్వదాభిరామం | వేమన పద్యసూక్తి



## ఏదీ శాశ్వతంగా సొంతం కావు

భూమి నాది యన్న భూమి పక్కున నవ్వు;
దానహీను జూచి ధనము నవ్వు;
కదనభీతు జూచి కాలుడు నవ్వును;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** దానహీనుడు= దానం చేయనివాడు; కదన భీతుడు= యుద్ధానికి భయపడేవాడు; కాలుడు= యముడు.

**భావం:** ఈభూమి నాది అంటే భూమి నవ్వుతుంది. లోభిని చూచి ధనం నవ్వుతుంది. యుద్ధం అంటే భయపడేవాణ్ణి జూచి యముడు నవ్వుతాడు.

**వివరణ:** భూమి ఎవరికీ సొంతం కాదు. ఇప్పటికి ఆ భూమిని ఎంతమంది తమసొంతం అనుకున్నారో. భూమి అలాగే ఉంది. నాది అనుకున్నవాళ్లు దాన్ని వదిలి వెళ్లిపోయారు. నేడు నీది, రేపటి కెవరిదో! అలాగే లోభివాడు ధనం పోగుచేసుకుని ఇదంతా నాది అనుకుంటాడు. దానం చేస్తే తరిగిపోతుందని ఎవరికీ ఇవ్వకుండా దాచిపెడతాడు. కాని వాడూ వెళ్లిపోతాడు. ఆ ధనం మాత్రం ఇక్కడే ఉంటుంది. దానం చేస్తే ఆ పుణ్యమైనా వెంట వచ్చేది కదా! యుద్ధం చేస్తే చచ్చిపోతానేమో నని భయపడే వాణ్ణి చూచి యముడు నవ్వుకుంటాడు. యుద్ధం చేయకపోయినా, ఎప్పుడో ఒకప్పుడు మరణించక తప్పదు. యముడి దగ్గరకు పోక తప్పదు. భూమి, ధనం, ప్రాణం ఏవీ శాశ్వతం కావు.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## శౌరికి కలిగె లక్ష్మియు, కౌస్తుభరత్నాలు

ఊరక వచ్చు బాటపడ కుండిననైన ఫలం అదృష్టమే
పారగ గల్గు వానికి బ్రయాసము నొందిన దేవదానవుల్
వారలటుండగా నడుమ వచ్చిన శౌరికి గల్గి గాదె శృం
గారపు బ్రోవు లక్ష్మియును గౌస్తు భరత్నము రెండు భాస్కరా!



**తాత్పర్యం**

ఏమీ చేయకున్ననూ ఎటువంటి ప్రయాసలు పడ కుండానే వచ్చే సంపద అదృష్టమే కావచ్చు లేక పూర్వ పుణ్యఫలము కావచ్చు. అది ఎట్లనిన దేవతలు రాక్షసులు చెరోవైపున పాలసముద్రమును చిలుకగా మధ్యన వచ్చిన విష్ణువుకు లక్ష్మీదేవియు మరియు కౌస్తుభమణియు రెండూ చేరె కదా!

– వ్యాఖ్యాత: డా॥ పల్లేరు వీరాస్వామి

## జూలై నెల క్విజ్-27 సమాధానాలు

| | |
|---|---|
| 01) వకుళమాలి | 11) సత్యభామ |
| 02) హంస | 12) వేదం |
| 03) ఏనుగు | 13) ఓంకారం |
| 04) ముమూలనార్ | 14) పరమపదసోపానం |
| 05) నాదం | 15) గరుడవాహనసేవ |
| 06) బృహన్నల | 16) తాళ్లపాక అన్నమయ్య |
| 07) వేదధర్ముడు | 17) సాయుజ్యం |
| 08) ఇంద్రియాలు | 18) జన్మరాహిత్యం |
| 09) తూర్పుగోదావరి | 19) సామవేదసారం |
| 10) జ్ఞానం | 20) అర్జునుడు (బృహన్నల) |

సరైన సమాధానాలు వ్రాసినవారు–

01) తుంపూడి జైవీర్ వరుణ్, హైదరాబాద్ (తెలంగాణ)–500 056.
02) సుంకరి సాత్విక్, మెదక్(తెలంగాణ)–502 110.

# క్విజ్ 29

01) ఆనందనిలయుడు ఎన్నేండ్లు తపస్సు చేసెను? జ)..................

02) తిరుచానూరుఉన్న ప్రాంతంలో ఏ మహర్షి ఆశ్రమం ఉండేది? జ)..................

03) అమ్మవారికిఉన్న బరువైన గుణం ఏమిటి? జ)..................

04) కలియుగంలో మానవులకు ఏది తక్కువ? జ)..................

05) శ్రీనివాసుని కృపకు ఏ ధర్మమొక్కటే శరణ్యం? జ)..................

06) అంతులేని భక్తిసంపదను కల్గినవాడు ఎవడు? జ)..................

07) అపరిమిత భక్తితత్త్వాలకు ఏకైక ప్రతీక ఎవరు? జ)..................

08) శక్తిసామర్థ్యాల, ఉక్తి నైపుణ్యాల కలబోత ఎవరు? జ)..................

09) భక్తసులభుడు ఎవరు? జ)..................

10) అగస్త్యుని శిష్యుడు ఎవరు? జ)..................

11) కావడికి ఉపయోగించే బద్దపేరు? జ)..................

12) వల్లీదేవి ఎవరి కుమార్తె? జ)..................

13) తమిళనాడులో ఎన్ని దివ్యదేశాలు ఉన్నాయి? జ)..................

14) తిరుత్తేవనార్‌తొగై దివ్యదేశ మూలమూర్తి పేరు? జ)..................

15) తిరుత్తేవనార్‌తొగై దివ్యదేశంలో పాటించే ఆగమం? జ)..................

16) భగవద్గీత సారాంశాన్ని అవగతం చేసుకుంటే ఏమి కల్గుతుంది? జ)..................

17) మానవుడు చేయాల్సిన యజ్ఞాలలో ప్రధానమైనది? జ)..................

18) 'సత్యసాక్షాత్కారం' దేనికి అందదు? జ)..................

19) దశరథమహారాజు పుత్రిక పేరు? జ)..................

20) ఏ పుస్తకమూ, ఏ ప్రవచనమూ చెప్పలేని రహస్యాలు ఎవరి కృపవల్ల స్ఫురిస్తాయి? జ)..................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది **25-12-2024.**

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వబడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: .................. వయస్సు: ..................

పాఠశాల: .................. తరగతి: ..................

పేరు: ..................

చిరునామా: ..................

..................

..................

.................. పిన్‌కోడ్: ..................

ఫోన్ సంఖ్య: ..................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

__________________________________

__________________________________

__________________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) | | | | | | |

సెల్ నెం. | | | | | | | | | | | |

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

................................................ తేది : ....................

ప్రదేశం :

తేది : చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 108



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

**అడ్డం** 1)విష్ణుమూర్తి వక్షఃస్థలంలో ఉన్న మచ్చపేరు(3); 3)తిరుమలగిరి వేంకటేశ్వరునికి గుడి కట్టించిన రాజు(5); 6)శ్రీరాముడు ఈ వానరాన్ని చెట్టు చాటు నుండి చంపాడు(2); 7)పద్మసరోవరం తీరాన ఈ మహర్షి తపస్సు చేసెను(5); 10)ఒక వాయిద్యం(4); 12)తిరుచానూరులో ఉన్న సరస్సు(6); 14)దిక్కు(2); 17)రుక్మి కూతురు(4); 18)జమదగ్ని, రేణుకలకు పుట్టిన పెద్దకుమారుడు(5); 19)విష్ణువు వక్షఃస్థలాన్ని తన్నిన మహర్షి(3); 20)పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలలో ముఖ్యమైన తీర్థం(5)

**నిలువు** 1)పద్మావతిని వివాహమాడినవాడు(5); 2)నక్షత్రాలు(4); 3)యుద్ధము(4); 4)ఈ గ్రహానికి తైలాభిషేకం చేస్తారు(2); 5)యయాతి వంశంలోని రాజు(3); 8)ధృతరాష్ట్రుని కొడుకు(4); 9)ఆకాశరాజు కూతురు(4); 11)రూపాయిలో 16వ వంతు(3); 12)వ్యాసుని తండ్రి(5); 13)ఈ గ్రామంలో పద్మావతి అమ్మవారు కొలువై యున్నారు(5); 15)వైవస్వతమనువు కుమారుడు(3); 16)చెవి(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.



## 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ. 240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ. 2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ. 1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన "చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి" పేర డి.డి. తీసి పోస్టు ద్వారా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి-517 507" ఈ చిరునామాకు పంపవచ్చు.

## 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందా నెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి'పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ-మెయిల్ (chiefeditortpt@gmail.com) ఐడిని సంప్రదించాలి.

04) ఈ-మెయిల్ సౌకర్యంలేని వారు 0877-2264543, 0877-2264359 నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ భవనం, తిరుపతి-517 507" చిరునామాలో సంప్రదించవచ్చు.



SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-11-2024 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026"LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.

